శరత్ లేఖలు

ఆదర్శ గ్రంథమండలి

శరత్ లేఖలు

అనువాదం

లావణ్య

శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషానిలయము,
విభాగము ....లేఖలు........
విభాగ సంఖ్య ....6-4........

ఆదర్శ గ్రంథమండలి
విజయవాడ

ఆదర్శప్రచురణ
తొలికూర్పు
1954

వెల : రూపాయిన్నర

ముద్రణ
కె. వాణీప్రెస్ - విజయవాడ

ఇందలి లేఖలు

1. శ్రీమతి లీలారాణి గంగోపాధ్యాయ్‌కి 12
2. శ్రీ భూపేంద్రకిశోరరక్షితరాయ్‌కి 3
3. శ్రీ కృష్ణేంద్ర నారాయణ భౌమిక్‌కి 1
4. శ్రీ అవినాశచంద్ర ఘోషాల్‌కి 1
5. శ్రీ మతిలాల్ రాయ్‌కి 1
6. శ్రీ పశుపతి చటోపాధ్యాయ్‌కి 1
7. శ్రీమతి జహానారా చౌధరీకి 1
8. కాజీ వదూద్‌కి 1
9. శ్రీ ఉమాప్రసాద్ ముఖోపాధ్యాయ్‌కి 4
10. శ్రీ రవీంద్రనాథ్ ఠాకూర్‌కి 5
11. శ్రీ చారుచంద్ర వంద్యోపాధ్యాయ్‌కి 3
12. హేమేంద్ర కుమార్ రాయికి 1
13. శ్రీ దిలీప్‌కుమార్ రాయ్‌కి 23
14. శ్రీ ఫణీంద్రనాథ్ పాల్‌కి 2
15. శ్రీ ప్రమథనాథ్ భట్టాచార్యకి 1

విజ్ఞప్తి

శరత్ బాబు వ్యాసాలు మొదటిభాగంలో మేము శరత్ ప్రియులకు చెప్పిన ప్రకారం శరత్ బాబు తన మిత్రులకు రచయితలకు, పత్రికాసంపాదకులకు వ్రాసిన లేఖలను అందజేయుచున్నందుకు సంతోషించుచున్నాము. నవలలు, కథలు, వ్యాసాలు అందరికోరకు రచింపబడేవి. కాని, లేఖలు ఆ యా వ్యక్తులకోరకుమాత్రమే. రచయిత హృదయాన్ని స్పష్టంగా ప్రతిబింబించేవి లేఖలు. వీటిని చదివి శరత్ బాబు స్వభావము, వుద్దేశ్యాలు చక్కగా తెలుసుకొనవచ్చును. వీటి ప్రాముఖ్యతను పాఠకులే గ్రహించగలరు.

శరత్ బాబు లేఖలలో లభ్యమైనవి యింకను వున్నవి. వాటిలో కొన్ని కేవలం క్షేమసమాచారములకు సంబంధించినవీ, కొన్ని వ్యాపార (శరత్ బాబు రచనల ప్రచురణ) సంబంధమైనవీను. సాహిత్యంవగైరాలకు సంబంధించినవి మరికొన్ని లభ్యమైతే రెండవకూర్పులో మిగతావికూడ చేర్చగలము.

మేము ప్రకటించిన శరత్ వ్యాసాలు మొదటిభాగానికి పాఠకులు చూపిన ఆదరణతో శరత్ బాబు వివిధవిషయాలను గూర్చి వ్రాసిన మరికొన్నివ్యాసాలను సంపాదించి తెలుగులో ప్రకటించడానికి ప్రయత్నించుచున్నాము. ముందుకూడ మా ప్రచురణల నిట్లే ఆదరింతురుగాక.

— సంపాదకుడు

శ్రీమతి లీలారాణి గంగోపాధ్యాయకు వ్రాసినవి.

శివపూర్ - హౌరా,

24-7-1919.

సౌభాగ్యవతికి,

మీ ఉత్తరం, 'మిలన్' మొదటినుంచి చివరివరకూ పూర్తిగా చదివాను. నా పుస్తకం మీకు బాగుంది. రచయితకు అంతకంటె కావలసిన బహుమాన మేముంది కనుక ?

మీరు భక్తివిషయం ప్రస్తావించారు. కేవలం వినయమే కాక, సరియైన భక్తివుండే సమయంలో మీకోరిక సమంజస మైనదే. అయితే ఎవరియెడల భక్తిని ప్రదర్శిస్తారో అది ఆలో చించవలసిన విషయం.

మీతో నా కెక్కువ పరిచయం లేదు. అందువల్ల ఎక్కువ ప్రశ్నించడం మంచిది కాదు. అయినా కొద్దిగా ప్రశ్నిం చాలని అనిపిస్తోంది. మీరు బ్రహ్మసమాజానికి చెందకపోతే మీరు విధవావివాహాలు చెయ్యాలని ఎందుకనుకుంటున్నారు?

ఇది మీలో కలిగిన క్షణికమైన ఉద్రేకమా? లేక హేమ, కుసుమేంద్రుల పరిస్థితి చూచి మీకు జాలివేసిందా? ఇం దులో మీకు వాస్తవంగా ఏమీఇబ్బంది లేదా? ఒకవేళ ఇబ్బంది వుండి 'మిలన్' (సమాగమం) జరిగినంత మాత్రమునసే మీ మనస్సు సంతృప్తి చెందితే ఆ సమాగమానికి ప్రత్యేక విలువ వుందని నేను అనుకోను.

రచన విషయంలో అంటే దాని మంచి చెడ్డలను పరిశీలించి ఆ రచనకు విలువకట్టడం ఒక చిన్న ఉత్తరంలో జరిగే పని కాదు.

మీరు నా పుస్తకాలన్నీ చదివారో లేదో నాకు తెలియదు. ఒకవేళ మీరు చదివివున్నట్లయితే మన సమాజంలో విధవావివాహాలు జరగకపోవడంవల్ల ఎన్ని జీవితాలు నాశనమై పోతున్నాయో మీరు తెలుసుకునే వుంటారు. ఇంతకంటె నేనేమీ ఎక్కువ చెప్పవలసింది లేదు.

—శరత్‌చంద్రచటోపాధ్యాయ

శివపూర్—హౌరా,
బం॥ సం॥ 26—7—1919.

సౌభాగ్యవతికి,

మీఉత్తరం అందింది. నాకు ఉత్తరం వ్రాసి జవాబుకొరకు నిరీక్షించడం ఒక దురాశ. నా ఈ మంచి అలవాటు విషయం మీ కెలా తెలిసిందా అని ఆలోచిస్తున్నాను. ఎందుకంటె ఆ విషయం ఏమాత్రం కాదనడానికి వీలు లేనిది. నిజంగా నానుండి ఎవరికీ జవాబులు వెళ్లవు. నే నంత సోమరిని.

అయినా మీకు రెండు ఉత్తరాలు ఎలా వ్రాశానా అని ఆలోచిస్తే బహుశా మీరు కోరిన భక్తిభావం వల్లనే

అసంభవం కూడా సంభవమైనదని అనుకుంటాను. నిజం ఆలోచిస్తే ఇది (భక్తి) మనుష్యులచే ఎన్నెన్నో విచిత్రకార్యాలు చేయిస్తుంది. నన్ను సోదరునిగా పూజించే ఆమెకు ఉత్తరం వ్రాస్తున్నానంటే, ఆమె విషయాలకు జవాబు లిస్తున్నానంటే అందులో ఎంత ఆనందం, విశాలగర్వం దాగి వున్నాయి!

మీకు ఏమీ నేర్పలేదు. కళ్లతో చూడలేదు. ఎవరి కూతురు; ఎవరి కోడలు, — మీరెవరో ఏమీ తెలీదు. కాని నా చెల్లెలుగా మిమ్ము చెప్పుకుంటున్నారంటే — ఇట్టి అదృష్టం ఏ కొద్దిమందికో గాని కలగదు. . అట్టి అదృష్టంగల వానిలో ఒక విధమయిన మత్తు వ్యాపించిపోతుంది.

నన్ను ఎరుగకుండానే, మీరొక హిందూ కుటుంబంలోని కోడలైవుండి సంకోచించకుండా నాకు వుత్తరం వ్రాశారు. ఇలా అందరూ చేయలేరనేది నిజం. అయితే నేను సంకోచించకుండా సమాధానం ఇస్తానా ఇవ్వనా అని మీరు ఆలోచించలేదు. అందుచేతనే మీరు అలా వ్రాయగలిగారు. మీకు ఆ సంకోచంవుంటే వ్రాయగలిగేవారు కాదు. నా మీద మీకంత నమ్మకంవుంది. లేకపోతే నేనిన్ని పుస్తకాలు వ్రాయడం వ్యర్థమై పోయేదే.

బాగుంది. చెల్లెలిలాగానే మీకెప్పుడు వ్రాయాలనిపిస్తే అప్పుడు ఉత్తరాలు వ్రాయండి. నాకు నిజమైన శిష్యురాలు - సోదరికంటె ఎక్కువైన ఒక వ్యక్తి వుంది. ఆమె పేరు నిరుపమ. బహుశః నేటి సాహిత్యప్రపంచంలో మీతో పరిచయంకూడా

కలిగి యుండవచ్చు. 'దీదీ' 'అన్నపూర్ణ దేవాలయం' 'నుదుటి వ్రాత' మొదలైనవి ఆమె రచనలే. కాని ఈమె తన పదహారేళ్ళవయస్సులోనే అకస్మాత్తుగా వితంతువయ్యె నిస్తబ్ధురాలైనప్పుడు, వితంతువు కావడమే స్త్రీ జీవితంలో చరమ దుఃఖంగానూ,హానిగానూగాని లేక ముత్తయిదువగావుండడమే ఆమె జీవితంయొక్క సార్థక్యముగాని కాదు! అని నేను పదేపదే నచ్చజెప్పేవాడిని. అప్పటినుంచీ ఆమెను పూర్తిగా సాహిత్యజీవితంలో ప్రవేశపెట్టాను. ఆమె రచనలన్నీ దిద్దుతూ చెయ్యిపట్టుకుని వ్రాయడం నేర్పేవాడిని. అందుచేతనే ఇవాళ ఆమె కేవలం ఒక్క స్త్రీగానే వుండిపోక మనిషిగా తయారుకాగలిగింది.

ఇది నాకు చాలా గర్వించతగ్గ విషయం.

భర్తని ఎరుగని, భర్తముఖంచూడని బాల వితంతువుల వివాహంలో తప్పేముందని వ్రాశావు. నీనుండి ఈ విషయం రావడం గొప్పతనమే. నా రచనలు నీలో ఏ ఒక్క బాలవితంతువు యెడలనైనా జాలి కలుగజేశాయంటే నాకు పెద్ద బహుమతి లభించినట్లుంది.

ఇక నీ రచనగురించి కొద్దిగా ముచ్చటిస్తాను. ఈ రోజుల్లో బెంగాలీలో లెక్కలేనన్ని నవలలు వెలువడుతున్నాయి. వాటినుంచి నేను రెండు విషయాలు గుర్తించాను. ఒకటి పురుషుల రచనలు సాధారణంగా నిస్సారంగానూ చదువవీలులేకుండానూ వుంటున్నాయి. ఇంకేగాక వాటిల్లో పదిహేను అణాల భాగం ఇతరులనుండి దొంగిలించబడ్డ విషయాలే వుంటున్నాయి.

దీనికి వారు ఏ మాత్రమూ సిగ్గుపడడం లేదు. తమ పుస్తకాలు అమ్మకమైతేనే చాలునని వారు చూచుకుంటున్నారు.

రెండవ విషయం ఏమంటే స్త్రీల రచనల విషయంలో ఏమి వున్నా లేకపోయినా కనీసం వాటిలో సాహిత్యచౌర్యం లేదు. వారు తమ చిన్న కుటుంబంలో చూసిన విషయాలను, తమ జీవితంలో యదార్థంగా జరిగే అనుభవాలను మాత్రమే కల్పన ద్వారా ప్రకటించుటకు ప్రయత్నిస్తారు. అందుచేతనే అవి ఎక్కువగా కృత్రిమంగా వుండవు.

నీ రచనలో వున్న సత్సాహసము, సరళత్వము నన్ను ముగ్ధుణ్ణిగా చేశాయి. రచన అంత బాగుండక పోయినా కృత్రిమత్వం లేకపోవడంవల్లనే అందంగా సాగింది. శేషాంశము నాచే వ్రాయించాలని సమయం నష్టపరచుకోకు. స్వతంత్రించి పుస్తకం వ్రాయి. నువ్వు ఎవరికీ తీసిపోవని నేను ఆశీర్వదిస్తున్నాను.

ఇక్కడ నేనిప్పుడు నీకు ఒక ఉపదేశం చేయాలనుకుంటున్నాను. స్త్రీకి భర్త పరమపూజ్యుడే. అందరినీ మించిన గురువు కూడా. అలాగని స్త్రీ పురుషునికి దాసి అని అర్థంకాదు. కాని ఈ సంస్కారం స్త్రీని ఎంతగానో కించపరచి చిన్నబుచ్చుతుంది.

నువ్వు పుస్తకం వ్రాసేటప్పుడు ఈ విషయాన్ని బాగా గుర్తుంచుకోవాలి. భర్తయెడల తిరుగుబాటు భావాన్ని ఎప్పుడూ మనస్సులోనికి రానీయకు. భర్తకూడా మనిషే; మనిషిని భగవంతుడుగా ఎంచి పూజించడం అనవసరమేకాక, దానివల్ల తననూ, తనభర్తనూకూడా చిన్నబుచ్చుకుంటుంది.

నిన్ను ఒక ప్రశ్న అడుగుతున్నాను. "భర్తను ఎరుగని, చూడని వితంతువు........."

అయితే ఒకసారి భర్తతో కలిస్తే అంటే 16, 17 సంవత్సరాల వయస్సులో వితంతువైతే ఆమెకు మరొకరిని ప్రేమించడానికిగాని, పెళ్ళిచేసుకోవడానికిగాని అధికారం లేదా? ఎందుకు లేదు? కొంచెం ఆలోచిస్తే స్త్రీ భర్తయొక్క ఆస్తి అనే సంస్కారం ఇమిడివుందని బోధ పడుతుంది. స్త్రీకి స్త్రీగా అస్తిత్వం లేదన్నమాట.

"హేమ సందేహంతో రోజులుగడుపుతూంది. గట్టితనం లేని వారికి బంధనాలే మంచివి కాదా?"

వివాహమే స్త్రీకి సర్వశ్రేష్టమైన శ్రేయస్కర విధానం అని నిర్ణయమైనప్పుడు మాత్రమే ఆ బంధనాలు మంచివౌతాయి.

ఇంతవరకూ నేనెక్కడా వితంతు వివాహాలు చేయించలేదంటే నీకు ఆశ్చర్యం కలుగవచ్చు.

దీనికి సమాధానమల్లా ఒక్కటే: ప్రపంచంలో ఆశ్చర్యకరమైన విచిత్రవస్తువులు ఎన్నో వున్నాయి. ప్రయత్నించినా వాటికి కారణాలు కనబడవు.

నా ఆశీర్వాదాలు అందుకో —

శరత్ చంద్ర చటోపాధ్యాయ.

మంగళవారం. 5 ఆగస్టు 1919
శివపూర్ - హౌరా.

సౌభాగ్యవతికి,

మీ వ్రాతప్రతి, యితర రచనలు సరిగానే అందాయి. ఇంత వెంటనే సమాధాన మివ్వడానికి పూనుకుంటు న్నానంటే నాకు చాలా సంతోషంగా వుంది. ఈ సారి మీకు చెప్పవలసినవి చాలా విషయా లున్నాయి అనిపిస్తుంది. కాని మీ లాగా విషయాలన్నీ వరుసలో పెట్టి ఉత్తరం వ్రాసే శక్తి నాలో లేదు. అందుచేతనే పిల్లలు వ్రాసినట్లు చిందరవందరగా వ్రాసిన నాకాగితాలను కలిపి చదువుకోటానికి, చదువుకున్న తర్వాత అది అర్థం చేసుకోడానికి తలప్రాణం తోకకి వస్తోందని నా మిత్రులు ఫిర్యాదు చేస్తుంటారు. వీరి అభియోగం నిరా ధారమైనది కాదు. సవినయంగా దాన్ని స్వీకరిస్తున్నాను. అ యితే అట్టి నమూనా మీ యెడల నేను చూపలేదు. ఈ విష యాన్ని మీరు చాటున మీమిత్రులకు చెబితే నేనేమీ కోపం తెచ్చుకోనులెండి......

బ్రహ్మసమాజ స్త్రీలలో చాలామంది నాకు మిత్రులు న్నారు. వారికి ఒక మిత్రునివలె ఉత్తరం వ్రాయడానికి నేనెప్పు డూ సంకోచించలేదు. కాని నేటి మన సమాజ నియమాలు ఎలా వున్నాయంటే చెల్లెలికి ఉత్తరం వ్రాద్దామన్నా ఆమె భర్తగాని లేక ఇతరులుగాని ఏమనుకుంటారో అనీ, దానివల్ల ఆమె కేమైనా బాధలు కలుగుతాయేమోననీ భయపడవలసి వస్తోంది. అయినప్పటికీ మీ కిన్ని విషయాలు వ్రాయడానికి

పూనుకున్నాను. స్త్రీల విషయమై నాకుగల అనుభవంతో మీ ఉత్తరాలు చదివిన మీదట స్త్రీలలో ఆత్మగౌరవం వుత్పన్న మయ్యే వయస్సులోనే మీరీ ఉత్తరాలు వ్రాశారని తెలుసుకున్నాను. ఈ గాంభీర్యం, ఈ సాహసం, ఈ సంయమం స్త్రీలలో పాతికసంవత్సరాలలోపుగా కలగడం నే నెక్కడా చూడ లేదు. అయితే మీవిషయంలో నాది తప్పు కావచ్చునేమో కాని అలా తప్పుకాకుండా వుంటేనే నేను నిశ్చింతగా వుంటాను. ఒక యుక్త వయస్సుగల యువతితో ఉత్తరప్రత్యుత్తరాలు జరపడంలో నాకు సంకోచం ఎందుకు కలుగుతుందోననే విషయం మీ రా వయస్సు దాటిపోతే మీకు తేలికగా అర్థం అవుతుంది. కాని అన్నిటికంటె ముఖ్యమైన విషయమేమంటే నువ్వు నన్ను అన్నయ్యా అన్నావు. అన్నదగ్గర చెల్లెలికి సిగ్గుపడవలసిన అవసరంలేదు. అన్నకు తగ్గ గౌరవాన్ని, మర్యాదనూ అట్టేపెడుతూ ఎప్పుడుపడితే అప్పుడు ఏది వ్రాయాలని వుంటే అది వ్రాయమని, నీ యిష్టం వచ్చినట్లు అన్నగారిని చికాకుపరచమనీ చెబుతున్నాను. అందులో నాకు సంతోషమే గదా!

నీ ఉత్తరం వ్రాసే విధానం, ఆ భంగిమ చూస్తే మాట మాటకి నిరుపమ గుర్తుకు వస్తోంది. నీ దస్తూరికూడా ఒక్క లాగే వుంటుంది.

వర్షంలో తడవడంవల్ల నాలుగైదురోజులనుంచీ జ్వరంగా వుంది. బయటకు ఎక్కడకూ వెళ్ళలేకపోవడంవల్ల నీ ప్రతిని శ్రద్ధగా చదవగలిగే అవకాశం చిక్కింది. చదువుతూ వుంటే నా కెలా అనిపించిందో తెలుసా? దుకాణంలో విలువైన వస్తువులు

చిందరవందరగాపడిఉండడం చూచినప్పుడు, ఆ వస్తువుల విలువ తెలిసిన వానికి ఎలాంటి కష్టమనిపిస్తుందో నాకూ అలాగే ఉంది. సరిగ్గా ఒకనాడు ఇలాంటి స్థితిలోనే నిరుపమ రచనలు కూడా నా ముందుకువచ్చాయి.

చెల్లీ! నీ వద్ద చాలా విలువైన సామానుంది. కాని అది చాలా అస్తవ్యస్తంగా ఉంది. వీటిని సర్దటమే నా వృత్తి గదా; అందుచేత నిరుపమవలెనే నీ చెయ్యికూడా పట్టుకుని ఒక సంవత్సరం వ్రాయడం నేర్పానంటే, ఇంతకు ముందు నేను నిన్ను ఆశీర్వదించిన వాక్యాలు సార్థకమై నీ రచనాలత పూలతో కళకళలాడుటకు ఎంతో కాలం పట్టదు. అప్పుడు 'దీదీ' (సోదరి) వంటి పుస్తక మొకటి పాఠకలోకం ముందుండడంలో ఆలశ్యం పట్టదు. కాని ఇది జరిగే అవకాశం లేనప్పుడు దాన్ని గురించి బాధ పడడం అనవసరంగదా! ఇలా కొద్దిగా నేర్పితేనే ప్రకాశించగల వ్యక్తు లెందరో ఆ మాత్రం శిక్షణకూడా దొరకని కారణంగా నష్టపడుతున్నారని నేను విచారిస్తూ ఉంటాను. కాని దాన్ని గురించి పట్టించుకునేది ఎవరు? మౌలికత్వం (వర్జినాలిటీ) లేక సాహిత్యచౌర్యంచేస్తూ చెత్తవ్రాసేవారి గుట్టలతోనే బెంగాలీ సాహిత్యం నేడు నిండిపోతోంది. తమ జీవితంలో సత్యానుభూతి పొందినవారు, స్నేహ, ప్రేమ స్వరూపాలను గుర్తించినవారు అంతరాళంలో అణిగిపోయి ఉంటున్నారు. దుఃఖాగ్నిలో తపించి తమ అనుభూతియొక్క నాణ్యాన్ని నిరూపించనివారే నేడు సాహిత్యసృష్టి చేస్తున్నారు. అందుచేతనే నేడు సాహిత్యం అధోగతికి పోతోంది.

లీలా ! హృదయానుభూతి పొందినంతమాత్రముననే ఏ విషయాన్నీ భాషద్వారా వ్యక్తీకరించ లేము. ప్రతీదానికీ కొంత అధ్యయనం అవసరమవుతుంది. ఈ అధ్యయనం ఎప్పుడూ ఎవరంతవారు స్వయంగా చేసుకోవడంవల్లనే పూర్తి కాదు. కాని ఏం చెయ్యను చెల్లీ; నీకు నేర్పి నిన్నుకూడా నిరుపమవలె తయారుచేసే అవకాశం లేదు. లేనిదానికి విచారించి ప్రయోజన మేమిటి ?

ఏమైనా స్థూలంగా నీ కొక ఉపదేశమిస్తున్నాను. రచనను అధ్యాయాలుగా విభజించాలి. తొంభైపాళ్ళు రచయిత చెప్పకుండా పాత్రలనోట చెప్పించాలి. అలా కానిచోట మాత్రమే పాఠకుల మనస్సును పట్టిఉంచడానికి రచయిత తన మాటలలో చెప్పాలి. మరొక ముఖ్యవిషయ మేమంటే చిన్న చిన్న విషయాలు తీసుకుని తానూ బాధపడి పాఠకులను బాధ పెట్టడం జరగరాదు. చాలా విషయాలు పాఠకుల ఊహకు వదిలిపెట్టాలి. కొంత రచయిత చెప్పి కొంత పాఠకుల ఊహకు వదిలిపెట్టడం విద్యాసాపేక్షమూ, బుద్ధిసాపేక్షమూ కూడాను.

ఇకనుంచి నీ చదువు ప్రారంభం. అధ్యాయాల్లో విభజించి నా పుస్తకాల మాదిరిగా రెండు అధ్యాయాలు వ్రాసి పంపు. నా సామాన్య శక్తిని అనుసరించి దాన్ని అవసరమైన మార్పులు చేర్పులతో దిద్ది త్రిప్పి పంపుతాను. దానితోపాటు మార్పులకు కారణాలుకూడా వ్రాస్తాను. ఇంత శ్రమ నేనెందుకు పడుతున్నానో తెలుసా ? నీ ద్వారా సాహిత్యదేవిపూజ

నిష్కల్మషంగా జరుగుతుందనే ఆశ నా కుంది. అంతేకాక నీ కలంనుండి ఉద్భవించే సామగ్రి తక్కువస్థాయికి చెందింది కాదని నా ఉద్దేశ్యం. నీలో ఈ అమూల్య విషయాలు చూచి ఉండకపోతే అనవసరంగా నిన్ను పొగడి నీ సమయాన్ని, నా సమయాన్ని నష్టపరచుకునేవాడిని కాను.

నేను చెప్పే ఈ సంగతి గుర్తుంచుకో. నువ్వు ఎవ్వరికీ తీసిపోవని నేను ఆశీర్వదిస్తున్నాను.

నీ వ్రాత ప్రతి రెండు మూడు రోజుల్లో పంపుతాను. 'కాలో' కథను నా 'పరిణీత' లాగా అధ్యాయాలుగా విభజించి వ్రాసి పంపగలవా ? చెల్లీ, మొదట్లో కొంచెం కష్టంగా ఉంటుంది; కాని ఓర్మి లేకపోతే లాభంలేదు. ఇంత పరిశ్రమ, ఇంత కష్టంతో కూడుకున్నది కనుకనే దీనికింత విలువ. ప్రారంభంలో మన శ్రమ చాలా వృధాగా పోతున్నట్లు కనపడుతుంది. కాని ఎప్పుడూ శ్రమ వృధాగాపోదు. తర్వాత ఏదో ఒక రూపంలో దానివల్ల లాభం కలుగకపోదు. చాలా రాత్రి అయింది. పైకి వెళ్ళాలనే ఆందోళన పెరిగింది. అందుచేత ఇవాళ ఇక్కడితో ఆపుచేస్తున్నాను. ఇవాళకూడా ఇంకా కడుపులో అన్నం పడక పోవడం మూలంగా ఉత్తరం గడబిడగా ఉంది. అందుచేత కొంచెం కష్టపడి చదువుకో. ఎక్కడైనా వరుసగా లేకపోతే నీ అన్నని కావడంవల్ల క్షమించు. నా ఆశీర్వాదాలందుకో. రాత్రి పన్నెండున్నర అయింది.

—నీ అన్న.

సరిగా ఉండనుకోగానే నేనే ఏదైనా మాసపత్రికకు పంపుతాను. నేను పంపితే ఏ సంపాదకుడూకూడా కాదనడు. సరిగా లేకపోతే నేను ఎప్పుడూ పంపనని వారికి తెలుసు. ఇంటిపనులు నీ కెక్కువ ఉండటంవల్ల తీరిక తక్కువ ఉంటుంది; నిజమే. కాని ఎప్పుడూ తీరిక లేకపోయినప్పుడే ఏదో ఒకసమయం దొరకుతుంది గాని, తీరికగా ఉన్నప్పుడుమాత్రం పనిచేయుటకు అవకాశమే దొరకదు.

శివపూర్ - హౌరా.

14-8-16.

సౌభాగ్యవతికి,

నువ్వు వ్రాసిన చిన్న-పెద్ద ఉత్తరాలు రెండూ నిన్న - ఇవాళ అందాయి. మొట్టమొదట స్వవిషయం చెప్పుకోనీ. నేను ఎప్పుడూ కిటికీలూ, దర్వాజా తెరిచిపడుకుంటాను. ఒకరోజు వుదయంలేచి చూసేసరికి నాతలగడ, పరుపు, బట్టలు అన్నీమంచుతో తడిసిపోయాయి. అదే రోజున మధ్యాహ్నం నీళ్ళల్లోకూడా తడవవలసివచ్చింది. ఈ రెండూకలిసేసరికి జ్వరం ముంచుకువచ్చింది. ఒకటి, రెండు రోజుల్లో తగ్గిపోతుందేమోనని చూశాను. కాని తగ్గలేదు సరిగదా హెచ్చిపోయింది. ఇప్పుడు పూర్తిగా నెమ్మదించిందిలే. మరొక చిత్రమైన విషయమేమంటే చాలా రోజులనుంచీ కుడిమోకాలు క్రింద బాగా దురద, మంట ప్రారంభమై చాలా బాధపెట్టింది. నాలుగు

రోజుల తర్వాత చూచుకుంటే కొంచెం ఎర్రబడి ఎగ్జిమాలా తయారైంది. కొంచెం, వాపుకూడా కనిపించింది. కొన్నాళ్లబట్టీ ఇక్కడ బెరిబెరిరోగం ఎక్కువగా వుందనివిన్నానుగాని, కాని అది ఏమిటో ఎలాగవుంటుందో ఇంతవరకూ చూడలేదు. బహుశా అదే అయివుండవచ్చ నసుకున్నాను. తరచు టించర్ అయొడిన్ వ్రాశాను. దాంతో స్థితి విషమించి నిజంగానే బెరిబెరి అయితే బాగుండు ననిపించింది. తర్వాత డాక్టరువచ్చి నానా చీవాట్లు పెట్టి, 'మీలో ఏ మాత్రమూ ఓర్పు లేకపోతే ఎలాగ? ఇంక ఏ యాసిడ్‌గాని, సోడాగాని వ్రాసుకోండి' అన్నారు. కాని చివరకు చికిత్సకు వుపక్రమించి రెండుకాళ్లూ తల గడలమీద పెట్టుకుని పడుకోండి అని చెప్పాడు. మరి ఏం చెయ్యను చెల్లీ! అందుచేతనే కదలడంలేదు. మూడవ విషయం ఏమంటే నేనెప్పుడూ ఆమ్లరోగిని కాలేదు. నేను చాలాతక్కువ తింటాను. ఆ రోజున ఇంటినుంచి తెచ్చిన మిఠాయిలు బలవంతంగా తినిపించారు. ఆ త్రేన్పులు ఇంకా వస్తూనేవున్నాయి. నేను ఈ దేశంలో పేరుపొందిన సోమరిని. నమలవలసివస్తుందనే భయంతో తిండితినడం మానివేసేరకాన్ని. అలాంటి నా మీద ఇంతదారుణం వచ్చిపడిందే! ఎలా సహించను? కాని యింట్లో వాళ్ళకితెలీక నేను ఇలా ఏమి తినకపోవడంవల్లనే చిక్కిపోయానను కుంటారు. అందుచేత బాగా తింటే ఏనుగునున్నలాగా బలిసిపోతానని వారి భావం.

కీ. శే. గిరీశ్‌బాబు తన "ఆబూహసన్"లో లక్షవరహాలమాట ఒకటి చెప్పారు. "స్త్రీలు చాలా దురాశాపరులు.

వాళ్ళు చచ్చిపోయినా యింకా తినడం మానరు" అన్నారు. స్త్రీజాతిని బాగా కనిపెట్టా రాయన.

ఇప్పటికి 20 సంవత్సరాలనుంచీ మాయింటిలో భోజనం విషయంలోనే తగాదాపడుతూవస్తున్నాము. 'ఆయన సరిగా భోజనం చెయ్యకపోవడంవల్లనే ఇంత చిక్కిపోయారు. ఇల్లూ-వాకిలీ - వంట ఇవన్నీ ఎవరికోసమో? ఎలా జరిగే దలా జరుగుతుంది. చివరికి నేను వైరాగ్యం తీసుకుంటాను." అంటూ ఉండేది. అప్పుడు నే ననేవాడిని— "నీకు వైరాగ్యంపుచ్చుకో వాలని ఉంటే త్వరగా పుచ్చుకో. నన్నిలా భయపెట్టి ఎందుకు బాధిస్తావు? ఎక్కడైనా స్వర్గం అంటూ ఉంటే బహుశా అక్కడ తినడానికి ఎవరూ బలవంతపెట్టకుండా ఉంటూ ఉండాలి. ఒక వేళ స్వర్గంలో కూడా తిండి విషయంలో బలవంత పెడితే నేను నరకానికి వెళ్ళడానికే ఇష్టపడతాను.

అన్నట్లు మర్చిపోయాను. మరొక విషయముంది. ఇరవై రోజులక్రిందట కుక్కలమధ్య తగాయిదా తీర్చడానికి వెళ్ళాను. కాని ఏ ప్రక్కనుంచో ఒక కుక్కవచ్చి నా అరచేతిని కరిచింది. పాపం! ఆ కుక్క ఎంత కృతఘ్నురాలు! దాన్ని నా 'భేలూ' బారినుండి తప్పించాలని వెళ్ళాను. ఈ విషయం నే నెవరికీ చెప్పలేదు. పూర్తిగా ఎండిపోయిందనుకో. కాని మళ్లా నిన్నటినుంచీ కొంచెం నెప్పిగా ఉంది.

ఇప్పుడు తగ్గుతోందిలే. ప్రస్తుతానికి ఇంతటితో నా శారీరిక క్షేమసమాచారాల పట్టికను ముగిస్తున్నాను. సంతోషించ

దగ్గ విషయ మేమంటే నే నింక వృద్ధుణ్ణి అయిపోయాను. ఏదో ఒక మిషమీద ఈ ప్రపంచాన్నుంచి వెళ్ళిపోక తప్పదు.

ఎన్నెన్ని దుఃఖాలు, బాధల మధ్య 40 సంవత్సరాలు గడిపానో! మా యింట్లో ఇంతవరకూ ఎవరూ నలభయ్యో సంవత్సరాన్ని చూడలేదట! కనీసం ఈ విషయంలోనైనా నా మా తాత ముత్తాతలను ఓడించాను. ఇంత కంటే కావలసిన దేముంది?

అవన్నీ పోనీ, ముసలివాళ్ళ జీవన్మరణ విషయాలు చెప్పి మిమ్మల్ని దుఃఖపెట్ట దలచుకోలేదు. కాని చెల్లీ! నీ ఆరోగ్యం కూడా అంత బాగుండలేదుగదా. పంటి విషయంలో కాస్త జాగ్రత పడు. ఇప్పుడు నువ్వేమీ కష్టపడ నక్కరలేదులే. ఆరోగ్యం కోలుకుని తిరిగివస్తే అదే చాలు. నీ రచనలన్నీ చాలా శ్రద్ధగా చదివాను. ఇందులో అన్నీ ఉన్నాయి; కాని నేర్పరితనం లేదు. సాహిత్యాన్ని సృష్టించే కౌశలాన్నికూడా నేర్చుకోవాలి. ఒక్క అనుభూతి మాత్రమే చాలదు. నే నా వృత్తిలోనే ఉన్నాను గదా. ఆ కాస్తా నేర్పడానికి ఇంక ఎంతో కాలం పట్టదు.

చెల్లీ! సంఘటిల్లే ఘటనలన్నీ వ్రాసేయకూడదు. కొన్ని స్పష్టంగా చెబితే, కొన్నిటిని సంజ్ఞామాత్రంగా వదిలివేయాలి. మరికొన్ని చదువరులు తమకు తామై అర్థం చేసుకునేలా చెప్పాలి. ఉత్తరంద్వారానూ, దిద్దుడులతోనూ దూరంగాఉండి ఎంతచేయగలనో అంతాచేస్తాను. ఎక్కువగా చేయు లేకపోయినా

ప్రయత్నిస్తున్నాను గదా. ఈ మాటు శీతాకాలంలో నేను ఇల్లు కదలగలిగినట్లయితే మీా హిందీవాళ్ల దేశంలో 10-15 రోజు లుండాలనుకుంటున్నాను. అప్పుడు నీకు కొంత స్వయంగా నేర్పగలుగుతాను. కాని ఒకవేళ నా పాత సోమరితనం ఎక్కువై తేమాత్రం ఏమీా చెయ్యలేను.

...స్త్రీల సంగతంటావా? వాళ్ళు కుశలంగానే ఉందురు గాక! వాళ్ళతో నిన్ను పోల్చ నా మనస్సు అంగీకరించదు. ఒక్క సంగతి స్పష్టంగా చెబుతాను. వాళ్ళు దూరంనుంచి చూడడానికే మహిళలు...... ఉన్నత విద్య నభ్యసించిన వాళ్లూను! ఏ ఒక రిద్దరో తప్ప మిగిలిన వాళ్ళందరూ లోపల్లోపల నే నంటే భయపడతారు. నేను వాళ్ళని పూర్తిగా ఆపాదమస్తకం ఎరుగుదునని వాళ్ళకి తెలుసు. అందుచేతనే నా ముందు వాళ్ల ఆటలు సాగవు. వాళ్ళ హృదయంలో ఉన్నంత కృత్రిమం, సంకుచితత్వం బెంగాలులో మరి ఏ యితరులలోనూ ఉండదనిపిస్తుంది. చెల్లీ! నే నెప్పుడూ వంటకాలకి అంటిపెట్టుకో లేదు. కాని నేను మహిళచేత్తో వండినది తినను! తల్లిదండ్రు లిద్దరూ బ్రాహ్మణులై, పెళ్ళికూడ బ్రాహ్మణులతో చేయించుకున్నవారు వండితేనే తింటాను. ... సోషియల్ అంటావా, దానివల్ల వచ్చేదీ పోయేదీ ఏమీా ఉండదు, కాని అలా సంగమజాతి అంటినది నేనుతినను. 'శరత్ బాబు పెద్దపెద్ద' కబుర్లు చెబుతారు. గొప్పగా వ్రాస్తారు. అంతేకాని ఆయన వాస్తవంగా చాదస్తుడు' అంటారు. లీలా! అలా అంటారేగాని నేను చాదస్తుణ్ని కాదు. అయితే నాకు వాళ్ళంటే వున్న కోపం

కారణంగానే నేను వాళ్ళు వండింది తినను. ఇంకా యిది కూడా చూచేవుంటావు...... ఆడపిల్లల్లో 99మంది కురూపిలే. కాని, సబ్బులు, పౌడర్లు, స్నోలు పూసుకుని, మోసేబట్టలు, సెంట్లుతోనే అలా తయారౌతారు! నేను ఏ నలుగురైదుగురు ఆడపిల్లల్నో మాత్రం చూచాను. వారు నిజంగా గౌరవార్హులు. వాళ్ళు బి. ఏ. లు ప్యాసైనప్పటికీ వాళ్ళనీ మన పిల్లల్నీ పోల్చలేము. ఇప్పటికీ వాళ్ళు పదహారణాలా హిందూపిల్లలవలె కనబడుతారు.

ఆడపిల్లల్ని నిందిస్తున్నానని నీకు బహుశా కోపం రావచ్చు. కాని నీకు తెలుసు, నాచెల్లీ! నా హృదయంలో మీరంటే నా కెంతగౌరవమో; మీయందు నే నెంతస్నేహం చూపుతానో? కేవలం టిప్‌టాప్‌గా తయారవడం, చదువును ప్రదర్శించుకోవడం, అజ్ఞానంవదిలి నాగరికులమయ్యామనేగర్వం, యదార్థంకాని దానిమీదుండే మిథ్యాభిమానం- ఇవి చూస్తేనే నాకు ఇంత చీదరింపు.

వాళ్ళముందు నువ్వు అపహాస్యం పాలవుతావా? వీళ్ళల్లో ఒకటి - రెండు డజన్లమందిని పట్టి నీ దగ్గరికి కాన్పూరు రవానా చేయనా అనిపిస్తుంది వాళ్ళు కనీసం దేనికీ పనికిరాకపోయినా నేను చెప్పిన విషయాలు నిరూపించడానికైనా పనికివస్తారు.

"అన్నగారిని గౌరవించడం" ఎలాగో నీ కెలా తెలుస్తుంది. నీ కెవరూ అన్నలు లేరుగదా!

నీ భర్తయొక్క ఉదారతను గురించి తెలుసుకుని చాలా సంతోషించాను. నేను హృదయపూర్వకంగా వారిని ఆశీర్వదిస్తున్నాను. కాని చెల్లీ, వారితో ఒక్కమాట చెప్పాలనిపిస్తుంది. చిన్నతనంలో నేను ఒకసారి ఆరేడువందలమంది కులంనుండి బహిష్కరింపబడ్డ బెంగాలీ స్త్రీల చరిత్రి సేకరించాను. దీంట్లో చాలా కాలము, చాలా డబ్బుకూడా ఖర్చయ్యాయి. అయితే దానివల్ల నే నెన్నో విచిత్రవిషయాలు నేర్చుకున్నాను. చెడుప్రచారం బాగాజరిగినా నేనొక విషయాన్ని స్పష్టంగా బయటకు తీశాను. ఇలా కుటుంబాలు వదిలివచ్చిన స్త్రీలలో నూటికి ఎనభైమంది భర్తలుండి కాపురం చేస్తున్నవారే, వితంతువులు చాలా తక్కువ! భర్తఉంటేనేమి! ఎంతకావలాలు మప్యాపెడితేనేమి! లేకవితంతువైతేనేమి! చెల్లి, ఏన్నో దుఃఖాలు, కష్టాల కారణంగానే స్త్రీ తన ధర్మాన్ని నాశనం చేసుకొనుటకు పూనుకుంటుంది. అలాచేయుటకు కారణం పరపురుషులరూపం కాదు. ఇతర భీభత్స పవృత్తుల లోభమూ కాదు. తమ ఇంత గొప్ప వస్తువును పోగొట్టుకుంటున్నారంటే బయటపడి మరేదో ఆశ్చర్యకరమైన దానిని పొందుతామనే ఆశతోకూడా కాదు. ఏదో ఒకదాన్నినుండి ముక్తిపొందుటకే వారెన్ని కష్టాలకూ వెనుదీయుటలేదు. ఇవన్నీ బహుశా నీకు అర్థం కాదు. నేను చెప్పడమూ బాగుండదు. కాని అన్నిటికంటేమించిన దేమంటే నువ్వు ఒక్క స్త్రీవి మాత్రమేకాక, నా చెల్లెలివికూడాను! ప్రపంచంలో ఆ సంబంధం నీచమైనదికూడా కాదు.

'కథ' లో ఎంతయదార్థం, ఏంతకల్పనవుందో నాకు తెలియదు. కల్పనే ఎక్కువవుంటే గొప్పవిశేషమే. కాని సాహసం చాలడం లేదు. అది ఎవరో? ఇప్పుడిక పవిత్రుని గురించి కూడా కొంచెం చెప్పాలి. నాకు ఎక్కువగా తెలియదుగాని స్వచ్ఛమైనశీలంగల మంచికుర్రవాడు. నిన్ను 'సోదరీ' అనవచ్చు. వయస్సులో నీకంటే రెండుమూడు మాసాలైన చిన్నవాడు కావచ్చు. అలా సంబోధించడంవల్ల ఏ స్త్రీకి అగౌరవం కలగదని నా నమ్మకం. అతనికి నువ్వు ఉత్తరాలు వ్రాయవచ్చు. అందులో ఏమీ నష్టం వుండదు. అంతేకాక నువ్వుకూడా కల్తీలేని కనకానివికదా. ఎవరిని ఎలా గౌరవించాలో నీకు బాగా తెలుసునని నా నమ్మకం. కొద్దిరోజుల్లోనే బెంగాలీ సాహిత్యక్షేత్రంలో ఎవరికీ తీసిపోని రచయిత్రి వుదయిస్తుందని ప్రచారం చేస్తున్నాడని విన్నాను. నిన్న ఒకాయన ఆ 'సమాగమము' అచ్చువేస్తానని వచ్చాడు. కాని నేను ఇవ్వలేదు. పత్రికల్లో ప్రకటించబడేటంత బాగాలేదని అన్నాను. ఇప్పుడు తొందర ఏమీ వద్దు. చాలామంది చాలాబాగుందని అంటారు. నాకా విషయం తెలుసు. అలాగే బాగుండలేదని నిందించేవాళ్ళుకూడా తక్కువ వుండరనీ నాకు తెలుసు. ఓపికపట్టి ఒక సంవత్సరం ఆగితే, నేను మాసపత్రికలో ప్రచురణ కిచ్చినప్పుడు అ సంశయాలు వాటంతట అవే తీరిపోతాయి.

నేను నిన్ను శిష్యురాలినిగా అంగీకరించాను. కాని చూడు చెల్లీ, నిరుపమ మాదిరిగా చివరికి గురువునే 'చంపే' విద్య మాత్రం నేర్చుకోకు. ఇప్పుడామె నాకంటె గొప్పదై

పోయింది. కొంతకాలం తర్వాత నువ్వుకూడా అలా గొప్ప దానివైపోవచ్చు. ప్రపంచంలో విచిత్రమేమీ లేదు. ఎప్పుడేమి జరుగుతుందో చెప్పలేము!

నువ్వు ఆరోగ్యంకోలుకొని బాగుపడ్డానని, ఇంక ఏమీ జబ్బు మిగలలేదని వ్రాసినప్పుడే నేనా విషయాన్ని ఒప్పుకో గలను! మానసికరోగం వున్నవాళ్ళను శిష్యులుగా చేసుకోను. మొదట నువ్వు డాక్టరుసర్టిఫికేటు తీసుకురావాలి. లేకపోతే నిన్ను శిష్యురాలినిగా చేసుకొని నీకు అన్నీ నేర్పిన తర్వాత అకస్మాత్తుగా ఈ ప్రపంచాన్ని వీడిపోతే నా శ్రమకు లాభం ఏముంటుంది గనుక?

'మీకు పరిచితమైన శ్రీరాంపూర్' అని నువ్వొకసారి వ్రాశావు. అయితే 'జయరాంపూర్' పరిచయం లేదా? దాని మలేరియా, బరోరోగాలవలెనే దోమలదండులను తేలికగా మర్చిపోయే వారెవరూ వుండరు. క్రిందటివైశాఖంలో ఈ భయంవల్లనే 'పులగం పండుగ' కు నాకు ఆహ్వానంవచ్చినా అంగీకరించలేదు. జయరాంపూర్‌లోని మరొకపిల్ల నన్ను అన్నయ్యా అని పిలుస్తుంది. నేనా అమ్మాయిని చెల్లీ అంటాను.

దేహారీ వెళుతున్నావా? నువ్వుపుట్టకముందు నేడు ఆ దేహారీ యేటిఒడ్డున పండిన ... ... ఏరుతూ వుండేవాడిని. వలవేసి తొండలను పడుతూవుండేవాడిని. అబ్బా! ఎన్నిరోజుల క్రిందటిసంగతనుకున్నావు ఇది. రైలుమార్గం పడనప్పుడు ఆరా నుంచి స్టీమరు ఎక్కి వెళ్ళవలసివచ్చేది. బహుశా నీ బంగళాను

కూడా చూచేవుంటాను. ఇప్పటికీనాకు కళ్ళకుకట్టినట్లుంది. మీయింటిలోంచి బయటకురాగానే కుడిచేతివేపు సూర్యుడు వుదయిస్తాడు కాదూ? ఆ రోజుల్లో 'సతీచౌరా' అనో అలాంటి పేరుతోనో ఒక రేవు వుండేది. మీ యింటినుంచి రెండు మైళ్ళుంటుంది. కొంతసేపు అక్కడికిపోయి కూర్చుంటూ వుండే వాడిని. నేడు ఆ రేవు వుందో లేదో నాకు తెలియదు.

'దేశద్రిమ్మరి'కి రాకపోకల్లో ఏమీ అంతబాధ ఉండదు. ఆ విషయంపోనీ. బర్మాగురించి ఇన్నివిషయాలు ఎలా తెలుసుకున్నావ్? అక్కడ మేజస్ట్రేటు మ్యాక్ అని నీ కెవరుచెప్పారు. మాండలేనుంచి స్టీమరుమీద వెళ్ళివచ్చే మార్గం ఉందని ఎవరిద్వారా విన్నావు? ఒకవేళ నిజంగా నువ్వు కొంతకాలం బర్మాలో ఉండిఉంటే ఎక్కడ ఉన్నావు? ఆ దేశాన్ని నా యీ రెండుపాదాలతో కొలవని ప్రదేశంలేదు. అయినా నా వంటి సోమర చక్రవర్తులు ఈ ప్రపంచంలో చాలా తక్కువ మంది ఉంటారు.

'రాజ్యలక్ష్మి' ఎక్కడుందా? అదంతా కల్పనాచిత్రము మాత్రమే. శ్రీకాంత్ ఉపన్యాసంలో తప్ప మరెక్కడా ఉండదు. అలాంటి ఆధార రహితమైన అపవాదులగురించి పట్టించుకో కూడదు. కథ నిజమేనా అంటావా? ఎవరికథ? నువ్వు చిరంజీవి నివవు. దీర్ఘాయుష్మాన్‌భవ. మాటమాటకీ ఇలాగే ఆశీర్వదిస్తాను. నే నింతచెప్పినా, మర్చిపోయికూడా ఆరోగ్యంగురించి అశ్రద్ధవహించకు. నిన్నింతవరకూ చూడలేదు. కాని నీయెడల నా కెందుకో ఇంత స్నేహం కలుగుతోంది.. అది నీ అదృష్టం

అనుకుంటాను. నేను సోమరిని కాకపోతే నిన్ను చూడడానికి శీతాకాలంలో కాన్పూరు వచ్చి ఉండేవాడినే అనుకుంటాను. కాని అది జరిగేది కాదనే సంగతి కూడా తెలుసు.

నీ యిద్దరు పిల్లలను ఆశీర్వదిస్తున్నాను. వాళ్ళకి తల్లిదండ్రుల గుణాలు అబ్బితే వాళ్ళ జీవితాలు నిజంగా సార్థకమౌతాయి. నువ్వు జీవించి ఉండి వాళ్ళని మనుష్యులుగా తయారు చెయ్యాలి. చచ్చిపోయి సాధించేదేమీ ఉండదు. అలా జరిగితే నాకూ నిజంగా చాలా కష్టం కలుగుతుంది.

—అన్న.

క్రమ వరుసలో వ్రాసిన నీ ఉత్తరానికి సమాధానంగా చీకిరిబాకిరిగా వ్రాసిననా ఈ ఉత్తరాన్ని పంపుతూ ఉంటే నాకు సిగ్గు వేస్తోంది.

నేటి కథ ప్రథమ అధ్యాయం ముందు ఉత్తరంలో వ్రాస్తాను.

—•••—

శివపూర్.

బెం. సం. 7 భాద్రపదం 1326.

సౌభాగ్యవతికి,

నీ ఉత్తరం అందింది. అందులో అవసరమైన విషయాలున్నాయి. నిరుపమ అంటే నాకెంతో ఆశ ఉండేది. కాని, 'దీదీ' తప్ప మరేమీ వ్రాయలేక పోయింది.

ఎందుకో తెలుసునా? వారాలు, వ్రతాలు, జప-తపాలతో ఆమెలోని మాధుర్యం ఆమె వయస్సుతోటే ఎండిపోయింది. మన ఇళ్ళల్లో ఇవన్నీ చెయ్యని స్త్రీలు ఎవరుంటారు అసలు? సరేలే అదిపోనీ. నీవు నా రెండవ ఆశవు. ఇప్పుడు నీ కున్న వయస్సే ఇహలోకంనుంచి ప్రయాణంకట్టే సమయం. అందుచేతనే నీకు నేర్పాలనుకుంటున్నాను. అందుకనే నీ ఏ రచననూ కూడా అచ్చువేయించడానికి సిద్ధంగా లేను. తమ రచన, తమపేరు అచ్చులో చూచుకోవాలనే కోరిక చాలా మందికి ఉంటుందని నాకు తెలుసు. అయితే నువ్వు ఒక సంవత్సరం ఓర్పు వహించగలవని కూడా తెలుసు.

కాని ఇప్పుడు పూర్వంలాగా నేర్పగలిగే వీలులేదు. అట్టి వీలుకు అవకాశంకూడా లేదు. అయినా ఒకసారి అటు వస్తాను. నేను ఎక్కడున్నా నిన్నొకసారి కలుసుకుంటాను.

"వీరి పుస్తకాలేగదా చదువుతున్నాను. వాటిని చదవడంవల్ల నేర్చుకో, లేకపోతే వీరువచ్చి రెండురోజులుండి నాకు పెద్దగా ఏం నేర్పగలరు?" అని నువ్వు అనుకోవచ్చు. అది నిజం కూడా. వాస్తవంగా అది నేర్పగలిగే విషయంకాదు. అయినా "మృత్యు ముఖంలోంచి తులసి...... మొదలైనవి" నువ్వు ఇది వ్రాసేటప్పుడు నేను ఉండి ఉన్నట్లయితే చెప్పి ఉండేవాడిని. తులసి చనిపోయి, మొత్తం కథలో ఇక తిరిగిరానప్పుడు ఆమెను గురించి ప్రారంభంలోనే రెండుపేజీల గాథ పాఠకులను విసుగెత్తించేస్తుంది. నేనయితే ఎక్కడనుంచి ప్రారంభిస్తాను అని

చెప్పేముందు-అసలు ప్రారంభించడమే కష్టం. ప్రారంభంమీాదే పుస్తకం ఆధారపడి ఉంటుంది అని చెప్పేవాడిని.

ఇలా ప్రారంభిస్తే ఎలా ఉంటుందో ఆలోచించు:—ఒకనాడు తులసి మృతశరీరం స్మశానంలో బూడిదగా మారిపోతోంది. ఆమె పదమూడు సంవత్సరాల కూతురు మంజరి నిశ్చేష్టురాలై ప్రక్కనే నిలబడిఉంది. నిర్వాణోన్ముఖమైన చితిలోని కిరణజాలం ఆమె ముఖంమీాద ఎంత సేపటినుంచీ చిత్రవిచిత్రంగా నృత్యం చేస్తున్నవో ఎవరూ పట్టించుకున్నట్లు లేదు. కాని అకస్మాత్తుగా ఆ పిల్ల ముఖంపై ఠాకూర్ భార్య తార దృష్టిపడి మంజరిని చూడడంతోనే తార సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయింది. నశ్వరకాయాన్ని వీడినవ్యక్తే తిరిగి తన బాల్యావస్థలో ప్రత్యక్షమయిందా అనిపించింది. అచ్చంగా అటువంటి సాటిలేని రూపము, సరిగ్గా అటువంటి మధురమైన శాంతం, ముఖంమీాద తీవ్రమైన విషాదరేఖలు అంకితమై యున్నట్లున్నాయి. ఈ మాతృహీనురాలైన అమ్మాయి ముఖంవంక చూడగానే ఆమె ఆలోచనా పరంపర గతంలోని సుఖదుఃఖాలతో నిండిన గాథలమధ్య చలనచిత్రం మాదిరిగా తిరుగాడింది. తులసి భర్తను పోగొట్టుకుని మొట్టమొదటిసారిగా తన యింట్లో అడుగుపెట్టిన క్షణం గుర్తుకు వచ్చింది. ఆ తర్వాత తులసి తన వికసించిన రూపలావణ్యాన్ని యితరులనుండి గుప్తంగా ఉంచి తన (తార) కుటుంబసేవలో పదహారణాలా ఎలా మునిగిపోయినదో గుర్తుకు వచ్చింది...... మొదలైనవి......

ఇలా గతచరిత్రని ఎంత సంక్షేపంలో ముగించగలిగితే అంతమంచిది. ఎందుకంటే పుస్తకంలో అది తిరిగిరాదనీ, అందు చేత ఆమెగురించి ఎక్కువ చెప్పవలసిన అవసరం లేదనీ తెలుసు కోవాలి.

దీనితర్వాత కథలో ప్లాటు అనేదానిపైనే ఎక్కువధ్యాస ఉంచడం అనవసరం. పుస్తకంలో వచ్చేపాత్రల గుణగణాలను గురించి మొదట స్పష్టం చేసుకోవాలి. ఉదాహరణకు నువ్వు నీ తండ్రిని, భర్తని బాగా అర్థం చేసుకున్నావనుకో, వారు తమ గుణదోషాలమధ్య ఏఏ సందర్భాలలో బాగా రాణించ గలరో నిశ్చయం చేసుకోవాలి. నీ తండ్రి తన స్వాంతపనుల్లో, తన వ్యాజ్యాలూ వాటిల్లో, అలాగే నీభర్త తన మిత్రునికి ఉద్యోగం వెతకడంలో, త్యాగంలో, ఉదారతలో పరిపూర్ణత సంపాదించారని నువ్వు అనుకున్నప్పుడే కథ ప్రారంభించాలి. లేకపోతే మొదటినుంచీ ప్లాటు ఆలోచిస్తూ తలనెప్పి పుట్టించు కోవడంవల్ల ప్రయోజనమే ఉండదు.

ఇంకా చిన్న పెద్ద విషయాలున్నాయి. కాని, వాటిని వ్రాస్తే చాలదు. దగ్గరుండి చెప్పాలి. ఉత్తరంలో అవి వ్రాయ డం కష్టమౌతుంది. వీటిని నీకు ఎప్పుడో ఒకప్పుడు చెబుతానులే. కాని, ఆ సమయం ఎప్పుడొస్తుందో ఆ సర్వేశ్వరునికే తెలి యాలి... నా లెక్కలేనన్ని ఆశీర్వచనాలతో.

నీ అన్న శ్రీ శరచ్చంద్ర చటోపాధ్యాయ.

శివపూర్,
24-11-16.

సౌభాగ్యవతికి,

నిన్నరాత్రి $10\frac{1}{2}$ గంటలకు అక్కగారి యింటినుంచి తిరిగివచ్చే సరికల్లా నీ ఉత్తరం, సరోజ ఉత్తరంవచ్చి ఉన్నాయి. సరోజ ఉత్తరం ఇంగ్లీషులో ఉంది. నాకు ఇంగ్లీషు అంతబాగా రాకపోవడంవల్లనే నా ఉత్తరాన్ని సరిగా అర్థం చేసుకోలేక పోయూను. ఏ ఇంగ్లీషు తెలిసిన మిత్రుడో వచ్చినపుడు చదివించుకోవాలి. అప్పుడు దానికి సమాధానమిస్తాను.

అక్కగారి అత్తగారి దహన సంస్కారాలు చాలా వైభవోపేతంగా జరపబడ్డాయి. నేను మరొకపనిలో మునిగిఉన్నాను. వారి ప్రాంతంలో ఇన్ఫ్లూయెంజాజ్వరం చాలా ఎక్కువగా ఉంది. పాపం! దానివల్ల చాలామంది చనిపోతున్నారు. మందుల పెట్టె తీసుకుని వెళ్ళాను. నా చేతుల్లో ఇద్దరుమాత్రం చనిపోయారు. బహుశః నే నింకా ఎక్కువకాలం ఉండేటట్లయితే ఇంకా కొంతమంది నా చేతులమీద పోయేవారేమో! మందులు, పథ్యం సరిగా లేక ఎంతోమంది దైవసాన్నిధ్యానికి చేరుకుంటున్నారు. నేను కొన్ని మందులు వగైరాలు తీసుకు వెళ్ళడం కోసమని తిరిగి వచ్చాను. కాని రేపు ప్రొద్దునకల్లా ప్రస్తుతం వేడిగా ఉన్న నా శరీరంలో ఏజ్వరం ఉందో స్పష్టపడిపోతుంది. ఇవాళ్టికి ఆగిఉంది. రేపుకూడా ఇలాగే ఉంటే ఎల్లుండి వెళతాను.

నీ అన్న.

శివపూర్ (హౌరా)
30-3-1921.

సౌభాగ్యవతికి,

బారిసాల్ సమావేశానికి వెళ్ళాలని మహా అనుకున్నాను. కాని, నా గ్రోత్రపాఠశాల పనిలో మునిగి ఉండడంవల్ల వెళ్ళడానికి తీరిక లేకపోయింది. ఇంతకు ముందు చేస్తున్న అన్నిపనులనుండి విముక్తి పొందాలని ప్రయత్నిస్తున్నాను. ఇప్పటివరకూ ఎన్నో తప్పులూ - దుఃఖాలు - కష్టాలు కలిగిఉంటాయి. వాటి అన్నిటికి ప్రతిఫలం అనుభవించాల్సిన సమయం వచ్చింది. అంతేకాక ఈ దీర్ఘ జీవితకాలంలో ఎన్నో ముళ్ళుపడి పోయాయి. వాటి నన్నిటిని తీరికగా కూర్చుని విప్పుకోడానికి ఇప్పుడింక వయస్సు చాలదు. అందుచేత తొందర పాటులో ఉన్నాను.

నీ తండ్రిగారి ఆరోగ్యం ఇప్పుడు కొంచెం బాగుందనుకుంటాను. సరోజ ఉత్తరంలో ఆ విషయం వ్రాసింది.

నా గురించి నే నేమైందీ నీకు తెలిపేవాళ్ళు ఎవరో ఒకరుంటారు. అందుచేత ఇంక ఆ విషయంలో నేను నిశ్చింతగా ఉంటాను. ఈ అన్నగారి చిరస్నేహాన్ని ఆశీర్వాదాన్ని అందుకో. నేను తిరిగి పిచ్చివానిని కావద్దనే నువ్వు ప్రార్థించు.

నీ అన్న.

శివపూర్ (హజారా)
27 జూన్ 1931.

సౌభాగ్యవతి లీలా!

ఇవాళ నీ ఉత్తరం అందింది. నీకు జవాబు వ్రాయలేక పోయాను. అందుకు తీరిక లేకపోవడమే కారణం. చెల్లీ! ఇప్పుడు నాకు నిజంగా తీరిక లేదు. కాంగ్రెసు కార్యక్రమాలు సార్థకమైతే నాకేమైనా తీరిక దొరుకుతుంది. నాకీ నాడు రెండు సంవత్సరాల క్రిందటి గాంధీగారి సత్యాగ్రహపు రోజులు గుర్తుకు వస్తున్నాయి.

నే నొక స్వయంసేవకుణ్ణి. నా ప్రక్కమనిషి, మరి ఐదారుగురు 'చచ్చిపోయాను' అంటూ తుపాకీ గుండుదెబ్బతిని ఒరిగిపోయారు. అప్పుడు నేను పారిపోలేదు. నాకు గుండూ తగల లేదు. అప్పుడు నాకు తుపాకీ గుండెందుకు తగలలేదా అని నాకు ఆశ్చర్యంవేస్తుంది. ఇవాళ దాని అవసరంకూడా ఉందేమో ననిపిస్తోంది...

—అన్న.

—...—

శివపూర్ (హజారా)
1 జనవరి 1923.

సౌభాగ్యవతికి,

గయనుంచి తిరిగివచ్చాను. ఆరోగ్యం సరిగా లేకపోవడంవల్ల కాంగ్రెసు పూర్తికాకుండానే వచ్చేశాను. వెళ్ళే

ముందే ఉత్తరం వ్రాద్దామనుకున్నాను. కాని వ్రాయడం పడ లేదు. గయ వెళ్ళినతర్వాత అక్కడనుంచైనా వ్రాద్దామనుకు న్నాను. కాని అక్కడనుంచికూడా వ్రాయలేక పోయాను. ఇప్పుడిక తిరిగివచ్చి జవాబిస్తున్నాను. ఇదిగో వ్రాద్దాం, అదిగో వ్రాద్దాం అని అనుకుంటానుగాని వ్రాయడం పడడంలేదు. దీనికి ఒక అర్థం ఉండకపోదనుకుంటాను. కాని ఇది ఎంతమంది తెలుసుకోగల రంటావు? 'మీ అర్థాలు పర్థాలు అనవసరం; మా అమూల్యమైన ఉత్తరానికి సమాధాన మివ్వండి' అని అంటారు.

ఒకప్పుడు నాగురించి అందరూ నేను చాలా దయార్ద్ర హృదయం కలవాడినని అనేవారు. కాని ఇప్పుడో! అందరూ అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములు, బావమరదులు, బంధువులు, మిత్రులు — అందరూకూడా దయామాత నన్ను విడిచిపోయిన దంటున్నారు. దానికీ ఒక అర్థం, విలువ ఉందని నే నంటాను. నా అర్థం, విలువ తమ కక్కర్లేదనీ, మొదట్లోని ఆ అర్థంలేని విలువలేని వస్తువే తమకు కావాలనీ అందరూ అంటున్నారు. ఆఖరికి ఇంటావిడకూడా ఆ గొంతుతో తన గొంతు కలిపింది. బహుశః అందరి గొంతులకంటె ఆవిడగొంతుకే గట్టిగా వినిపిస్తోందేమో!

— అన్న.

శివపూర్ [హజారా]
3 మే 1923.

సౌభాగ్యవతికి,

కొన్నాళ్ళక్రితం నేనొక దుర్ఘటనలో చిక్కుకున్నాను. ఎలైన్స్‌బ్యాంకు దివాలా తీయడంతో అంతా మునిగిపోయినట్లుంది. ఇల్లూ పూర్తికాలేదు; చెరువుపనీ పూర్తికాలేదు. ఈ సంవత్సరం అన్నీ పూర్తి చేద్దామనుకున్నాను. కాని డబ్బు ఆగిపోవడంతో అన్నీ ఆగిపోయాయి. కాని నాకు చాలా కష్టం కలుగుతున్న విషయమేమంటే నా కారణంగానే ఎంతో మంది తమ కున్నదంతా ఈ బ్యాంకులో వేశారు. నేను వారిని మోసం చెయ్యననే నమ్మకంతో. ఇప్పుడింక వాళ్ళకి దమ్మిడీలతో తీర్చేయాలి. ఎన్నో కుటుంబాల బాధ్యత నామీద వచ్చిపడింది. వాళ్ళతో ఏం చెప్పాలో నాకేమీ తోచడంలేదు. కాని ఒకటిమాత్రం నిశ్చయం. నేను ఊరుకుంటే వాళ్ళయింట్లో పొయ్యిమీద పిల్లికూడా లేవదు. దేవు డెక్కడనుంచైనా తెచ్చియిస్తే అది వేరేవిషయం. సాధారణంగా అలా ఇవ్వడు. మనుషులు ఆకలితోనూ, అర్ధాకలితోనూ చావవలసిందే. ఎక్కడికైనా వెళ్ళి రాత్రింబవళ్ళు రెండుమూడు రోజులేమైనా ప్రయత్నిస్తే కనీసం ఐదారువేల రూపాయలైనా కూడగట్టగలనేమో చూడాలను కుంటున్నాను. దాంతో కొంత సర్దవచ్చు. మరీ దగ్గరవాళ్ళ కుటుంబాలు చూస్తేనే చాలా బాధగా ఉంది.

—నీ అన్న.

శివపూర్ [హౌరా]
17 మే 1923.

సౌభాగ్యవతికి,

కొంతకాలంగా యిక్కడ లేను. రెండుమూడు గంటల క్రిందటే బారిసాల్‌నుంచి తిరిగి వచ్చేసరికి నీ పోస్టుకార్డు అందింది. అందుచేతనే యథాసమయంలో జవాబు వ్రాయలేక పోయాను...

హుగ్లీ జైలులో మన కవిమిత్రులు కాజీ నజ్రుల్ ఇస్లాం ఉపవాసంచేసి మరణాసన్నులై ఉన్నారు. ఒంటిగంట బండిలో వెళుతున్నాను. ఇంటర్వ్యూ ఇస్తే, ఒకవేళ నేను చెప్పడంవల్ల ఏమైనా నిరాహార దీక్ష విరమించటానికి సమ్మతిస్తారేమో చూస్తాను. వారొక ఉత్తమకవి. రవిబాబు తర్వాత వారిని మించిన గొప్పకవి మన దేశంలో ప్రస్తుతం మరొకరు లేరు.

—అన్న.

సామతాబేడ్. పి. ఓ. పానిత్రాస్,
హౌరా జిల్లా. 13 కార్తికం 1333.

సౌభాగ్యవతి లీలా!

నీ ఉత్తరం అందింది; ఇలాగే అప్పుడప్పుడు నీ కుశల సమాచారాలు వ్రాస్తూ ఉండు.

ప్రభాస సన్యాసి నా రెండవ అన్న. బహుశః నీకు తెలిసి ఉండవచ్చు. ఆయన బర్మానుంచి తిరిగి రాగానే గత మంగళవారం జబ్బుపడ్డారు. "తరచు జబ్బుపడడంవల్ల ఈ శరీరం శిధిలమైపోయింది. అందువల్ల దీన్ని వదిలివేయాల్సివుంది" అని మాటమాటకి అంటున్నారు. మర్నాడు స్వయంగా పక్క మీదనుంచి లేచి యిల్లుదాటి బయటకు వచ్చారు. నా ఒడిలో తలపెట్టుకుని ప్రాణత్యాగం చేశారు. చెల్లీ! నేనూ, భార్య, ప్రకాశ్ మాత్రమే ఉన్నాము.

—అన్న.

శ్రీ భూపేంద్ర కిశోర రక్షితరాయ్‌కి వ్రాసినవి

10 జ్యేష్టము, 1336.

భూపేన్,

నువ్వు ఒక మాసపత్రిక సంపాదకుడివి. Catch words మోహంలోపడి, వాటివేపు నువ్వు ఆకర్షింపబడకుండా ఉండాలి. ఎందుకంటే విప్లవం తిరుగుబాటు ఈ రెండూ ఒకటేనని ఎప్పుడూ పొరపాటుపడకు. ఎక్కడైనా విప్లవంవల్ల బానిసదేశం స్వతంత్రమవడం నువ్వు చూశావా? చరిత్రలో ఉదాహరణ ఏమైనా ఉందా? విప్లవంవల్ల స్వతంత్రదేశంలోనే ప్రభుత్వరూపంగాని సాంఘిక కట్టుబాట్లుగాని మార్పుచేయబడగలుగుతాయి. కాని, విప్లవంవల్ల బానిసదేశాన్ని ఎలాస్వతంత్రం చేయగలమో నాకు అర్థంకావడంలేదు. దీనికి కారణం ఏమిటో తెలుసా? విప్లవంలో వర్గసంఘర్షణ వుంటుంది. విప్లవంలో గృహకల్లోలాలుంటాయి - అంతర్యుద్ధాలుంటాయి. గృహకల్లోలాలు, అంతర్యుద్ధాలవల్లనే మరేమి చేసినా దేశశత్రువును మాత్రం ఓడించలేము. విప్లవం ఐకమత్యానికి శత్రువు.

(వేణు, ఆషాఢం-1336)

సామతాబేడ్, పాణిత్రాస్.
హవారా జిల్లా
10 చైత్రం 1336.

భూపేన్,

నవవర్షాగమన సందర్భంలో నేను నీ'వేణు'ను హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను. సాహిత్యంలేని జాతి దారె

ద్యాంలోకొట్టుమిట్టాడుతుందనే ప్రాచీనసత్యాన్ని వర్తమానకాలం లో ఉద్రేకాలకారణంగా మర్చిపోతున్నాము. దానికి ఫలితంగా హైన్యాంధకారం మన జాతీయజీవితంలో నిరంతరం వృద్ధిచెందు తోంది. సంఘంలో కళ్మలం చాలా పేరుకుపోయింది. దుఃఖానికి హద్దులేదని అందరికి తెలిసినదే. కాని ఈ చిన్నపత్రికను కేంద్రంగా చేసుకుని ఉన్న మీరు కొద్దిమంది యువకులు స్త్రీ పురుష సంబంధసమస్యనే అన్ని వేదనలకు మూలంగా చూపక పోవడం నాకు సంతోషంగానే ఉంది. ఆనిసత్యమే మన బాధ లన్నిటిలోకి తీవ్రబాధ అనే విషయం నీ పత్రికలో తరచు కనబడుతోంది. ఈ పత్రిక ఇట్టి నీతిని జవదాటరాదని ప్రార్థి స్తున్నాను.

[వేణు, వైశాఖము - 1337]

సామతాజేడ్, పాణిత్రాస్,
హవారాజిల్లా.

చిరంజీవి భూపేన్,

కొద్దిరోజుల క్రిందటే నీ ఉత్తరం అందింది. వెంటనే కొమిల్లా వెళ్ళవలసివచ్చుటచేత నీకు జవాబు అప్పుడే వ్రాయలేకపోయాను. మరేమీ అనుకోకు. మీరందరూ ఎప్పుడు తిరిగివస్తారు? మీ అందరినీ ఎప్పుడు కలుసుకో గలుగు తాను అని నేనీ గ్రామీణ భవనంలో కూర్చుని ఆలోచిస్తు

న్నాను. సాహిత్యరంగంలో నాకు మీ పరిచయం లభించింది. మీరు హృదయపూర్వకంగా దేశాన్ని ప్రేమిస్తున్నారని నాకు తెలుసు. కాని మీరు ఏ అపరాధానికి బంధింపబడ్డారో తెలియడంలేదు. అతి త్వరలో విడుదలై సాహిత్యరంగంలోకి తిరిగి రావాలని ప్రార్థిస్తున్నాను.

'శేషప్రశ్న' నవల నీకు బాగా నచ్చినదని తెలుసుకుని చాలా సంతోషిస్తున్నాను. ఇందులో చాలా సాంఘిక సమస్యల సమీక్షఉంది. కాని వాటి పరిష్కారబాధ్యత మీమీదఉంది. భవిష్యత్తులో ఈ కఠోర బాధ్యతను నిర్వహించాలనే సూచనయే మీకు ఆనందాన్ని కలిగించియుండవచ్చు. కాని చాలా మంది ఈ పుస్తకం చూచి నిరాశ చెందుతారనీ, వారికి దీని వల్ల ఏమీ ఆనందం కలుగదనీ నే ననుకుంటాను. ఒక టేమిటంటే కథాంశం చాలా తక్కువ. రెండవది ఒక చిన్న నిద్రతీసినట్లు చదువుతూ ఆనందం అనుభవించడానికి దీనిలో వీలులేదు. ఇది బాగుండడమనే విషయమేలేదు. కొద్దిమందైనా అర్థంచేసుకుని చదువుతారు, అలాఅయినా నాపని సార్థకమైనట్లేనని తలచి నే నిది వ్రాశాను. అందరికీ అన్ని రసాలూ పనికిరావు. అధికార తారతమ్యాన్ని నేనూ అంగీకరిస్తాను.

మరొకవిషయం ఏమంటే అది అతి నవ్యసాహిత్యం. ఆ వరుసలోకూడా ఏదైనా సంజ్ఞామాత్రంగా వద్దుల్దామనుకున్నాను. ముసలివాణ్ణి అయిపోయేను. ఇంక వ్రాయగలిగే శక్తి ఉడిగినట్లే. కాని మళ్ళా ముందుతరాలవారైన మీకు

కలుషితం చేయకుండానే అతి నవ్యసాహిత్యం వ్రాయవచ్చుననే నమ్మకం కుదురుతుం దనుకున్నాను. కేవలం కోమలమైన రసానుభూతి మాత్రమే కాక, మెదడుకు గట్టిమేత నివ్వడంకూడా అతినవ్య సాహిత్యానికుండవలసిన ముఖ్యలక్షణం. ఇంక తర్వాత మీరు వ్రాసినప్పుడు మీరూ చాలా చదివి ఆలోచించవలసి వస్తుంది. కేవలం వినోదానికని తేలికగా వ్రాసేసినంతమాత్రాన చాలదు.

జైలులో ఉన్నావుగదా. ఇప్పుడు నీకు కావలసినంత తీరిక ఉంటుంది. నీకు నా సందేశ మేమిటంటే ఈ మంచి అవకాశాన్ని నష్టపరచుకోకు. ఈ ఏకాంతవాసం నీ భావిజీవితంలో మంగళద్వారాలు తెరుస్తుంది. జనంలోంచి మనుష్యులను గుర్తించడం నేర్చుకో. మనుష్య స్వరూపాన్ని గుర్తించడమే సాహిత్యానికి కావలసిన నిజమైన సరంజామా. ఈ సత్యాన్ని మరువకు.

ముసలితనంలో నా శరీరం ఏ అవస్థలో ఉండాలో అలాగేఉంది. కులాసాగా ఉంది. నీ కేకష్టం కలగకుండుగాక అని ఆశీర్వదిస్తున్నాను.

4 జ్యేష్టము 1338.
శ్రేయోభిలాషి,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

శ్రీకృష్ణేందు నారాయణ భౌమిక్‌కు వ్రాసినది.

చిరంజీవి...

పత్రికా నిర్వాహణను గురించి నా అభిప్రాయం తెలుపమన్నావు. నే నెప్పుడూ పత్రికలు నడుపలేదు, అందుచేత నా కావిషయంలో వాస్తవికానుభవం లేదు. కాని ప్రతి నెలా చాలా పత్రికలు చదువుతూ ఉంటాను. వాటివల్ల మాసపత్రికలు చాలామందిని ఆకర్షించగలిగేటట్లు ఉండడంకోసమని రచనలో స్నిగ్ధత్వము, సంయమము అవసరమనీ, ఉద్రేకం రెచ్చగొట్టడానికి వ్రాయబడేవాటిని పరిశీలించినట్లయితే వాటి పైపై మెరుగులు పాఠకుణ్ని కొద్దికాలం వరకే పట్టిఉంచుతాయనీ, వాటికి స్థిరత్వం లేకపోగా ఆ తర్వాత వాటి ప్రతిక్రియకూడా అవాంఛనీయంగా పరిణమిస్తుందనీ గుర్తించగలం. కథలోగాని, మరెందులోనైనాగాని విషయం రచయిత అనుభవంలోనుంచి విశుద్ధ సత్యరూపంలో రచనలోనికి రాకపోతే శైలి, భాషాడంబరం ఎంత ఆశ్చర్య చకితులను చేసేవిగా ఉన్నా, అంతస్సార శూన్యములై అవి నిలవలేవు.

ఈ మధ్య ఇంటలెక్ట్యుయల్ [బుద్ధివాద] కథలంటూ వింటున్నానుగాని, యింతవరకూ చూడలేదు. ఒకవేళచూసినా గుర్తించలేదో. ఒకసారి ఒక కథ చదివాను. పూర్తిచేసిన తర్వాత రచయిత పాండిత్యభారంచే అణగిపోయి దారిమధ్యలోనే బోర్లాపడిపోయిందా అనిపించింది. అలాంటివాటికి పత్రికలో ఎప్పుడూ స్థానం యివ్వకు. అలాగని కథలో బుద్ధివాదం ఉండడమే దూష్య

మని, కాదు; హృదయ ప్రవృత్తినే అధికంగా తన కథనం ద్వారా వ్యాపింప చేయగలగాలి.

('స్వదేశ్' ఆశ్వయుజం 1340)

శ్రీ అవినాశచంద్ర ఘోషాల్‌కు వ్రాసినవి

25, శ్రావణము 1341.

'వాతాయన్' ప్రతి సంచిక నేను శ్రద్ధగా చదువుతున్నాను. సోమరితనం, మర్చిపోవడం అనేవి ఈ సందర్భంలో జరగడం లేదు.

పత్రికలోని అన్ని విషయాలతో నేను ఏకీభవిస్తానని అనలేను. కాని అకారణంగా వ్యక్తిగత ఈర్ష్యవల్లగాని, ద్వేషంవల్లగాని విమర్శలను కలుషితం చేయడమనేది నే నింత వరకూ చూడలేదు. ఇది చాలా సంతోషించదగ్గ విషయం. ఒకవేళ లోగడ అలాంటి వేమైనా జరిగి నా దృష్టికి రాకుండా ఉంటే వాటినిగురించి 'గతం గతం' అని మాత్రమే అనగలుగుతాను. అయితే ఈ నూతన సంవత్సరంలో మీరొక విషయాన్ని గుర్తుంచుకోవాలి. అది;రచనలో అసహనాన్ని అయినా సహించవచ్చుగాని క్రూరత్వం, నైచ్యం, అసత్య ప్రచారం మొదలైన మానవుని అధమునిగా చిత్రించుటకు చేయు ప్రయత్నాలు సహించలేము. వాటివల్ల రచయిత, స్వయంగా

నీచుడై పోయి, తన అసలు విషయాన్ని బయటపెట్టుకుంటాడు. అప్పుడు పత్రిక మర్యాదపోతుంది. ఆశయం శిథిలమైపోతుంది. విమర్శ అనవసరశ్రమగా దిగజారి పోతుంది. అన్ని వేపులనుంచి ఇక ఆ పత్రిక శ్రేయస్సుకున్న ఆశలు అడుగంటిపోతాయి. పత్రికకు ఇంతకుమించిన అధోగతి వేరేఉండదు. అసత్యం, అన్యాయమేకాక, అసుందరం (కురూపత్వం) కూడా ఎప్పుడూ దీర్ఘజీవి కాలేదు.

['వాతాయన్' 25 శ్రావణం 1311]

దేశంలోని వారపత్రికలు ప్రజల దృష్టిని, జిజ్ఞాసను ఆకర్షిస్తున్నట్లు కనబడుతోంది, అంటే మనిషి తన దైనందిన కార్యకలాపాల్లో దీని అవసరాన్ని కూడా గుర్తిస్తున్నాడన్నమాట. ఇది సంతోషించదగిన విషయం. కాని, ఈ ప్రతిష్ఠను సంపాదించడంవరకే చాలదు; పనిద్వారా తనకు వచ్చిన మర్యాదను రోజురోజూ వృద్ధిచేసుకోవాలి. నీ కార్య పటుత్వం సాధారణ ప్రజల సౌభాగ్యాన్ని, కళ్యాణాన్ని, సమృద్ధిని వృద్ధిచేస్తుందని గుర్తించాలి. కార్యపటుత్వం ద్వారా కాక మరి ఏ యితర ఉపాయం ద్వారానైనా పత్రిక అస్తిత్వాన్ని నిలుపుకోవాలని ప్రయత్నించడం వ్యర్థమూ, అనవసర ప్రయాసే అవుతుంది.

నిన్ను నేను చిన్నతనంనుండి ఎరుగుదును. నీ ఆదర్శాలు అనుభవాలను గురించి నావద్ద చర్చించి తమ్ముడివలె నా సలహాలు అడుగుతూ ఉండేవాడివి. నీ జీవితయాత్రలో యివన్నీ మర్చిపోవద్దని నా కోరిక.

పత్రికను నడపడం ఒక బాధ్యతతో కూడుకున్నది మాత్రమేకాదు. దాంట్లో ఎన్నో అడ్డంకులున్నాయి. రకరకాల వ్యతిరేకతలను ఎదుర్కోవలసి వస్తుంది. రూపురేఖలు తాత్కాలికం మాత్రమే; అందుచేత సంయమము, సహనము ముఖ్యావసరాలు. నిర్భయ విమర్శలు వారపత్రికలకు ప్రాణంవంటివి. కర్తవ్యవిముఖత్వం ఘోరతప్పిదము. ఇవన్నీ ఇలాఉండగా అన్నిటికంటె మించి నీ శీలం, నీ మర్యాద విలువకలిగినవిగావుండాలి. సౌజన్య రహితంగా, కుప్రభావాలకు లోనై నీ అభిప్రాయాలను, వ్రాతలను కలుషితం చేసుకోకు. ఒకరిని చిన్నబుచ్చడంలో కాక, అందరినీ గౌరవంగా చూచుటలోనే నీ శక్తిని వినియోగించాలని నేను కోరుతున్నాను. అభ్యుదయపథంలో నీకు తిరుగులేని విజయాలు లభించితీరుతాయి.

7 శ్రావణము 1342,
శ్రేయోభిలాషి,
శరచ్చంద్ర చటోపాధ్యాయ.

శ్రీ మతిలాల్‌రాయ్‌కి వ్రాసినది.

పరమపూజ్యులకు,

సత్యం-శివం-సుందరం కళాసాధనకు మూలసూత్ర మని పెద్దలు చెప్పారు. అంటే సాధన సత్యంమీద సుందరం మీద ఆధారపడిఉండాలనీ, దానిఫలితం మంగళమయం కావాలనీ గదా! విజ్ఞానసాధకులైనవారికి (తత్వజ్ఞానులను గురించికాదు - మామూలు వాడకం అర్థంలో) అంటే వైజ్ఞానికులైనవారికి ఏకైక మంత్రం సత్యం. వారి కృషియొక్క ఫలితం సుందరమైనా, అసుందరమైనా; మంగళదాయకమైనా, అమంగళదాయకమైనా వారికేమీ పరవాలేదు. అయినా మంచిదే; కాకపోయినా మంచిదే...

కాని సాహిత్యసేవలో చాలాకాలంగా మునిగిఉన్న నేను సత్యం - సుందరం మధ్య అడుగడుగునా వైరుధ్యాన్ని నిరంతరం చూస్తున్నాను. సాంసారిక జీవితంలో సత్యమైన సంఘటన సాహిత్యంలో సుందరం కాకపోవచ్చు. అలాగే వాస్తవ జీవితంలో సుందరమైనది సాహిత్యంలో పదహారణాలా మిథ్య కూడా కావచ్చు. సత్యంగా చూస్తున్న దానికి సాహిత్యంలో రూపం ఇవ్వబోతే భీభత్సంగానూ, కురూపంతోనూ తయారౌతోంది; మరొకవేపు అసత్యం అనుకునేదాన్ని వదలివేస్తే సుందరంయొక్క రూపమే లభించుటలేదు. మంగళం - అమంగళం సమస్యకూడా ఇలాగే ఉంది. సాహిత్యంలో ఈ విషయం అప్రాసంగికమని స్వీకరించవలసి ఉంటుంది.

సత్యం, సుందరంకు వ్యతిరేకమైతే, మంగళం – అమంగళం అప్రధానమైతే సాహిత్యసాధనలో ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తామా అనిపిస్తోంది.

భవదీయుడు,

శరచ్చంద్ర చటోపాధ్యాయ,

('ప్రవర్తక్' ఫాల్గుణము 1344)

శ్రీ పశుపతి చటోపాధ్యాయకు వ్రాసినది.

నేను నాటకాలు ఎందుకు వ్రాయడంలేదు? అని నీ ప్రశ్న— బహుశః రెండు కారణాలవల్ల నువ్వీ ప్రశ్న వేసిఉంటావు. మొదటిది నాటకకారులు, ఇతర గ్రంథకర్తలద్వారా రచింపబడిన నవలలకు నాటకరూపాన్నిచ్చిన శ్రీయుత యోగేశ్ చౌదరీ ఈమధ్య 'వాతాయన్'లో బెంగాలీ నాటక సాహిత్యాన్ని గురించి వ్రాసిన వ్యాసంతో నువ్వు పూర్తిగా ఏకీభవించి ఉండవు. ఇక రెండవది: నువ్వు సాధారణంగా రంగస్థలం మీాద చూస్తున్న నాటకాలలోని భావం, శైలి, భాష, పాత్రపోషణ వీటన్నిటిని విమర్శనాదృష్టితో చూచి శరచ్చంద్రుడు కూడా నాటకాలు వ్రాస్తే రంగస్థలంలో పరివర్తనం వస్తుందని అభిప్రాయపడిఉంటావు.

నీ ప్రశ్నకు నేను చెప్పే సమాధానంలో మొదటివిషయం, నేను నాటకాలు వ్రాయను. కారణం అంటావా అందుకు నేను అనర్హుడను. ఒకవేళ నా అనర్హతని అంగీకరించకుండా నేను నాటకాలు వ్రాస్తే నాకు తగిన విలువరాదు. కేవలం డబ్బుకొరకే వ్రాస్తున్నానని అనుకోకు. ప్రపంచంలో దాని అవసరమూ ఉంది. కాని అదొక్కటే ముఖ్యంకాదు. ఈ సత్యాన్ని నే నెప్పుడూ మరువను. నవలలు వ్రాస్తే తమకు తామై కోరి మాసపత్రికల వాళ్ళు తీసుకుంటారు. వాటిని అచ్చువేయించే ప్రకాశకులకూ కరువులేదు. నవలలు చదివేపాఠకులూ ఉన్నారు. ఇక ముందు సంగతి చెప్పలేనుగాని ఇంతవరకూ. కథ లెలా వ్రాయాలోకూడా నాకు తెలుసు. 'కథ వ్రాయడం నేర్పండి' అని ఎవరిదగ్గరకూ వెళ్ళి నేర్చుకోవాల్సిన అవసరం నాకు లేదు. కాని నాటకమో? నాట్యశాల అధికారులే దాని నిర్ణయాలకు హైకోర్టులు. తలత్రిప్పేసి ఇక్కడ యాక్షను బాగుండలేదంటే దర్శకుడు ఒప్పుకోడు; నాటకం సాగదు. ఇంక దాన్ని ముందుకు త్రొయ్యడం జరుగదు. వాళ్ల అభిప్రాయాలే అంతిమ నిర్ణయాలు. ఎందుకంటే వారే అందులో నిపుణులు. డబ్బు ఇచ్చే ప్రేక్షకుల ప్రతి వాదాన్ని వారు ఎరుగుదురు. అందుచేత ఏరికోరి కష్టంలో చిక్కుకోవడం సందిగ్ధమే.

నేను నాటకాలు వ్రాయగలననుకుంటాను, ఎందువల్లనంటే నాటకానికి అత్యంత ప్రయోజనకరమైనది, ప్రేక్షకుల హృదయాలను చూరగొనే కథోపకథనం వ్రాసే అలవాటు నా

కుంది. మాటలు ఎలా చెప్పాలి? ఎలా, ఎంత సరళంగా చెబితే ఇతరుల మనస్సును తేలికగా ఆకర్షిస్తుంది అనేవి నాకు తెలియక పోలేదు. ఇవేకాక పాత్రపోషణ, సంఘటనల క్రమ నిర్మాణం అంటావా అవీ నిర్వహించగలననే నా నమ్మకం. నాటకాల్లో పాత్రపోషణకు సిట్యుయేషన్ ఏర్పరచవలసిఉంటుంది. పాత్ర సృష్టి రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి బహిరంగం: అంటే ఘటనాపరంపర సహాయంతో ఉన్నపాత్రలను ప్రేక్షకులముందు పెట్టడం. రెండవది: పాత్రపోషణ. అంటే ఘటనాపరంపర మధ్య నుంచి జీవితంలోవచ్చే మార్పులను చూపడం. అది మంచి అయినా కావచ్చు; చెడుఅయినా కావచ్చు. 20 సంవత్సరాల క్రిందట ఒక వ్యక్తి విల్సన్ హోటల్‌లో తింటూఉండేవాడు. ఎప్పుడూ అబద్ధాలు చెప్పేవాడు; చెడ్డపనులు చేసేవాడుఅనుకో. ఇవాళ ఆ వ్యక్తి సాతాని వైష్ణవుడు. బంకించంద్రుని మాటల్లో చెప్పాలంటే ఆకుమీద చేపనీళ్ళు పడితే తుడిచేస్తాడు. అయితే ఇది అతని నటనకాక నిజంగా హృదయ పరివర్తనకూడా కావచ్చు. రకరకాల సంఘటనలమధ్యపడి కొంతమంది మంచి వారి సంపర్కంలోకి వచ్చి ఆ ప్రభావంవల్ల ఇలా మారిపోయి ఉండవచ్చు గదా. 20 సంవత్సరాల క్రింద ఉన్న అతని స్థితీ నిజమే. నేడు అతనిలో కలిగిన పరివర్తనా నిజమే. కాని దీన్ని యథాతథంగా నాటకంలో ప్రేక్షకుల ఎదుట పెడితే చాలదు. నాటకంలోనుంచి, రచనద్వారా ప్రేక్షకుని ఎదుట దీన్ని యదార్థమని నిరూపించాలి. వాళ్ళకి ఈ పరివర్తనకు కారణం నాటకంలో వెతికితే దొరక్కుండా వుండకూడదు. ఇది కష్టం.మరొక

విషయం నవలలోవలె నాటకం పెరిగిపోకూడదు. నాటకం ఒక నిర్ణీతసమయంలో సమాప్తమైపోవాలి. ఇంతేకాక నాటకంలో సంఘటనలను అలంకరించి విడదీసి అంకాలుగాను, రంగాలుగాను విడదీయాలి; ప్రియత్నిస్తే ఇది అసాధ్యం కాదు. కాని యింతాచేస్తే ఏమిటి లాభం అంటాను. వ్రాసే నాటకాన్ని రంగస్థలంపైకి తెచ్చేదెవరు? విద్యావంతులైన, విజ్ఞానవంతులైన నటీనటులెక్కడ వున్నారు? నాటకానికి నాయకి కాదగిన ఒక్క నటికూడ నాకు కనబడలేదు. ఇంకా ఇలాంటి చాలా కారణాల వల్ల సాహిత్యంలో ఆ వేపు అడుగుపెట్టాలని అనిపించడం లేదు. ఎప్పుడో ఒకప్పుడు ప్రస్తుతనాటకరంగంలోని ఈ లోటు తీరగలదనే ఆశిస్తున్నాను. అయితే ఈ జీవితంలో చూచే అవకాశాలు లేవు. వాస్తవప్రేరణ కలిగితే ఎప్పుడైనా వ్రాస్తానేమో! కాని నానుంచి ఆశించకు.

('నాచ్ ఘర్', 25 ఆశ్వీయుజం 1౩4?)

—— • • • ——

[శ్రీ జహానారా చౌదరీకి వ్రాసినది]

12, మాఘం – 1342.

నీ వార్షికసంచికకు ఏమైనా వ్రాయమని కోరావు. నా ప్రస్తుత అనారోగ్యస్థితిలో ఏమీ వ్రాయలేను. మధ్యమధ్య చాలా సార్లు సాహిత్యంయొక్క ధర్మము, రూపము, నిర్మాణం, రంగం, వీని తత్వములు మొదలైన వాటిమీద కొంతచర్చజరి

గిందిగాని, ఇంకా మరొక ముఖ్యమైన అంశంమీద నేటివరకూ బహిరంగంగా చర్చసాగ లేదనుకుంటాను. అది సాహిత్యకళ్యాణ సంబంధంలో దాని ప్రయోజనానికి సంబంధించిన అంశం. సాహిత్యంలో నిబిడీకృతమై వున్న రసమువల్ల పాఠకులకు మనసుల్లో నిర్మలమైన ఆనందాన్ని కలిగించడమేకాక మానవునిలో అంతర్భాగంగా వున్న కుసంస్కారాల మూలములపైకూడా సాహిత్యం గొడ్డలిపెట్టు పెడుతుందని అందరూ ఒప్పుకుంటారు. దీనివల్ల మనిషి గొప్పవాడు కాగలుగుతాడు. అతనిదృష్టి ఉదారతతో నిండుతుంది. అతని సహనశీలమైన, క్షమాశీలమైన మనస్సుకు సాహిత్యరసముయొక్క నూతన కృతివల్ల లాభం చేకూరుతుంది.

బెంగాలులోని ఒకపెద్ద సంప్రదాయంలో దీనికి వ్యతిరేకత కనబడుతోంది. సాహిత్యసృష్టితో పాటుగా బాధ, క్షోభ కూడా పెరుగుతున్నట్లుంది. నేను మీ ముస్లింసాంప్రదాయం సంగతే చెబుతున్నాను. కోపం రావడంవల్ల కొందరు వికృత భాషాప్రయోగాలకుకూడా వెనుకాడుటలేదని తెలుస్తోంది. దీనికి కారణం లేకపోలేదని నేనననుం, కాని వారికోపం తగ్గిపోయిన తర్వాత వారే స్వయంగా ఆ కారణం ఏమంత పెద్దది కాదని తెలుసుకోగలుగుతా రనుకుంటాను. కారణం ఏదైనా కానీ, ఇంతవరకూ బెంగాలులో హిందువులు మాత్రమే సాహిత్యచర్చ చేస్తూ వచ్చారు. ముస్లింధర్మము చాలా కాలంబట్టి దీనిమొడల విముఖంగా ఉంది. అయినా కృషికి ఫలితం ఉంటుం

దిగదా! అందుచేత సరస్వతీదేవి వీరికికూడా వరదానం చేసింది. కొద్దిమందైనా, ముస్లిం సాహిత్య రసికులను నేను మరువలేదు. కాని అది విస్తృతం కాలేదు. అందుచేతనే గ్రంథంవల్ల కొందరు కొందరు దీన్ని హిందూసాహిత్యం అన్నారు. అయితే ఆక్షేపించి నంతమాత్రాన తర్కసమ్మతం కాదుగదా.

అయినప్పటికీ, సాహిత్యకారుల్లో ఎంతమంది తమ రచనలలో ముస్లిం చరిత్రను చిత్రించారు? ఎన్ని స్థలాలలో ఇంత పెద్ద సంప్రదాయముయొక్క సుఖ - దుఃఖాలు వివరించారు? అని అడుగవచ్చును. అలాంటప్పుడు వారి సానుభూతిని ఎలా పొంద గలుగుతారు? వారి హృదయాన్ని ఎలా స్పర్శిస్తారు అని కూడా ప్రశ్నించవచ్చు. వారి హృదయాన్ని ఇంతవరకూ స్పర్శించలేదని నాకు తెలుసు; అంతేకాక దానికి విరుద్ధంకూడా కనపడుతోంది. తత్ఫలితంగా నష్టంకూడా తక్కువేమీ జరగ లేదు. ఇక ఇప్పుడు దానికి ప్రత్యామ్నాయంగా ఏదేనా దారి కూడా చూడాలి.

కొంతకాలంక్రింద ఒక ముస్లిం మిత్రుడు ఈ విషయమై నావద్ద తన విచారాన్ని ప్రకటించాడు. ఆయన స్వయంగా సాహిత్యకారుడు, పండితుడు. మతద్వేషాలు ఇంకా హృదయాన్ని దృష్టిని కలుషితంచేయని వ్యక్తి. "ముస్లిం - హిందూ మతాలు రెండూ ఒకేదేశంలో ఒకేపరిస్థితులలో ఇరుగుపొరుగునా ఉంటున్నాయి. జన్మతః ఒకేభాష మాట్లాడబడుతూంది.

శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయము

అయినా ఇవి ఇంత దూరంగా, ఇంత ద్వేషపూరితంగా ఎందుకు న్నాయాలంటే ఆశ్చర్యం వేస్తుంది. జీవితంలో, సమాజంలో బయటిసంపర్కం ఒకటే. కాని అంతఃకరణ సంపర్కం లేదనడం అబద్ధంకాదు. ఇలా ఎందుకు ఉందిఅని శోధించవలసిన అవసరం లేదు. అయితే నేడు ఈ విభేదాన్ని దుఃఖపూరితమైన ఈ తేడాలను రూపుమాపవలసి యున్నది. లేకపోతే ఎవ్వరికీ మేలు చేకూరదు'' అని ఆయన అన్నారు.

"ఇది నేను ఒప్పుకుంటాను. అయితే దీన్ని సాధించ డానికి ఏం ఉపాయం చెబుతారు?'' అని నే నడిగాను.

''ఒకే ఒక ఉపాయం సాహిత్యం. మీరు మమ్మల్ని ఆకర్షించండి. స్నేహంతో, సానుభూతితో మా విషయాలు వ్రాయండి; కేవలం హిందువులకొరకే. హిందూ సాహిత్యాన్ని సృష్టించకండి. ముస్లిం పాఠకులనుకూడా గుర్తించండి. అప్పుడు బయటికి విభేదాలు ఎంత పెద్దవిగా కనపడ్డా ఇద్దరి రక్తనాళా లలో ఒకే ఆనందం, ఒకే ఆవేదన ఎందుకు ప్రవహించదో చూద్దాం" అన్నా రాయన.

దీనికి నే నన్నాను: ''నే నీ విషయా న్నెరుగుదును. కాని అనురాగంతోపాటు వైరాగ్యం, ప్రశంసతోపాటు తిర స్కృతి, మంచి విషయాలతోపాటు చెడువిషయాలు కథా సాహిత్యంలో అవిభాజ్యమైన అంగాలు. అయితే మీరు వీటిని గురించి ఆలోచించలేరా? క్షమించలేరా? బహుశః ఆలోచిస్తే నే ఒళ్ళు గగుర్పొడిచే శిక్ష విధించాలనుకుంటున్నారా ? అలా అయితే అంతకంటే ప్రస్తుతమున్న స్థితే క్షేమకరం."

కొంచెంసేపు ఇద్దరమూ నిశ్శబ్దంగా ఉన్నాము. చివరికి నేనే అన్నాను. "మీలో కొంతమంది మేము పిరికివాళ్ళమని, మీరు వీరులని, హిందువుల కలంనుండి వచ్చేనిందలను సహించమని, దానికి ప్రతీకారం తీసుకుంటామని, అదికూడా చరమావస్థలోనని అంటారు. అదీ నేను ఒప్పుకుంటాను. మిమ్మల్ని వీరులనడంలో నాకు వ్యక్తిగతంగా ఏమీ అభ్యంతరంలేదు. కాని ఈ వీరత్వపు విధానం మారినప్పుడల్లా అందరికంటే మీరే ఎక్కువబాధ లనుభవించారనేది సత్యమని తెలియచేస్తున్నాను."

యువక మిత్రుని ముఖం పాలిపోయింది. "అయితే ఎప్పటికీ ఈ సహాయ నిరాకరణమే సాగుతుందా ?" అన్నాడు.

"లేదు. ఎప్పటికీకాదు. ఎందుకంటే సాహిత్య సేవకులకు మతం - జాతిఅంటూ వేరేలేవు. మూలంలో, హృదయంలో వారు ఒకటే. ఆ సత్యాన్ని స్వీకరించి నేడున్న ఈ అవాంఛనీయ తాత్కాలిక భేధాలను మీరే నిర్మూలించాలి." అన్నాను.

"ఇప్పటినుంచీ అందుకే ప్రయత్నిస్తాను." అన్నాడా మిత్రుడు.

"కృషిచెయ్యి. నీ కృషికి తోడు ప్రతినిత్యం భగవంతుని ఆశీర్వాదం లభిస్తుంది" అన్నాను.

('వర్షవాణి', తృతీయ సంపుటి 1342)

కాజీ వదూద్‌కి వ్రాసినది.

శివపూర్ (హజారా)

20-3-1918.

రెండు రోజుల క్రిందటనే మీ ఉత్తరము, "మిత్ర పరివారము" అందాయని వినయపూర్వకంగా తెలుపుతున్నాను. చివరికథ 'హామిాద్' కాక మిగిలిన వన్నీ చదివాను. ఈ రోజుల్లో కథలు చదవగలగడం, ఆ పైన వాటిని ప్రశంసించడం రెండూ కష్టమౌతున్నాయి. పుస్తకాన్ని అందుకుని గ్రంథకర్తకి నాలుగైదు మంచిమాటలు చెప్పి, హృదయపూర్వకంగా ఉత్సాహాన్ని చ్చే అవకాశం దొరకకపోవడంచేత పూర్తిగా ఊరుకుంటున్నాను. మీరు నాకు అట్టి సదవకాశాన్ని కల్పించారు. అందుకు మీకు ధన్యవాదాలు. నిజంగా నేను చాలా సంతోషపడ్డాను. ఇది మీ ప్రథమ ప్రయత్నమే అయితే భవిష్యత్తులో మీనుండి చాలా ఆశించవచ్చునని వేరే చెప్పనవసరం లేదు.

మీ రచనలో ఉర్దూ శబ్దాలను ఎక్కువగా వాడి మంచి పనిచేశారు. లేకపోతే ముస్లిం పాఠకులు, పాఠకురాండ్రు దీన్ని మాతృభాషగా అంగీకరించి నిస్సంకోచంగా స్వీకరించలేక పోయేవారు. వాళ్ళకెప్పుడూ ఇది హిందువులభాష, తమది కాదు అనిపిస్తూవుంటుంది. ఇరుగుపొరుగునవుండే ఈ రెండు జాతులలో పరస్పరం సాహిత్యస్నేహాన్ని పెంపొందించుటకు

ఇది వుత్తమమార్గం. అయితే అందరూ ఈ అభిప్రాయంతో ఏకీభవించకపోవచ్చు. కాని నేను మాత్రం ఈ అభిప్రాయపక్షపాతిని.

మీకు నేను ఒక విషయం గుర్తుచేయాలనుకుంటున్నాను. నేను చాలాకాలంనుంచీ ఈ రంగంలో వున్నవాడిని. అందుచేత కొంత అనుభవం సంపాదించాననుకుంటాను. ఉచితమైన సలహా చెబుతున్నందుకు కోపగించుకోరనుకుంటాను. విషయమేమంటే అన్ని జాతుల్లోనూ మంచివారూ వున్నారు; చెడ్డవారూ వున్నారు. హిందువులలోనూ వున్నారు. ముసల్మానులలోనూ వున్నారు. ఈ సత్యాన్ని ఎప్పుడూ మరవకండి. మరొక విషయమేమంటే రచయిత ఎప్పుడూ ఏ ప్రత్యేక జాతికీ మతానికీ చెందివుండడు. అతను హిందువు, ముస్లిం; క్రైస్తవుడు, యూదుడు— అన్నీ కూడాను.

భవదీయుడు,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

శ్రీ ఉమాప్రసాద్ ముఖోపాధ్యాయకు వ్రాసినవి.

సామతాజేడ్; పానిత్రాస్, పి. ఓ.

హజారాజిల్లా.

25 ఆషాఢం, 1333.

చిరంజీవి ఉమాప్రసాద్,

మొన్ననే నీ ఉత్తరం అందింది. ఎప్పటివలె ఈమాటుకూడా, భవిష్యత్తులో కూడా అందరికంటె నువ్వు ముందుండాలని నేను కోరుతున్నాను. నీ చదువు బాగా సాగ లేదని నాకు తెలుసు. అయినా నిన్ను ఎవరైనా దాటి ముందుకు పోవాలంటే అది తేలికైనది కాదు.

ఆ తర్వాత మళ్ళీ నేను కలకత్తా వెళ్ళలేదు. ఇక్కడి ఈ చిన్ని కైవారంలోనే ఏదో రోజులు గడిచిపోతున్నాయి. కాని, ఒకసారి పట్టణం వెళ్లివస్తే సర్దుకోవడానికి నాలుగైదు రోజులైపోతాయి.

అంతే కాకుండా వర్షాలు, బురదలో వెళ్ళడానికి దారి కూడా బాగులేదు. అందుకు శక్తిలేదు, ప్రయత్నమూ లేదు, కొద్దిరోజుల క్రిందట చీకటిరాత్రిలో రెండుమెట్లు ఒకటే అను కుని దిగడంవల్ల ఎంత జరగాలో అంతా జరిగింది. బయట కేమీ దెబ్బ తగలక పోయినా, వీపు, నడుము నెప్పి ఇంకా పూర్తిగా తగ్గలేదు.

మనః పూర్తిగా పరీక్షకు చదువు. కుముదబాబును కలుసుకుంటే ఆయన ఉత్తరం అందిందని చెప్పు. వ్యాసం సంగతి నాకు తెలియదు. బహుశా పోయి ఉండవచ్చు.

నీ పుస్తకం ఉంచి, చివరి అధ్యాయాలు చాలావరకూ చూచాను. కాని ముందు పరీక్ష పూర్తికానీ.

అందరూ నన్ను వ్రాయమంటారు. కాని ఏమి వ్రాయాలో మాత్రం అర్థం కావడంలేదు. అంతా అర్థరహితంగానూ, అనవసరంగానూ కనబడుతోంది. ఇతర సాహిత్యకారులవలె నా మనస్సును ఒకసారి ప్రాతకాలపు 'సాహిత్యసేవ' లోనికి తీసుకువెళ్ళగలిగితే మళ్లీ ఎన్నైనా 'బిందోబిడ్డ'లను 'చరిత్ర హీను'లను రచించగలను. కాని ఈ జీవితంలో ఆ రోజులు తిరిగివస్తాయని అనుకోను. వ్రాసినంతమాత్రాన ఏమౌతుంది అని ఎప్పుడూ అనుకుంటూఉంటాను. ప్రజలకు ఆనందం లభిస్తుందా? ఆనందం లభించకపోయినా మొట్టమొదట అదిపొందే అధికారాన్ని సంపాదించాలి. అప్పుడు'బిందుగారబ్బాయి' 'రామునిబుద్ధిమంతతనం' వంటివి కుప్పతిప్పలుగా వ్రాసేవారు చాలామంది వస్తారు.

నిర్మల్ భవానీపూర్‌లోనే ఉన్నాడా? హస్త సాముద్రికం నేర్చుకోవాలనిపిస్తోంది. నా స్నేహపూర్వక ఆశీస్సులు అందుకో.

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

12 శ్రావణము 1333,

చిరంజీవి ఉమాప్రసాద్,

నిన్న నీ ఉత్తరం అందింది. ఇంతకు ముందు కూడా ఒక ఉత్తరం అందింది. కాని యథాసమయంలో సమాధానం వ్రాయలేకపోయాను.

ఇప్పుడే ఒక పడవ నడిపేవానికి చికిత్సచేసి వచ్చాను. ఒళ్ళంతా టించర్ అయొడిన్ వ్రాసి, కాపుకాచే ఏర్పాటుచేసి వచ్చాను. నిన్న రాత్రి అతని నావ మునిగిపోయి అతనిపైగా దాటిపోయింది.

ప్రస్తుతం ఒక విషయంలో నిశ్చింతగా ఉన్నాను. ఈ ఇంటిని రూపనారాయణుడికి(నది) సమర్పించి సుఖంగాఉన్నాను. వరదల్లో ఈ యేరు ఎంత భయంకరంగా ఉంటుందో ఈమారు చూడగలిగాను. మీరు ఇదివరకు నడిచివచ్చే ఆనకట్ట ఇప్పుడు లేదు. నేటి ఈ వరదలో అది నామరూపాల్లేకుండా కొట్టుకుపోవచ్చు. ఆ తర్వాత ఇంక అంతా నీటిమయమే అవుతుంది. బెంగాలులో షడ్ఋతువుల అర్థమేమిటో ఇక్కడ సంవత్సరం పూర్తిగా ఉంటేనేగాని తెలుసుకోలేము. ఇదీ ఒక పెద్ద లాభమే.

ఆ విషయమై కుతూహలంగానే ఉంది. అయితే సరియైన వాళ్ల చేతుల్లోనే ఉందని తెలుసు. ఉపాయుండుంటే సరేసరి. దానికి తల బ్రద్దలుచేసుకోవడం అనవసరం. కాని చివరికి

ఏమౌతుందో తెలిసినదేకదా. 10, 15 రోజులవరకూ వర్షం, వరదతర్వాత ఇక్కడ దిబ్బ వెయ్యడం, అక్కడ గండికొట్టడం అలాగే గడచిపోతుంది.

ఫౌంటెన్‌పెన్ చెడింది. టార్చి విరిగింది.

నీ వకీలు పరీక్షాఫలితం ఏమైంది ?

నా ఆశీర్వాదాలందుకో. శరీరస్థితి అంతగా చెడిపోలేదు.

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

(18 ఆశ్వయుజం 1313)

చిరంజీవి బిజూ,

చాలాకాలంనుంచి నీ నుండి ఉత్తరంలేదు. ఎక్కడున్నావోకూడా సరిగా తెలియలేదు. నా ఆరోగ్యం ఇంతకు ముందుకంటే బాగుంది. రెండు ఇమిటీన్ ఇంజెక్షన్లవల్ల కొంచెం లాభించింది. రక్తం పడటం ఆగిపోయింది. సైనోజెజీను, గ్రుడ్లు, గజ నిమ్మపండ్లు నియమిత సమయాల్లో పుచ్చుకుంటూ ఉండడంవల్ల ఆరోగ్యం కొంచెం బాగున్నది. కాని బయట చూస్తే మాత్రం ముఖం బాగా డీలాపడినట్లు కనపడుతుంది. పోనీలే. 'భారతలక్ష్మి' అనే క్రొత్తమాసపత్రిక సంపాదకుడుగా ఉండడానికి అంగీకరించాను. చివరివరకూ రాజీపడుతూనే

ఉండాలిగదా. ఇవాళ ఒక ఉత్తరం వ్రాశాను. అందులోని షరతులు వాళ్ళు ఒప్పుకుంటే సంపాదకత్వం వహిస్తాను. ప్రపంచంలో ఎక్కువమంది వ్యక్తులకు ఏమి జరుగుతూ ఉంటుందో నాకూ అదే జరుగుతోంది. అంటే ప్రపంచంలో తెలివైనవాళ్ళూ - తెలివి తక్కువవాళ్ళూ ఇద్దరూ ఉన్నారు; ఏదో ఒక పక్షం విజయం సాధిస్తూ ఉంటుంది. ఎక్కువ కాకపోయినా 4, 5 వేలు పోగుచేశాను. 'భారత లక్ష్మి'లో చేరి ఇదంతా అందులో పెట్టాలనుకుంటున్నాను. వారు నాకు నాల్గవభాగం ఇస్తారు. ఇప్పుడింక ప్రపంచజ్ఞానం తెలిసినవాళ్ళలాగా వ్యవహరిస్తాను. అంటే మోసపోను అన్నమాట. దసరా తర్వాతనే అన్ని విషయాలూ సవివరంగా నిశ్చయిస్తాను. కాని, అప్పుడే సాహిత్యరంగంలో పరిచితులూ, అపరిచితులూ చాలామంది తమ రచనలు స్వీకరించి అడ్వాన్సుగా కొంత మొత్తాలు పంపమని వ్రాస్తున్నారు. ఆశక్తే నాకు ఉంటే! అదే నా కిప్పుడు అత్యంత అవసరం.

నిన్ను చూచి చాలారోజులైంది. జ్వరం తగ్గిపోతే ఒకసారి మీరే ఎందుకు రాకూడదు. నా స్నేహపూర్వక ఆశీర్వాదా లందుకో.

—అన్న.

24 అశ్వినీదత్తరోడ్, కాలీఘాట్.
కలకత్తా,
12 కార్తికం 1343.

చిరంజీవి బిజూ,

నిన్న గ్రామంనుండివచ్చే సరికి నీ ఉత్తరం అందింది. పెద్దకోడలు నిమోనియాతో మంచం పట్టిందని కబురు వచ్చింది. అందుచేత త్వరగానే తిరిగివచ్చాను. కాని పరిస్థితి అంత ప్రమాదంగాలేదు. బహుశా త్వరలోనే తగ్గిపోవచ్చు. లేకపోతే అసలే బీదవాణ్ణి. ఈ కలకత్తాలో చికిత్స చేయించా లంటే భరించలేను.

నా 61 వ జన్మదిన సందర్భంలో ఉదారమైన భావంతో కవి నన్ను ఆశీర్వదించారు. హృదయపూర్వకంగా నా సుఖాన్ని కాంక్షించారు. 'ఆనందబజార్ పత్రిక' లో అచ్చయిం దంతా నీకు పంపబడింది. ఆయన స్వదస్తూరితో వ్రాసి (ఆశీర్వాదం) నాకిచ్చారు. నువ్వు వచ్చినపుడు వారి ఇతర ఉత్తరాలవలెనే ఇదికూడా దాచి ఉంచడానికి నీకు యిస్తాను. అప్పుడీ లేఖాంశము నాకు తిరిగి ఇద్దువుగాని. నేను ఆరోగ్యంగా లేనుగాని, మునుపటికంటే బాగున్నాను. జ్వరం రావడంలేదు. నా ఆశీర్వాదాన్ని అందుకో. నీ అన్న లెవరైనా ఉంటే క్షేమం అడిగినానని చెప్పు.

శుభాకాంక్షి,
శరచ్చంద్ర చటోపాధ్యాయ,

శ్రీ రవీంద్రనాథ టాగూరుకు వ్రాసినవి

శివపూర్,

29 పుష్యము 1324.

పాదసన్నిధికి,

ఇవాళ మేము మీ వద్దకు వచ్చేవారమే. కాని దారిలో శ్రీయుత ప్రమథబాబు వద్దనుంచి టెలిఫోనుచేస్తే మీరు బోల్‌పూర్‌లో ఉన్నారని తెలిసింది. బహుశా మాఘోత్సవాలకు వస్తారేమో. కాని అప్పుడు మిమ్మల్ని కలుసుకోవడం చాలాకష్టం.

నా పేటలో ఒక చిన్న సాహిత్య సంఘం ఉంది. నెలకో - రెండు నెలలకో ఒకసారి ఎవరో ఒకరి ఇంట్లో సమావేశమౌతూ ఉంటాము. ఇది చాలా చిన్న విషయం. అయినప్పటికీ క్రిందటిసారి ప్రమథబాబును పట్టుకోగలిగాము. చివరకు ఆయన ఆనాటి సభకు అధ్యక్షత వహించారు.

చాలా రోజులనుంచి ఈమారు సభకు మీరు విచ్చేయగలిగే అవకాశం ఉంటుందేమోనని ఆలోచిస్తున్నాము.

మీరు యింటికి తిరిగివచ్చిన తర్వాత మీరు అనుమతిస్తే మీ వద్దకువచ్చి నివేదించుకుంటాము.

సేవకుడు,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

శివపూర్ (హౌరా)
26 వైశాఖము 1329.

పాదసన్నిధికి,

మీరు నాయందు చాలా కోపగించుకున్నారని పిల్లలద్వారా విన్నాను. ఉద్రేకంలో కోపంతో మీ గురించి సత్యంకాని విషయాలు చెప్పియుండవచ్చు. అయితే వాటి తప్పొప్పులు తెలుసుకోవాలని మీ వద్దకు వచ్చిన వ్యక్తికూడా ఏమీ తక్కువ అపరాధం చేయలేదు. ఇంగ్లండు ప్రవర్తనకు మీరు చాలా బాధపడ్డారు. అదికూడా ఆ పంజాబుకు సంబంధించిన ఉత్తరాన్ని గురించే. ఆయన ఇవి వ్రాయకపోతే ఇదంతా జరిగేదేకాదు. ఈ విషయాలు నే నప్పుడు ఎలా చెప్పానో నా కిప్పుడేమీ గుర్తులేదు. సాధారణంగా నేను అబద్ధాలు కల్పించి చెప్పను. కాని అది పూర్తిగా అసంభవమనీ నేను అనను. ఈమారు మీరు ఇంగ్లండునుంచి వచ్చిన తర్వాత చాలా మారిపోయారనీ, బెంగాలీలపట్ల మునుపటి మాదిరిగా ప్రేమ, మమత్వం మీలో లేవనీ, చరఖా, సహాయ నిరాకరణం మొదలైన వాటిపై మీకు ఏ మాత్రమూ నమ్మకం లేదనీ నే నన్నమాట వాస్తవం.

ఒకరోజున కొంచెం కోపంతో మీ వద్దనుండి వచ్చేశాను. బహుశా, ఆ తర్వాతనే కొన్ని అయదార్థ విషయాల ప్రచారం జరిగియుండవచ్చు. అప్పుడు నా మనస్సులో ప్రజలు

తప్పు అర్థం చేసుకుంటే చేసుకోనీలే అనే భావముంటే ఉండి ఉండవచ్చు.

మీ యెడల నేను చాలా పెద్దతప్పు చేశాను. అయితే మొదటిసారి కనుక క్షమించండి. మీ వద్దకు కాక మరే పెద్ద వారివద్దకూ నేను బుద్ధిపూర్వకంగా వెళ్ళను. నాకు ఆ మార్గం నా తప్పువల్లనే మూసుకుపోయింది. ఆలోచిస్తే దుఃఖం కలుగు తుంది.

మీకున్న అనేకమంది శిష్యుల్లో నేనొకడను. ఇంత వరకూ వారివలె నేనుకూడా ఎప్పుడూ మిమ్ము నిందించలేదు. కాని ఈ మారీ దుర్దశ ఎందుకు పట్టిందో నాకే తెలియడం లేదు.

నా ప్రణామము లందుకోండి.

సేవకుడు,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

శివపూర్ [హవారా]

26 వైశాఖము 133?.

పాదసన్నిధికి,

మీరు స్వల్ప స్వార్థంకొరకు దేశానికి హాని చేశారు అని అంత పెద్దనింద మోపేటుంటే ఆ పైన ఉత్తరం

వ్రాసి క్షమార్పణ కోరడం మిమ్ము ఎగతాళి చేయుటే కాక మిమ్ము కవ్వించుట అవుతుంది. అందువల్ల మీ ఉత్తరం ఇంత కఠినంగా ఉండడంలో ఆశ్చర్యంలేదు.

ఈ పెద్ద అపరాధం విషయాన్ని మీ వరకూ తెచ్చి చెప్పినవారు దానికి హద్దులంటూ లేకుండా చేశారు.

ఇంక నేనేం చెప్పను. నా ప్రణామము లందుకోండి.

సేవకుడు,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

శివపూర్ (హౌరా)
2 మాఘం - 1330.

పాదసన్నిధికి,

ఎన్నో పనులమధ్య క్షణంకూడా మీకు తీరికలేదనే విషయాన్ని మే మందరం ఎరుగుదుము. అయినప్పటికీ మీరు మాట్లాడినంత తేలిగ్గా గీతం వ్రాయగలరనీ, అది నా నాటకం లోని లోపాలన్నీ కప్పగలదనీ అనుకుని మీకు వ్రాశాను.

సత్యేంద్ర నేడుంటే మీ యీ ఉత్తరాన్ని చూపి అతనిచే వెంటనే పాట వ్రాయించుకునే వాడిని. అతనికి ఈ ఉత్తరం ఒక ప్రేరణగా ఉండేది. కాని అతను పరలోకంలో ఉన్నాడు. పోనీ మరెవరినైనా అడుగుదామూ అంటే ఎవరూ లేరు.

కలకత్తా వస్తే మీకు ఊపిరి పీల్చుకునే తీరికకూడా ఉండదు. అప్పుడీ విషయ ప్రసక్తితెచ్చి నే నేమీ గలభా చేయను. నా శతకోటి వందనాలు స్వీకరించండి.

సేవకుడు,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

సామతాబేడ్, పాణిత్రాస్,
హవ్‌రా 26 ఆశ్వియుజం 1333.

పాదసన్నిధికి,

దసరా సందర్భంలో నా ప్రణామములు స్వీకరించండి. ఈ మధ్య మీరు ఎన్నో గురుతర బాధ్యతలలో మునిగిపోయి శాంతి నికేతన్‌లో కూడా ఉండలేక పోయారు. అందుచేత వందనాలు అర్పించడంలో ఆలశ్యమైంది.

కాల ప్రవాహంతో పాటు నాకు లభించిన మీ ఆశీర్వాదం, నా కొక గొప్ప బహుమానము. మీనుండి లభించే చిన్నవస్తువుకూడా ఏ సాహిత్యకారునికైనా గొప్ప నిక్షేపం అవుతుంది. దాన్ని శిరోధార్యం చేస్తాను.

నా గీత బాగుంది. 31 భాద్రపదాన మీరు కలకత్తా రావడం తటస్థించలేదు. లేకపోతే ఆ రోజున జరిగిన అత్యాచారాలు చూచి ఎంతో బాధపడేవారు. అన్నిటికంటే కష్టం కలి

గించేదేమంటే నా సమవయస్కులగు సాహిత్యకారులే ఈ ఉపద్రవాలను తెచ్చిపెట్టారు. వాళ్ళందరూ వాటికి సంతోష పడితే నేను సంబంధం లేకుండా ఉన్నాను. అదే మంచిపని చేశాననుకుంటాను. గత జయంతి ఉత్సవంలో కూడ వీళ్ళేమీ తక్కువ గల్లంతు చేయలేదు. నేను స్వయంగా ఒకసారి మీకు ప్రణమిల్లి వద్దామను కుంటున్నాను. కాని ఎవరైనా ఏమైనా అనుకుంటా రేమోనని రాలేక పోతున్నాను.

మీ ఆరోగ్యం ఇప్పుడెలా ఉంది? ఆరోగ్యం ఇంత శిధిలమైనా మీ రింత ఎక్కువపని ఎలా చేయగలుగుతున్నారో ఆశ్చర్యంగా ఉంది.

సేవకుడు,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

శ్రీ చారుచంద్ర వంధ్యోపాధ్యాయకు వ్రాసినవి.

హజారీబాగ్ రైల్వేస్టేషన్,

1 ఏప్రెల్ 1930.

చారుసోదరా!

నేను ఢక్కాకు బయలుదేరికూడా తిరిగి ఇంటికి వెళుతున్నాను. ఇవాళ కలకత్తాలోని బళ్ళవాళ్ళు సమ్మెచేయడం వల్ల అంటే సి. యస్. పి. సి. ఎ. అధికారులకు వ్యతిరేకంగా

సత్యాగ్రహం చేయ్యడంవల్ల పెద్ద దుర్ఘటన సంఘటిల్లినది. సార్జంట్లు లాఠిచార్జిచాశారు. ఫోర్టునుంచి తెల్లసైనికులువచ్చి కాల్పులు జరిపారు. నలుగురు మనుషులు చనిపోయారట.

ఇది కలకత్తావిషయం. హవ్రాలోకూడా సి.యస్. పి. సి. ఎ. వుందిగదా. నేను దాని అధ్యక్షుణ్ణి. ఇదొక పెద్దడిపార్టుమెంటు. నేటికి ఎలాగో అలాగా హవ్రామేజస్ట్రేటు, పోలీసు సూపరింటెండెంటుకలసి అల్లరులనుఆపారు. అయినా ముందేమవుతుందో తెలియదు. నేను ఈ డిపార్టుమెంటు అధికారినికావటంవల్ల పట్టణాన్నివదిలి వెళ్ళటానికి వీల్లేదు. అందువల్ల దారిలోంచే తిరిగివచ్చేశాను. రేపే మళ్ళీ తిరిగి రావలసివుండేది.

అల్లర్లుతగ్గి, ఆఫీసు అదుపులో పెట్టుకొన్నతర్వాత నిన్ను కలుసుకుంటాను. క్షమిస్తావని ఆశిస్తాను.

నీ శరత్.

శివపూర్, హవ్రా.
21 ఏప్రెల్ 1925

చారుసోదరా!

నీ వుత్తరం ఇప్పుడే అందింది. ఇవాళవుత్తరాలువ్రాసే స్థితిలో నామనస్సులేదు. అయినా నీ కీవిషయాలు తెలుపకుండా వుండలేను. వచ్చేటప్పుడు త్రోవలో ఒక చచ్చిపోయినదూడ పడివుంది. నీ కాసంగతి గుర్తుండివుండవచ్చు. ఆ తర్వాత ఒక పీకనులిమివేయబడ్డ కోడి కనిపించింది. దారిలోఇన్ని

మృతశరీరాలు ఎందుకు కనబడ్డాయో తెలీడంలేదు. దారిలో ఒకఉడుముకూడా కనిపించిందని నీ వన్నావు. కాని నేను చూడ లేదు.

ఆ తర్వాత యింక మీరు వెళ్ళిపోయారు. బండి బయలుదేరిన తర్వాత దారిపక్కన గద్దలగుంపు చేరివుంది. ఒకకుక్క చచ్చిపోయింది. – నాకుక్క ఆస్పత్రిలో వుంది. నా మనస్సు ఎంత వ్యథచెందిందో చెప్పలేను. ఇంగ్లీషు వాళ్ళవలె నేను మూఢనమ్మకంతో లేనుగాని, ఒక్కసారిగా త్రోవలో మూడుచావులు చూడడం నామనస్సును కలతపెట్టింది.

ఇంటికివస్తే భేలూ కులాసాగానే వున్నదని ఆస్పత్రినుంచి వుత్తరం వచ్చివుంది.

27 ఏప్రిల్ 1925.

గురువారం యింటికి తీసుకువచ్చాను. తర్వాత గురువారం వుదయం 5 గంటలకు భేలూ చనిపోయింది. నా యిరవైనాలుగు గంటల నేస్తం యికలేదు. ప్రపంచంలో యింతబాధ కలిగించే విషయాలుంటాయని అనుకోలేదు. అందుచేతనే నేమో నాకీ స్థితికలిగింది. చారూ! మరొక విషయం తెలుసుకున్నాను. ఈ ప్రపంచంలో objective ఏమీలేదు; వున్నదంతా subjective మాత్రమే. కాకపోతే కుక్కతప్ప మరేమీలేదా! భరతరాజు కథ ఎప్పుడూ అబద్ధంకాదు.

నీ శరత్

27మాఘం 1342.

ప్రియ చారుసోదరా!

ఈ మధ్య యింటికి వెళ్ళాను. పల్లెలోని మట్టి యిల్లు - రూపనారాయణనది ఈ రెండింటి మాయకు లోనై నేను పల్లెలో ఎక్కువకాలం వుండలేకపోయాను. వీటి మాయలన్నింటిని ఛేదించుకుని నేను విముక్తి పొందేరోజు దగ్గరపడుతోందా అనిపిస్తోంది. పాతస్నేహితులందరూ నాకంటెముందుగానే వెళ్ళిపోయారు. వారిని నే నెప్పుడూ స్మరించుకుంటూవుంటాను. ఈ మధ్యనే స్వర్గీయ విపినగుప్తశ్రాద్ధకర్మలకు పిలిచారు. శివపూర్ లో ఎన్ని సాయంత్రాలు వీరితో చర్చల్లో గడిపానో! నువ్వు పాతస్నేహితులలోనే లెక్క. కాని కనీసం నేను నీకంటే ముందుగానే చాలించుకుంటాననుకుంటాను. నిరంతరం గతవిషయాలే స్ఫురణకు వస్తున్నాయిగాని భవిష్యత్తువేపు దృష్టిపోవడమే లేదు. ఈమాటలన్నీ వదిలేద్దాం. వీటితో నీమనస్సును కష్టపెట్టడం అనవసరం.

నాకు గౌరవబిరుదు లివ్వాలని నువ్వు సూచిస్తూవ్రాసిన వుత్తరాలు రెండూ అందాయి. నాకు సన్మానం చేయాలని అనుకున్న వారి ప్రేమాభిమానాలే నాకు పెద్దసన్మానం. ఇది తలచుకుంటే కడుపునిండిపోతోంది.

ఢక్కాకు రాగలిగితే నువ్వు ఆహ్వానించకపోయినా నీ వద్దనే మకాం వేస్తాను. నీభార్యకు నా గౌరవపూర్వక నమస్కారాలు అందజేసి ఆమె ఆహ్వానాన్ని అగౌరవపరచవని చెప్పు.

నీ శరత్.

శ్రీ హేమేంద్రకుమార్ రాయ్‌కి వ్రాసినది.

14 లోయర్ ఫజున్ డావుంగ్ స్ట్రీట్,

రంగూను, 20-3-14

ప్రియ హేమేంద్రబాబూ,

ఈమధ్య చాలారోజులు రంగూనులో లేను. తిరిగి రాగానే మీఉత్తరం చూచాను. యింతకుముందే దానికి సమాధానం యిచ్చివుంటే బాగుండేది. కాని అప్పుడు నా ఆరోగ్యం బొత్తిగా బాగుండక ఒకదానికి మరొకటి వ్రాస్తానేమో ననే భయంతో వ్రాయలేదు. మరేమీ అనుకోకండి. అనారోగ్యంవల్ల సాధారణంగా మామూలుమర్యాదలనుకూడా పాటించడం నాకు కష్టమైపోతోంది. అయితే నేను ముసలివాణ్ణి కనుక క్షమార్హుడను.

'చరిత్రహీనులు' వచ్చేసంవత్సరంమధ్యలో పూర్తి కావచ్చు. పూర్తిఅయ్యేవరకు సామాన్యపాఠకులు దాన్ని గురించి ఏమనుకుంటారోనని ఆలోచించలేను. నారచనలయెడల మీశ్రద్ధచూచి నేను చాలా సంతోషిస్తున్నాను. చాలామంది శ్రద్ధగా చూస్తుంటారు కాని నారచనలు అతి సామాన్యమైనవి. వాటిల్లో ప్రత్యేకత ఏముంది కనుక? కాని ఆలోచించేదే వ్రాస్తూ వుండాలనిమాత్రం జాగ్రత్త వహిస్తాను. 'వీళ్ళేమంటున్నారు' వాళ్ళేమంటున్నారు అని నే నెప్పుడూ చూడను. బహుశా అందుచేతనే కొన్నిచోట్ల పాఠకులకు నా రచన బాగుంటుంది.-

మరికొన్ని చోట్ల సూచించదు. అయినప్పటికీ వారు రచయితలను పోల్చి అవమానించాలని అనుకోరు. మీ రచనలో ఒకప్రత్యేకత వుంది. నాకు బాగా నచ్చింది. కొన్నాళ్ళకిందట మీ సహకారాన్ని పొందడానికి ప్రయత్నించమని నేను ఫణికి వ్రాశాను. బెంగాలీభాష నాకు బాగా రాదేమో. నాకు వచ్చిన శబ్దాలు చాలాతక్కువ అందుచేతనే నా రచన సరళంగా వుంటుంది. కఠినంగా వ్రాయాలంటే అసంభవమౌతుంది. నా తెలివితక్కువతనంకూడా నాకు వుపయోగపడింది. సరే. 'భారత వర్ష' లో హరిద్వారం మొదలైన యాత్రావిషయాలు వ్రాసిన 'హేమేంద్రనాథరాయ్' మీరేనా? ఇది తెలుపండి.

తీరికవున్నప్పుడల్లా విశేషాలు వ్రాస్తూవుండండి. మీ వుత్తరం ఎక్కడపెట్టేనో గుర్తులేదు. అందుచేతనే ఈ వుత్తరం ఫణిఅడ్రసుకు పంపుతున్నాను. అన్నిసంగతులూ ఈవుత్తరంలో వ్రాయలేకపోయాను. చాలా బలహీనంగా వుంది. ఇవాళ మరియింతవరకే. ముందువుత్తరంలో యితరవిషయాలు వ్రాస్తాను. మీకు చాలాసంగతులు చెప్పాలనుకుంటున్నాను.

ఫణిని, యమునను కాస్తకనిపెట్టివుండండి. మీరు వారిని కనిపెట్టివుంటే నాకు సగం భారం తగ్గుతుంది. హృదయపూర్వకంగా చెబుతున్నాను. పైపైమాటలు చెప్పే అలవాటు నాకు లేదు. మీ సహకారాన్ని అపేక్షిస్తూ —

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

శ్రీ దిలీప్‌కుమార్ రాయ్‌కి వ్రాసినవి.

ఆషాఢం, 1335.

మంటూ,......వ్యాసాలు చదివాను. పిల్లవాడు వ్రాసినవి కావటంవల్ల ఇంకా వాటి మంచిచెడ్డలు విచారించేస్థితి రాలేదు... పిన్నవయస్సులో కథలు వ్రాయడం మంచిది, పాటలూ - పద్యాలు వ్రాయడం మరీమంచిది. అంతేగాని విమర్శలువ్రాయబూనడం చాలా అన్యాయం!... ఇంత త్వరపడి వ్రాయడాన్ని కొంచెం ఆపించు. వ్రాయడంలో తొందరపాటు పండితునికి తగునుగాని, రచయితకు తగదు... అమ్మాయి రచనలు చదివితే బుద్ధిమంతురాలుగా కనిపిస్తోంది. కాని జీవితంలో వయస్సుతోపాటు లభించేది అనుభవము. కేవలం పుస్తకాలు చదివే దాన్ని పొందలేరు అది పొందగలిగేవరకూ దానివిలువా తెలీదు. అయితే మరొక విషయంకూడా జ్ఞాపకముంచుకోవాలి. అనుభవము, దూరదర్శిత్వము, శక్తిని ఇచ్చేవేకాక, శక్తిని హరించేవికూడాను. కాబట్టి చిన్నవయస్సులోనే కొన్ని పనులు పూర్తిచేసుకోవాలి. వాటిలో కథలు వ్రాయడం ఒకటి. చిన్నతనంలో వ్రాయగలిగినదానికి మించి ఎక్కువగా పెద్దవారై వయస్సు వచ్చిన తర్వాత వ్రాయగల్గడం నే నెక్కడా చూడలేదు. వయస్సు పెరుగుతున్నకొద్దీ మనలో పెరిగే గాంభీర్యము,సంకోచము మనకి చాలా అడ్డుపడతాయి. మనిషిలో

రచయితేకాక విమర్శకుడుకూడా ఉంటాడు. వయస్సుతో పాటు విమర్శకుడు ఎదుగుతాడు. అందుచేత వయస్సు ముదురుతున్నకొద్దీ రచయిత ఏమైనా వ్రాద్దామనుకుంటే అడుగడుగునా విమర్శకుడు అతని చెయ్యి పట్టుకుంటాడు. అప్పుడు రచన విద్య – విజ్ఞానం దృష్ట్యా ఎంతగొప్పదైనా రసదృష్ట్యాచూస్తే మాత్రం వెనకబడుతుంది. కాబట్టి యౌవనావస్థ దాటి రససృష్టి చేద్దామనుకునేవారు పొరబడుతున్నారని నా అభిప్రాయం. వ్యక్తికి ఒక వయస్సు దాటినతర్వాత కావ్యాలు, నవలలు వ్రాయడం శోభించదు. అవకాశాన్ని అందుకోవడమే కర్తవ్యం. వ్యక్తికి దుఃఖాన్ని కలిగించే సమయం వృద్ధాప్యం. అందులో ఆనందం ఉన్నదని నటన చేయడం వ్యర్థం.

('స్వదేశబజార్' శరత్ సంచిక, 13 ఆశ్వయుజం 1335)

---

22 భాద్రపదం 1336.

మంటూ...... "సాధారణ ప్రజలను మనం విస్మరిస్తున్నాము. అందుచేత వసంతోత్సవ సభలో ఆవరణబయటి వారికి ఎండు మెతుకులు, పులుసు, మజ్జిగనీళ్ళుపోసి, గొప్పవారనబడే వారికొరకు మిఠాయిలు పిండివంటలు దాచి ఉంచుతున్నాము." అనే పూజ్య రవిబాబు వాక్యాన్ని ఉదహరించావు. విషయం వినడానికి బాగుంది. అంతేకాక అది వ్రాసిన వారి ఉదార స్వభావం, విశాలత్వం గోచరిస్తున్నాయి. కాని

వాస్తవంగా ఆలోచిస్తే ఇంత తప్పుడు విషయం మరొకటుండదు. విద్య, నాగరికత, సంస్కృతి వీటికి 'మిఠాయి' లే కావాలి. మంటూ! నిజంగా నాగరికుడైన సుకుమార సున్నిత హృదయం గల మనిషికి ఎండు మెతుకులు తినిపిస్తే కడుపునొప్పివచ్చి బాధ పడడూ ? ఇంక సాధారణ ప్రజలంటావా? రాత్రికిరాత్రి వాళ్ళకి పిండివంటకా లెలా తెచ్చిపెడతావు? అంతేకాక ఇవాళ వారు ఎండు మెతుకులమీదే బ్రతుకుతూ పెరుగుతున్నారనే సత్యా న్ని కాదనగలవా ? ఒక్క ఉదాహరణ. నలుగు రైదుగురు మామూలు ప్రజలు నీవంటివానిని ఆశ్రయించి రైల్లో అకస్మా త్తుగా రెండవ తరగతిలో ప్రయాణించడం ప్రారంభించారనుకో. మూడు - నాలుగు గంటలు ఆగిన తర్వాత ఆ పెట్టె చూస్తే ఎలాగుంటుంది. మట్టి బుట్టలనుంచి, బటానీలు, వేరుశనగ కాయలపొట్టు నీళ్ళు ఒక టేమిటి గలీజుగా ఉంటుంది. ఆదృశ్యాన్ని ఒకసారి చూచినవాడు మళ్ళా మరువగలడా ? ఇంతకీ అసలు ఉన్నత సౌధంలో కూర్చొని పంచభక్ష్య పరమాన్నాలు తిన డానికి ఒక యోగ్యతఉంటుంది. దాన్ని ఆర్జించవలసి యుంటుంది. ఈ విషయాన్ని నువ్వుకూడా కాదనవు దీన్ని ప్రపంచంలో పెద్దపెద్ద తాత్వికులందరూ అంగీకరించారు. లేకపోతే లోపలికి ద్వారం తెరచి ఉంచబడిందని, బయటఉన్న జనమంతా లోపల ప్రవేశిస్తే మనం బ్రతకగలమా ? అందుచేత ఇలాంటి ప్రమాద కరమైన అతి ఉదారత నెప్పుడూ ప్రదర్శించకు...

('అనామీ' చూడండి)

4 ఫాల్గుణం, 1339.

మంటూ, నీ క్రొత్తపత్రిక 'ఓరియంట్' నాకు పంపు సుమా. నీ వ్యాసాలు అచ్చైతే వాటిని చదవడానికి నే నెంతో కుతూహలపడుతున్నాను. సాహిత్యరంగంలో నువ్వు నాకు చాలా ఋణపడి ఉన్నట్లు వ్రాశావు. దేంట్లో అయినా కాక పోయినా సంయమంగురించి మాత్రం నావద్ద నేర్చుకున్నావు. ఋణపడడం సంగతి నాకు తెలీదు కాని వ్రాయడం మాత్రమే కష్టంకాదు, వ్రాయకుండా ఉండడంకూడా కష్టమని నీకు నేను ఇంతకుముందు చాలాసార్లు చెప్పాను. అంటే మనలోని ప్రతి శ్వాస, ఉద్రేకంకూడా వ్యర్థంగా పోకుండా, పాఠకులను పూర్తిగా సంతృప్తిపరచలేని సందర్భాలనువదిలి, వ్రాయకుండా వదిలిన వాటిలోనూ తమ భావ, బుద్ధి వికాసమునకు పాఠకు లకు వీలు ఏర్పరచాలి. నీ రచన వారికి సౌంజ్ఞ చేస్తుంది, దూరాన్నుంచిచూపుతుంది. అంతేగాని భారమంతా మొయ్యదు గదా. శ్రీ......గారు తన ఒక పుస్తకంలో మరణించిన పిల్లవాడి తల్లిదండ్రుల పక్షంనుంచి ఎంత అధికంగా అశ్రుధారలు ప్రవహింపజేశాడంటే, చివరకు పాఠకుడు చూస్తూ ఉండిపో యాడేగాని తాను కంట తడిపెట్టే అవకాశం పొందలేకపోయా డు. రచనలో వ్యవధి లేకపోవడం సాహిత్య గౌరవాన్ని నష్ట పరుస్తుంది. హాస్యరసికులైన... బాబు బాగా వ్రాస్తారు బాగా వ్రాయలేక పోవడం వారికి తెలియదు. వాస్తవంగా ఆయన

గొప్పరచయితే. కాని వ్రాయకుండా ఉండడం అనే సౌంజ్ఞని ఆయన సరిగా గుర్తించలేకపోయారు. వారి పుస్తకాల్లో స్త్రీ విషయం కనపడలేదూ? అలాంటి సంయమం లేకపోవడమే... రచనల్లో కనపడుతుంది. పిల్లవాడు బాగా వ్రాస్తాడు. విదేశాలు వెళ్ళివచ్చాడు. కాని ఆ వెళ్ళిరావడమే క్షణకాలమైనా మరు వలేదు. విదేశవిషయాలవల్ల అతని రచనల్లో చాలా అరుచి కరమైన సందర్భాలు హెచ్చై పాఠకుని మనస్సు కష్టపడుతుంది. నా మేనమామ సంగతి ఒకటి గుర్తుకు వస్తోంది. ఒకసారి వైష్ణ వోత్సవాలకు శ్రీ ఘూమ్ ఖేతురీ వెళ్ళాము. ఖేతురీ ప్రసాదం తింటే శూలనెప్పి తగ్గుతుందని మామయ్య నమ్మకం. స్టీమరు లోంచి గంగానదిఒడ్డున అడుగు పెడుతూనే ఆయన 'ఆఁ!' అన్నారు. భయార్తమైన ముఖంతో ఒకకాలు ఎత్తి ఉంచారు.

ఏం జరిగింది?

మరొక పెద్ద విపత్తిలో పడిపోయాను.

భక్తిలో లోపముంటే ఎక్కడైనా శూలనెప్పి తగ్గదేమో నని ఆయనభయం. నీ 'దోలా' వ్యవహారం కూడా విదేశీయం. ఒక రోజున చాలా అధ్యాయాలు చదివాను. అందులో వ్యర్థ మైన భక్తి విహ్వలత్వం, అనవసర వివరణలు లేవు. అవి చదివినమీదట ఇతనూ విదేశాలు వెళ్ళాడు, చాలా విషయాలు తెలిసినవాడు కాని చెప్పే ఆతురతలేదు అనిపిస్తుంది... ఎవ రైనా సవాల్ చేసి రచనలో ఆతురత చూపమంటే దానికి సమాధానంగా, ఇలాంటివి చూపుటకు వీలులేనివిరసిక పాఠకుల

మనస్సులే అనుభవపూర్వకంగా తెలుసుకుంటాయి అనవలసి వస్తుంది. శ్రీమతి... దేవి వ్రాసిన నవలలో వేదవేదాంతాలు, ఉపనిషత్తులు, పురాణాలు, కాళిదాసు, భవభూతి ఒకరేమిటి అందరూ దూరడానికి త్రొక్కిసలాడుకున్నారు. "చూడండి నే నెంత విదుషీమణినో, నే నెంత చదువుకున్నదానినో, నా కెంత తెలుసునో" అనే రచయిత్రి భావం ప్రతిపంక్తిలోనూ కన పడుతుంది. ఇలాంటి అతిశయాలకు చోటుండరాదు. జీవితం లోనూ సాహిత్యంలోనూకూడా ఉన్నతభావాలుఉన్నతతత్వాలు తీసుకునిసాగాలి. వర్షం కురిసింది, ఆకు కదిలింది; ఎర్రపువ్వు, నల్ల నీరు, తోటికోడళ్ళ తగాదాలు, వదినా మరదళ్ళ సరసాలు లేక ఇంట్లో ఎన్ని బీరువాలున్నాయి, ఎన్ని సోఫాలున్నాయి, ఎన్ని దీపాలున్నాయి, స్టాండుమీది చీరలాంటివి ఎన్నివున్నాయి— మొదలైనవాటిరోజులు గడిచిపోయాయి. వాటి ప్రయోజ నమూ అంతమైపోయింది. ఇదంతా వ్రాతపేర సాహిత్యాన్ని మోసపుచ్చడం. నీ రచనల్లో ఇవన్నీ ఉండవు. అందువల్లా, మరి కొన్ని కారణాలవల్లా నీ రచనలనుండి నే నెంతో ఆశిస్తాను. మంటూ! "రచయిత తన అంతరాళంలోనుంచి పుష్పంవలె విప్పి పెట్టినట్లు పాఠకునికి తోచినరచనే ఉత్తమమైనది" అని నువ్వన్న విషయం నిజం. బెంగాలులో అందరూ మన పుస్తకాలలోని నాయికా నాయకులకథ రచయిత స్వీయ జీవితమనీ, స్వీయగాథ అని అందరూ అనుకుంటున్నారని నువ్వే అన్నావు. అందుచేతనే సజ్జన సమాజంలో నాకు వెలి!

(అనామికా)

4 కార్తీకము - 1338.

మంటూ,

దేశోద్ధరణకొరకు సుభాసుదళంవారు నన్ను కొమిల్లా పంపారు. దారిలో ఒక పక్షంవారు 'షేం' 'షేం' అని అరిచారు. కిటికీకన్నాలలోనుంచి బొగ్గుమసి తలనిండా కొట్టి తమ ప్రేమను తెలిపితే మరొకదళం పన్నెండు గుర్రాల బగ్గీ మీద ఊరేగించి బొగ్గుమసి దేముంది - అదేమీలేదు-అదంతా మాయ అన్నారు. ఏది ఏమైనా నేను రూపనారాయణుని ఒడ్డుకు చేరాను. శ్రీ అరవిందుని 'విముక్త మానవుని'లో ఆశలేదు. The liberated man has no hopes. అనే సత్యాన్ని స్వీకరించుట కింక నే నేమీ వెతుకాడను. బొగ్గుమసికీజై ! పన్నెండు గుఱ్ఱాల బగ్గీకిజై ! 'శేష ప్రశ్న' చదివి సంతృప్తి చెంద్దావని తెలుసుకుని సంతోషించాను. 'బాగుచేస్తాను. గర్జించి అశ్లీలాలే వ్రాస్తాను' అనేది అతి నవ్యసాహిత్యానికి లక్ష్యం కాదని ఒక ఉదాహరణ చూపాను.

(అనామీ)

సామతాబేడ్; పి. ఓ. పానిత్రాస్,
హౌరాజిల్లా.
22, భాద్రపదం 1336.

మంటూరామ్,

నీ పుస్తకం, చిన్న ఉత్తరం అందాయి. నిన్నంతా చదివి పుస్తకం పూర్తిచేశాను. చాలా బాగుంది. ఒకటి రెండు లోపాలుకూడా ఉన్నాయి. భారతదేశంలోని గొప్ప వాయిద్య సంగీత ప్రవీణుల్లో నీ పేరు లేకపోవడంచూచి విచారించాను. కాని ఇది నీ యిచ్ఛాపూర్వకంగా జరిగిందను కొని ఏమైనా ముందు దిద్దుకోగలవని నమ్ముతున్నాను. మర్చి పోకు. రాయబహద్దూర్ మజుందార్ యొక్క 'రంగా జబా మూటో మూటో మూటో' గురించి ఎక్కడ వ్రాశావు? అది కూడా ఉండాలి. ఆయన బాధపడి ఉంటారని నే ననుకుంటాను. ఇంతవరకూ పుస్తకంలోని లోపాలు చెప్పాను. ఇక ఒక భేదాభి ప్రాయం ఉంది.

శరీరారోగ్యం బాగుండనందువల్ల నీ కన్సర్ట్‌లోనికి వెళ్ల లేకపోయాను. మరొక కారణ మేమంటే మేదినీపురంజిల్లాలో ప్రతిసంవత్సరం ఎక్కడో ఒక చోట వరదలు వస్తూనేఉంటాయి. రాకతప్పవు కూడాను. దీనికి ప్రభుత్వంకూడా ఏమీ చర్య తీసుకోలేదు. తీసుకోదుకూడా. ఈ వరదలు దేశంపై స్థిర మైన పన్నులాగ తయారైనాయి. ఇలా ప్రతి సంవత్సరం వరద బాధితులకు సహాయమనడంలో అర్థం ఏముంది? నీళ్ళు ఎక్కువ

నిలిచిపోయాయని ఒక్క పారమట్టి రైలుకట్టమీదనుంచి తవ్వితే ఊరుకుంటారా— పట్టుకుని ఖైదుకు పంపరూ! వరదబాధితు లందరికీ తిండి బట్ట ఇవ్వడం కలకత్తాలోని నాగరికుల కర్తవ్య మంటారు. ఎందుకయ్యా అంటే వాళ్ళ ఇళ్ళల్లోకి నీళ్ళువచ్చాయి. ఇంతేకాక పద్మలంకల్లో ప్రజలు గుంపులుగుంపులుగా ఎందు కుంటున్నారో తెలుసా ? వర్షాలకి వాళ్ళ యిళ్ళు కొట్టుకుపోతే పశ్చిమబెంగాలు ప్రజలు వారికి సహాయం చేస్తారని. కేవలం అందర్నీ చిక్కు పెట్టడానికే వాళ్ళు ఇలాంటి ప్రమాదకరస్థలా లలో నివసిస్తున్నారు. ఇదికాక వాళ్ళకి మరో ఉద్దేశ్యం లేదు. ఈ విషయంలో నీకు అభిప్రాయ భేదముండదని నాకు తెలుసు. నువ్వు బుద్ధిమంతుడివి. సత్యమైన విషయాలను ఒప్పుకుంటావు.

నువ్వు విదేశాలకు వెళుతున్నావని పత్రికల్లో చదివాను. నీ ప్రయాణం నిర్విఘ్నంగా సాగాలనీ, నీ లక్ష్యం ఫలించాలనీ ఆశీర్వదిస్తున్నాను. నేను పెద్దవాడనై పోయాను. అందుచేత నువ్వు తిరిగివచ్చాక మనం కలుసుకోలేకపోతే చివరివరకూ నేను నీ శుభాన్ని కోరుతూ ఉన్నాననుకో. నువ్వు క్షేమంగా ఉన్నావనుకుంటాను.

—శరచ్చంద్ర చటోపాధ్యాయ.

తాజాకలం:—

వచ్చే 31, భాద్రపదానికి 50 వ సంవత్సరం వస్తుంది. కార్తీకం మొదట్లోనే మిమ్మల్నందర్నీ కలుసుకోడానికి కలకత్తా వస్తాను.

సామతాబేడ్, పాణిత్రాస్, పి. ఓ.
హజారాజిల్లా.
6 ఫాల్గుణం 1333.

చిరంజీవి మంటూ,

నీ ఉత్తరం అందగానే నే నెంత సంతోషించానో నువ్వు ఊహించలేవు కూడాను. నువ్వు నన్ను గౌరవిస్తున్నావు; ప్రేమిస్తున్నావు. ఇదికూడా నేను తెలుసుకోలేకపోతే ఈ ప్రపంచంలో మరేమి తెలుసుకోగలనంటావు ?

నీకు వీడ్కోలు ఇవ్వడానికి చేరినవారందరూ ఏమేమి మాట్లాడారో విన్నాను. నువ్వు విదేశాలకు వెళుతున్నావు కాని త్వరగా తిరిగి రావాలిసుమా. నువ్వు దగ్గరగా ఉండడం లేదనే విషయం నన్నెప్పుడూ బాధిస్తూనే ఉంటుంది.

'మనేర్ పరశ్' చివరిభాగం అంటే మూడవభాగం నాకు ఎంత బాగా నచ్చిందో చెప్పశక్యంకాదు. నిజమైన బాధలు, దుఃఖాల్లో ప్రపంచంలోని ప్రజలందరు ఎంత ఆత్మీయులుగా ఉంటారో నీ పుస్తకం చివర ఎంతో సహజంగా చిత్రించబడింది. అందుచేతనే నాకు చదువుతూన్నంతసేపూ నువ్వు ఎవరిదో యదార్థ జీవితానికి చెందిన కథను లిపిబద్ధం చేస్తున్నావని అనిపించింది. అయితే దీన్ని లిపిబద్ధంచేసే కౌశలాన్ని మరికొంచెం ప్రయత్నించి బాగా నేర్చుకోవాలి. నీ తండ్రి గారిని నే నెరుగను. కాని మానవుని బాధలను, ఆవేదనను అర్థంచేసుకునే వారిశక్తి అద్వితీయమైనదని వారి సన్నిహిత

మిత్రులద్వారా విన్నాను. అదే నీకు వారసత్వంగా లభ్యి ఉం టుంది. దీన్ని నువ్వు రాత్రింబవళ్ళు నీ హృదయంలో పెంచి పెద్దదాన్ని చేయాలి. అప్పుడే ఇంకా గొప్పగా తయారౌతుంది.

సరే. నా ఉత్తరాల్లో ఏవికావాలంటే అవి ప్రచురిం చుకో, అనుమతిస్తున్నాను.

నువ్వంటే నాకెంతో ప్రేమ. ఇప్పుడేకాదు. చిన్నప్ప టినుంచీ నువ్వు నీ స్నేహితులతో వచ్చి అల్లరిచేసి పూరీలు తిని పోతూఉండేవాడివి, అప్పటినుంచీకూడా.

ఈ జీవితంలో నీకు జయం లభించాలని, నువ్వు దీర్ఘా యుష్మంతుడవు కావాలని, ఆరోగ్యంగా ఉండాలని హృదయ పూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను.

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

—...—

సామతాబేడ్, పాణిత్రాస్.

భాద్రపదం, 1335.

చిరంజీవి మంటూ,

నీ ఉత్తరానికి చాలా రోజులనుంచీకూడా జవాబు వ్రాయలేదు. నీకు చాలాకోపం వచ్చివుంటుంది. ఒకనాడు థియేటర్ రోడ్డుమీదవున్న మీయింటికి వెళ్ళాము. నువ్వూ లేవు, నీమామగారూ లేరు. అయ్యగారికోరకు నిరీక్షించడం సాంప్రి

డాయసిద్ధం అవునో కాదో నిర్ణయించుకోలేకపోయాను. నాతో వచ్చినవారు చాలా తెలివైనవారు. మధ్యవర్తికింద ఆయన చాలామంది దగ్గరకు వెళుతూ వుంటారు. నోరు తెరచుకొని కూర్చుంటే ప్రయోజనమేముంది, కార్డుయిచ్చి వెళ్తే మంచిది అన్నారు. కాని నాకు కార్డు యెక్కడిది? అంచేత మాట్లాడకుండా తిరిగివచ్చాము.

నిన్నరాత్రి మళ్ళా నీ 'దోథారా' ని ఎన్నోచోట్ల చదివాను. నిజంగా పుస్తకం చాలా బాగుంది. ఆషామాషీగా చదవడానికి వీలులేదు. శ్రద్ధగా చదువవదగినది. కాని ఈ రోజుల్లో ప్రశంసాపత్రాలకు విలువలేదని తెలుసుగదా. వాటి విలువ తెలిసినవారే వాటిని అగౌరవపరుస్తున్నారు. అందుచేతనే వెంటనే ఏమీ చెప్పడంలేదు. అయితే నామాటలమీద నమ్మకముండేవారితో మాత్రం, ఈ మంటూపుస్తకాన్ని మొదటి నుంచి చివరవరకూ శ్రద్ధగా చదవండి అని చెప్తున్నాను. నావృత్తే అదిగదా; అయినా నే నింతవరకూ ఊహించని విషయాలెన్నో అందులో యిమిడివున్నాయి.

'భారతవర్ష' (జ్యేష్టం 1335) లో నీ 'చాకర్' కథ చదివాను. కథలలెక్కలో యిది అంత గొప్పదికాదుగాని, నీలో ఒక విషయం ప్రత్యేకత పొందుతోందని తోచింది. అది సంభాషణలు. నీలో కథారచనా విధానం, సంభాషణల ప్రవాహం ఈ రెండూ సమమైన రోజున నువ్వు నిజంగా గొప్ప సాహిత్యకారుడవై పోతావు. కాని, మంటూ, ఒక విషయం మరువకు. రచనల్లో వ్రాస్తూపోవడం ఎంతకష్టమో వ్రాయ

కుండా ఊరుకోవడంకూడా అంతకష్టమే. ఇది ఎవరికీ నేర్పలేము. దీన్ని ఎవరికి వారు స్వయంగా నేర్చుకోవాలి. నువ్వు త్వరగానే నేర్చుకోగలవని నాకు తెలుసు. ఇవాళ నిన్ను హేళన చేసే వారే ఒకరోజున బహిరంగంగా కాకపోయినా, కనీసం మనస్సులో నైనా ఈ సత్యాన్ని ఒప్పుకుని తీరుతారు. నా నిర్గమన సమయం దగ్గరపడుతోంది. కాని తర్వాతకూడా చాలారోజుల వరకూ నన్ను నువ్వు మర్చిపోకపోతే నేను చెప్పే ఈ విషయాలు నీకు గుర్తుంటాయి.

'శరత్ చంద్ర - గాల్స్‌వర్దీ' అనే వ్యాసం చదివాను. గాల్స్‌వర్దీ పేరు విన్నానేగాని, ఆయన పుస్తకం ఒక్కటీ చదవలేదు. అందుచేత ఆయనకీ నాకూ ఎక్కడ సామ్యముందో, ఎక్కడలేదో నాకు తెలీదు. వ్యాసంలో నాప్రశంస, గాల్స్‌వర్దీవి ఎన్నో వాక్యాలు ఉన్నాయి. అందుచేత నా కేమీ అర్థం కాలేదు. అయితే ఆ... గాల్స్‌వర్దీ పుస్తకాలు చాలా చదివిందనీ, గాల్స్‌వర్దీ ఎవరైనప్పటికీ ఆయన చాలా మంచి విషయాలు చెప్పారనీ, అవి చదవడంవల్ల జ్ఞానం పెరుగుతుందనీ తెలుసుకోగలిగాను.

అమ్మాయిజీవితం సుఖంగా లేదని విని చాలా విచారపడుతున్నాను. ఈ సమాజంలో స్త్రీజన్మ తప్పించుకోడానికి వీలులేని శాపంగా తయారైంది.

ఒకసారి బెర్ట్రాండ్ రస్సెల్ ది 'యాన్ అవుట్‌లైన్ ఆఫ్ ఫిలాసఫీ' అనే పుస్తకం చదివాను. పుస్తకం చాలాకఠినంగా వుంది. గణితజ్ఞానంలేకపోతే పుస్తకంలోని చాలా భాగం తెలుసుకోవడం కష్టం. అలాగే నాకూ అర్థం కాలేదు. కాని వ్యక్తిలోని సరళత్వం, అంత గొప్పవ్యక్తి అంత తేలికగా వివరించుటకు చేసే ప్రయత్నాన్ని చూచి ముగ్ధులమైపోవలసివస్తోంది. జ్ఞానం తెలియని ప్రజలమొద అందులో ఎంతోకరుణ నిండి వుంది. ఓహో!— వీళ్ళు కొన్నివిషయాలైనా తెలుసుకోగలిగితే అని ప్రతిపంక్తి చదివినప్పుడూ అనిపిస్తుంది. నిజంగా పండితులు జ్ఞానులు అయిన వారి రచనలోనూ, గంతులువేసే వారి రచనలోనూ ఎంత తేడావుందో అనుకుంటాను. వారిది హెచ్. జి. వెల్స్ రచనలు ఒక దానిప్రక్క నొకటి పెట్టుకుచదివితే ఈ విషయం తెలుస్తుంది. పెద్దపెద్దవిషయాలు తేలికగా చెప్పడానికి ఎప్పుడూ ప్రయత్నిస్తూవుంటారు. రస్సెల్‌ది 'ఆన్ఎడ్యుకేషన్' కొన్నాను. రేపు చదవాలనుకుంటున్నాను. వచ్చేసంవత్సరం ఇంగ్లండు వెళ్ళగలిగితే ఒకసారి వారిని తప్పకుండా కలుసుకుంటాను.

ఒకరోజున చాలామంది పిల్లలు వచ్చారు. వారందరూ నీ 'మనేర్ పరశ్' ని చాలా ప్రశంసించారు. ఆపుస్తకంగురించి నేను చెప్పినదంతా యదార్థమని వారంటూవుంటే నాకు చాలా సంతోషం కలిగింది.

మామగారెలావున్నారు. ఇప్పుడు నువ్వు ఎక్కడుంటు న్నావో తెలీక ఈఉత్తరాన్ని మీమామగారి అడ్రెసుకి వ్రాస్తు న్నాను. నీకు అందగలదనుకుంటాను. నా స్నేహాశీర్వాదా లందుకో—

శరత్

ఆటోగ్రాఫ్ కాపీ నేనే స్వయంగా ఒకరోజున వచ్చి యిస్తాను. పోలేదు, వుంది అని యజమానురాలితో చెప్పు.

సామతాజేడ్; పి. ఓ. పాణిత్రాస్,

హౌరాజిల్లా.

13_6_1925.

మంటూ,

నువ్వు సాధువునైపోయి కూర్చోడానికి నీ మీద ఏమీ వారంటు లేదుగదా. చాలు, మరేమీ అక్కరలేదు ఈ వుత్తరం అందగానే వచ్చేసెయి. అంతగాకాదంటే కొన్ని రోజులుండి మళ్లావెళ్ళిపోదువుగాని. దీనివల్ల నష్టం ఏమీవుండదు. నేను అనుభవంగలవాణ్ణి; చెబుతున్నాను విను. నీవయస్సులో నేను నాలుగైదుసార్లు సన్యాసిగా తయారయ్యాను. ఆవేపు ఎక్కువదోమలున్నట్లులేవు. లేకపోతే హిందుస్తానీవాళ్ళవీపు మీది చర్మంతప్ప మరెవరిచర్మం సహించగలదు! తమ్ముడూ

ఇది బెంగాలీలు చెయ్యవలసిందికాదు. నామాట విను. తిరిగిరా. నువ్వు వస్తే ఈ మారు ఇద్దరం కలసి వుత్తర – దక్షిణదేశాలు రెండూ పర్యటిద్దాం. నువ్వు దగ్గరవుండకపోతే నా కంత మర్యాదావుండదు, తిండీతిప్పల యేర్పాట్లుకూడా సరిగావుండవు. ఈ ఉత్తరం అందగానే ఎప్పుడువస్తున్నదీ వ్రాయి. నేను స్టేష నుకు వస్తాను.

మరొక విషయం. వారీన్ ఏ చెట్టుఆకునైనా నీముక్కు మీద వ్రాసి నీకు కావలసిన పువ్వువాసన వచ్చేటట్లు చేయ గలడట. అతను ఈవిద్యను కర్త (శ్రీ అరవిందులు) నుండి నేర్చుకున్నాడని ఉపేన్ వంధ్యోపాధ్యాయ్ అన్నాడు. వచ్చే ముందు నువ్వది నేర్చుకుని రా. అతను నేర్పడానికి వెంటనే ఒప్పుకోడు. కాని నువ్వు వొదిలిపెట్టకు. కొన్నాళ్ళవరకూ వాళ్ళ అండమాన్ వంశాన్ని బాగాపొగడు. పుస్తకాన్ని ఎప్పుడూ దగ్గరవుంచుకొని యిన్నాళ్ళబట్టీ యింకా దీన్ని చదవలేక పోయాను అని మధ్యమధ్య అంటూవుండు. ఇలాచేస్తే నువ్వా 'విద్య' ని చేపట్టగలవనుకుంటాను. ఉత్తరదేశం తిరిగేటప్పుడు అది బాగా పనికివస్తుంది.

అనివరణ్ మట్టిని పంచదార చేస్తాడని విన్నాను. అది ఎక్కువసేపు వుండకపోయినా 5, 6 గంటలవరకూ దృష్టికీ – రుచికీ పంచదారవలెనే వుంటుందట. దీన్ని తప్పకుండా నేర్చుకు రావడానికి ప్రయత్నించు. అకస్మాత్తుగా డబ్బులయిపోతే పర దేశాల్లో – యాత్రల్లో – తెలిసిందా? తప్పకుండా నేర్చుకునిరా.

అనిలవరన్ చాలా మంచివాడు. నేర్పడంలో చికాకుపెడితే భూత - ప్రేతలకథలు చెప్పు. నిజంగా భూతాన్ని చూచానని ఒట్టువేసుకో. ఇంక దానితో నీపాచిక పారుతుంది. సులభంగా ఆ 'కౌశలం' నీకు చిక్కుతుంది, ఈ రెంటినీ నేర్చుకుంటే ఇంక అక్కడ కష్టపడుతూవుండనలసిన అవసరమేముంది?

చాలా రోజులైంది నిన్ను చూచి. నిన్ను చూడాలని నీపాట వినాలనేకోరిక ఎక్కువౌతోంది. ఎప్పుడు వస్తావో వ్రాయి. నా స్నేహాశీర్వాదాలందుకో—

—శరత్

తాజాకలం:—

'విద్య' లు నేర్చుకురా. సమయంకానిసమయాల్లో బాగా వుపయోగపడుతాయి. ఏమైనా త్వరగా రా. సాధువు అవడం చాలా చెడ్డది మంటూ! నామాట విను. ఈరోజుల్లో ఇందులో ఏమీ మజాలేదు. ఎప్పుడు వస్తావో సరిగా వ్రాయి.

సామతాబేడ్, పాని్రతాస్ పి. ఓ.
హజారాజిల్లా,
4 ఫాల్గుణం, 1337.

చిరంజీవి మంటూ,

నీ ఉత్తరం అందినది. "మీకు నేనంటే అయిష్టంగా ఉన్నట్లుంది" అని నువ్వు వ్రాశావు. అయిష్టత అర్థం విరక్తి అయితే కానేకాదు అంటాను. నిజానికి నువ్వంటే నా కెంతో ప్రేమ. అందువల్లే నా జీవితం సమాప్తమైపోతో న్నప్పుడు, ఈ జీవితంలో నిన్ను చూస్తానో లేదో అనిపించే టప్పుడు, నువ్వు భజనల సమాజంలో కలిశావంటే నిజంగానే నాకు కష్టంగావుంది. అందుచేత ఇవన్నీ అనవసరం. జీవితంలో ఎన్నో దుఃఖాలను సహించాను. వాటిల్లో ఇది ఒకటి.

నీ రచనలు చూస్తే నాకేమేమో ఆశలుంటాయి. కాని నువ్వు దీన్ని వదలివేశావే అని మనస్సులో చాలా బాధగా ఉంది. ఆశ్రమాల్లో ఉండి నువ్వు ఆపని చేయలేవు. జీవితంలో ప్రేమించకపోతే, కళంకాలు భరించకపోతే, దుఃఖాన్ని దిగమ్రిం గకపోతే, నిజమైన అనుభవాలను సంపాదించకపోతే, ఇతరుల నుండి తీసుకున్న అనుభవాలకల్పన ఎంతకాలం సాహిత్యవస్తువై ఉండగలుగుతుంది కనుక ? ముక్కు మూసుకుని ప్రాణాయామం చేస్తే మరేమైనా వస్తుందేమోగాని ఇది మాత్రం రాదు. తన జీవితం నీరసమై బెంగాలీ బాలవితంతువులా పవిత్రమై ఉంటే, ప్రారంభ జీవితంలోని ఉద్వేగంతో ఏమేమిచేసినా చివరకు బం

జరులాగ నిస్సారము, నిరుపయోగము అవుతుంది. నీ రచనల్లో కూడా అదే వచ్చేస్తుందేమోనని రానురాను భయం వేస్తోంది. రచయిత తన హృదయంలోనుంచి పూవువలె వికసింప జేస్తున్నట్లు పాఠకునకు తోచునట్లు చేయునదే ఉత్తమరచన. నా అన్ని పుస్తకాలలోని నాయికా నాయకులది- ఇది రచయిత స్వీయ జీవితమేనని ప్రజలు అనుకోవడం నువ్వు వినలేదా? అందుచేతనే సజ్జనుల సమాజంలో నాకు వెలి. ప్రజలనోట్లో ఎన్ని శృతులు ఉంటాయో! నా విషయం అలా ఉంచు. నీ గురించి ఆలోచిస్తే, మంటూ బారిష్టరైరాలేదు బాగానే ఉంది. పరవాలేదనుకున్నాను. కుప్పలాదిగా డబ్బు సంపాదించక పోతే, కార్లలో తిరగకపోతే, హై సర్కిల్సులో తిరగకపోతే ఏం! ఏమీలోటులేదు. ఉన్నదాంతోనే సాగిపోతుంది. కేవలం సాహిత్యం, సంగీతంద్వారానే నా మంటూ దేశానికి ఎంతైనా సేవ చేయగలడు అనుకున్నాను. ఆ నిరానందమే దేశానికి సంతోష భోజనం; అదే మాకు చాలు. నేను మరోసంగతికూడా అనుకునేవాడిని. మంటూ దేశదేశాలలో తిరుగుతున్నాడు. అనేక జాతులు, అనేక సంఘాలు, అనేక రకాల ప్రజలతో గౌరవాన్వితమైన, స్నేహపూర్వకమైన బెంగాలీ సంబంధాలు స్థాపిస్తాడు అది అందరికీ తెలుసు - అందరూ ప్రేమిస్తారు - మంటూతో వెళ్ళితే గౌరవానికి లోటుఉండదు, అనుకునేవాడిని. కాని ఆ ఆశ నిరాశ అయిపోయింది. శారీరికంగా, మానసికంగా, సాంఘికంగా ఏ విధమైన బంధనాలులేని స్వాతంత్ర్యాన్ని అనుభవించే వ్యక్తి నేడు కాలుకదపడానికి అనుమతి కావలసి వచ్చే

టట్లుగా బానిసత్వపు పట్టా వ్రాసియిచ్చాడు! ఇదే అతనిముక్తి సాధన! దేశంపోయింది, అతని ఊహాకల్పిత స్వార్థంమిగిలి అదే అతని సర్వస్వం అయిపోయింది. నేనూ చాలాచదివాను, చాలా చూచాను, చాలా చెప్పాను - చేశాను - దీన్ని నేనుకూడా మరువలేను. అందుచేత ఎవరేం చెప్పినా ఒప్పుకోవాలంటే అను మానం కలుగుతోంది. ఇప్పుడీ విషయంపై చర్చ అనవసరం. నా చిన్నప్పటి విషయం ఒకటి జ్ఞాపకంవస్తోంది. మామగారి తోటి సర్ గురుదాసుగారి ఇంటికి దసరాల్లో వెళ్లాను. వెళ్ళి చూస్తే సర్ గురుదాసుగారి నుదుటిమీద రక్తనాళాలన్నీ కోపం వల్ల ఉబ్బిఉన్నాయి. తెలిసినదేమంటే ఒక విద్యార్థి వచ్చి 'గంగాస్నానంచేస్తే పాపాలన్నీ పోతాయనే విషయంలో తనకు నమ్మకం లేదు' అన్నాడట. అప్పుడు గురుదాసుగారు విసుగెత్తి "స్నానం చెయ్యనక్కరలేదు, ఒడ్డున నుంచునే గంగ - గంగ అంటూ దర్శనం చేసుకుంటేనే అతనేకాక అతని ఏడుతరాల వరకూ పాపవిముక్తులై స్వర్గంలో ఉంటారు. ఇందులో అను మానానికి తావేలేదు. ఈ శాస్త్రవాక్యాన్ని కాదనే పాతకు డెవరు? అంటూ కోపంతో ఇంట్లోకి వెళ్లిపోయారట. నాకు బాగా గుర్తుంది. ఆ బాల్యంలోని నా గురుదాసేనా ఈయన? అనుకున్నాను. ఆ సమయంలో గణితంలో ఎం. ఏ.లో ఫస్టు; పెద్ద వకీలు, పెద్ద జడ్జి, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆయన. ఆయన పెద్ద నిష్ఠాపరుడు, సత్యవంతుడు. ఆయనేమీ మోసంచేయలేదు. తాను సత్యం అని నమ్మినదానికి గట్టిగా నిలబడ్డాడు. అందుచేతనే అంత కోపిష్ఠులైనారు. ఇలాంటి విష

యాలు తీసుకుని ఆలివర్ లాడ్జితోనూ చర్చించలేము. అలాగే మా ఆసామీతోగాని, పడవవానితోగాని చర్చించలేము. దీన్నే మూఢవిశ్వాసం అంటారు. దీన్నే అన్ని తర్కాలలోనుంచి, వాదనల పేచీల మధ్యనుంచి సత్యమంటారు. చదువు - సంధ్యలు ఉంటే మాటల్లో కాస్తరంగులు పూస్తారు. లేకపోతే సూటిగా సరళంగా చెబుతారు. ఇంతే తేడా. ఆయనే గురుదాస్! నీతో ఇవన్నీ చెప్పడానికి భయంవేస్తోంది. ఎందుకంటే ఆశ్రమవాసు లంతా కోపిష్టులని అందరికీ తెలుసు. వాళ్ళు మాటిమాటికీ తిట్లతో ప్రారంభించి కొట్లాటవరకూ సాగుతారు... నాకు ఆశ్రమం అంటే సదభిప్రాయం లేదు; కాని ప్రత్యేకంగా నాకు ఏ ఆశ్రమంమీదా కోపమూ లేదు. అన్నీ సమానమే నని నే నను కుంటాను.

ఆశ్రమ విషయాలు పోనీ...... అసలు కావలసింది నువ్వు. నిన్ను చాలా ప్రేమిస్తున్నాను. ఇది అబద్ధం కాదు. నిన్ను చూడాలని చాలా కోరికగా ఉంది. నీ పాటలు వినాలనీ, నీతో సరదాగా మాట్లాడాలనీ ఉంది. ముసలివాణ్ణి అయిపోయాను. ఇంక ఎన్నాళ్లు బ్రతుకుతాను కనుక? ఒకసారి ఇక్కడికి రావూ? నా స్నేహాశీర్వాదా లందుకో.

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

సామతాబేడ్, పాణిత్రాస్, పి. ఓ.
హజారాజిల్లా.
30 వైశాఖము 1333.

చిరంజీవి మంటూ,

'శేషప్రశ్న' చదివి సంతోషించావని తెలిసి నేను చాలా ఆనందించాను. ఎందుకంటే మీకు సంతోషించే అలవాటులేదు. ప్రవర్తకసంఘంవారు (చంద్రనగర్‌లోని ఒక సాంస్కృతిక సమాజం) ఈ సంవత్సరం అక్షయ తృతీయునిగా తిరిగి నన్ను పిలువలేదు. వాళ్ళు ఈ పుస్తకం చివర ఆశ్రమాన్ని కీర్తించమని కోరారు. కాని అది నా వల్ల కాలేదు. 'శేషప్రశ్న'లో అతినవ్యసాహిత్యం ఎలావుంటుందో సూచించాలని ప్రయత్నించాను. "బాగుచేస్తాను – గర్జించి అశ్లీలాలే వ్రాస్తాను" అనేది అతినవ్యసాహిత్య లక్షణం కాదు అని తెలుపుటకు ఇది ఒక ఉదాహరణ. కాని ముసలివాణ్ని అయ్యాను. నా శక్తి సామర్థ్యాలు పడమటికొండలకు చేరాయి. ఇక బాధ్యతంతా మీమీదే ఉంది. నీ రచనలన్నీ నేను చాలా శ్రద్ధగా చదువుతాను. నీ గురించి ఉత్తరంలో రవీంద్రులు వ్రాసింది నిజం. త్వరితగతిని అభివృద్ధికొచ్చే చిహ్నాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. అది బయటనుంచి ఎవరి దయవల్లనో కాదు. రక్తంతో వారసత్వంగా పొందిన నీలోని సత్యసాధనవల్లనే. పుదుచ్చేరిలో కాక కలకత్తాలో ఉన్నా సరిగ్గా ఇలాగే సంభవించవచ్చు.

మనం బుద్ధియుగపు సంతానమని అరవిందు లంటున్నారని నువ్వు వ్రాశావు. నిజమే. నీ రచనల్లో ఈ సత్యం రానురాను ఉజ్వలమౌతోంది. అయినా నువ్వు జాగ్రత్తగా ఉండవలసిన సమయం ఇప్పుడే వచ్చింది. సంభాషణలు చిన్నవిగాను, మధురంగానూ ఉండాలి. ఉపయోగంలేని అక్షరం ఒక్కటైనాఉందని ఏ పరిస్థితులలోనూ అనిపించకూడదు. ఆర్టిస్టిక్ ఫారంయొక్క అసలు రహస్యం ఇదే. తొలిసారి రచయితకు తాను అనుకున్నవన్నీ చెప్పలేకపోయాననే అనిపించవచ్చు. ఇక్కడే రచయిత అన్నిటినీ మించిన తప్పిదం చేస్తున్నాడు. పాఠకుడు అర్థంచేసుకోకపోతే పరవాలేదుగాని, ఇంకా ఎక్కువ అర్థం చేసుకోవాలి అనే గర్జన రచయితనుండి రాకూడదు. తెలిసిందా? అందుచేతనే కొంతమంది మంటూ రచనలలో మధ్య మధ్య తర్కవితర్కాలు ప్రబలరూపం ధరిస్తున్నాయని అంటున్నారు. చదువుతున్నది ఆలోచించి అర్థంచేసుకునేందుకు అవకాశం యివ్వకపోతే తన బుద్ధిప్రమాణాన్ని గుర్తించలేడు. అలాంటప్పుడు కోపంవస్తుంది. నేను సోమరిని. ఉత్తరాలు వ్రాయాలంటే జడుస్తాను. నువ్వు దగ్గరుంటే నీ రచనల్లోని ఇలాంటివాటిని చూపించేవాడిని. నీ రచనలు చదువుతూండగా ఎన్నోసార్లు మంటూ ఇక్కడిలా ముగించి ఉంటే ఎంత బాగుండేదో అనిపించింది.

నా వయస్సు అంత్యానికి వచ్చింది. రవీంద్రనాథులది కూడా అంతే. ఇంక మా తర్వాత బెంగాలీ నవలాసాహిత్యం దిగజారిపోతుందేమోనని అప్పుడప్పుడు అనిపిస్తుంది.

అలాంటప్పుడు నా కొక గొప్ప ఆశ ఉంటుంది మంటూ, ఎందుకంటే చెత్తనే సాహసమనుకుని పోటీపడి వ్రాసే వాడివి కాదు నువ్వు. నీ చదువు - సంస్కృతి వేరు.

నీ క్రొత్త గీతాలను జాగ్రత్తగా చదివాను. చాలా బాగున్నాయి. సరే ఇది చెప్పు. శ్రీ అరవిందులు బెంగాలీ చదువుతారా? 'శేషప్రశ్న' చదవమని ఇస్తే కుపితులౌతారా? ఇలాంటివి చదవడానికి వారికి సమయం ఉండదని తెలుసు. కాని చదవమంటే అవమానం అనుకుంటారా? ప్రవర్తకసంఘంవారు కోపం తెచ్చుకున్నారు. అందువల్లనే భయం వేస్తోంది. లేకపోతే వారిలాంటి పండితుల అభిప్రాయం తెలుసుకోవడానికి నా రచనా ప్రవాహం మరొకమార్గం వెతికేది. నవలద్వారా అనేక యితర విషయాలు వినటానికి మనిషిని బలవంతపెట్టడం జరుగుతుంది- ఈ విషయాన్ని అరవిందులు ఒప్పుకుంటారా? తేలిక సాహిత్యం అనేదానియెడల వారు విముఖులా?

షోడశి, రమ, హరిలక్ష్మి నీకు పంపుతాను. నా స్నేహాశీర్వాదా లందుకో.

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

సామతాబేడ్, పాణిత్రాస్, పి. ఓ.
హజారాజిల్లా.
6 భాద్రపదం. 1338.

చిరంజీవి మంటూ,

ఇంతవరకూ నీ ఉత్తరానికి జవాబివ్వలేదని నువ్వు పంపినవేమీ అసలు చదవలేదని అనుకోకు. శ్రీ అరవిందుని చిన్న చిన్న సందేశాలు, మీరుపంపిన ప్రశ్నలకు వారిచ్చిన సమాధానాలు ఇవన్నీ నువ్వు ఎంతో శ్రద్ధగా నాకు పంపావు. వాటిని నేను చదువుతున్నాను, వాటిమీద ఆలోచిస్తున్నాను; మళ్ళా చదువుతున్నా. అయితే చాలవరకు అర్థం చేసుకోలేకపోతున్నాను. అప్పుడప్పుడు వారు మానసిక చైతన్యంగురించి చెప్పే భిన్న భిన్న సూక్ష్మమైన ధారలు నా బుద్ధికి అందకుండా ఉన్నాయి. కవిత్వం విషయమైకూడా వారిభావాలు ఒప్పుకో లేకుండాఉన్నాను. ఉదాహరణకు చెప్పాలంటే, నీ కవితా సృష్టిలో వారు మంచివని చెప్పినవి నా దృష్టిలో మిగిలినవాటి కంటే నిమ్నస్థాయికి చెందుతాయి. వాస్తవంలో ఆ యితర కవితలే భాషలో - భావంలో - ఛందస్సులో బాగున్నాయి. వాటిని ఏరి వరుసక్రమంలో పెట్టాలంటే ఒకరి అభిప్రాయంతో మరొకరి అభిప్రాయం కలియదు. సరేకాని కొద్దిరోజులనుంచీ నువ్వు మనస్ఫూర్తిగా సాహిత్యసాధనలో మునిగిఉన్నట్లు కనపడుతోంది. ఇక నీ జయం నిశ్చయం.

నా జన్మదిన సందర్భంలో నువ్వు వ్రాసిపంపినగీతం కవిత్వం - హృదయం రెంటి దృష్ట్యా బాగున్నది. కాని అతిశ

యోక్తి దోషం తగిలింది. అందుచేతనే అనుమానంగా ఉంది. ఆ రోజున నళినీ సర్కార్‌కు (బెంగాలులో రాజకీయవేత్త - పార్లమెంటు సభ్యుడు) ఆ గీతం ఇచ్చి ఇది మీరు పాడితే మంటూ బాగుంటుం దన్నాడు అన్నాను. ఆయన స్వరలిపికోరకు నీకు వ్రాయవచ్చు. రేడియోవారు జన్మదినోత్సవ సందర్భంలో ఆ గీతాన్ని నీ పేరుతో ప్రసారంచేస్తామంటున్నారు. దాన్ని పాడేది నళిని. సరే. నా షోడశివర్గరా పుస్తకాలు నీకు హరిభాయి పంపారా? నేను ఉత్తరం వ్రాశాను.

నేను నీకు ఇంకా విషయాలు వ్రాయాలనుకున్నాను' కాని యింత సమయం లేదు. పోస్టు టైం అయిపోయింది.

నీ ఆ పాతఉత్తరాలు, కాగితాలు అన్నీ రేపో, ఎల్లుండో పంపుతాను.

ఇది విను – వెనకబడిన వర్గాలతరఫున 'పరిచయ్' అనే త్రైమాసపత్రిక వచ్చింది. అందులో నీ మిత్రులు నీ... (నీరేంద్రనాథరాయ్, బెంగాలీ విమర్శకుడు. వంగవాసి కళాశాల ఆంగ్లభాషాధ్యాపకులు) శేషప్రశ్న సమీక్ష వ్రాశారు. బహుశ నువ్వు చదివే ఉంటావు. దాని సారాంశ మేమంటే ఇది గోరా (రవీంద్రనాథ్ నవల) కొడుకట. అందుచేతనే 'కమల్' చరిత్ర గోరాకి నకలు తప్ప వేరుకాదట. అంటే కామెర్లరోగికి ప్రపంచమంతా పచ్చగా కనిపించినట్లు ఈయన కూడా కలంపడుతున్నాడు. స్వంతపత్రిక ఉందికనుక వ్రాసింది అచ్చవుతుందే అని విచారించవలసివస్తోంది. ఫ్రెంచి, జర్మన్

భాషలు వచ్చునని గర్వం. చివరికి అనుప్రాసలాగ — ఓ భగవంతుడా ! రూప నిర్మాతవికాళ ఉపకారం చెయ్యి—లాంటివి.

ఇంక ఒక క్షణంకూడా సమయం లేదు. ఆశీర్వాదాలందుకో.

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

సామతాబేడ్, ప్రాణిత్రాస్.
హవ్రా.
విజయదశమి, 4 కార్తీకం 1338.

మంటూ,

నా విజయదశమి ఆశీస్సులందుకో. చాలా రోజులనుంచీ ఉత్తరాలు వ్రాయలేదు. అందుకు పశ్చాత్తాప పడుతున్నాను.

ముందు అసలు విషయాలు పూర్తిచెయ్యనీ. "దోలా" (దిలీప్‌కుమార్ నవల) మొదటి పేజీలు కొన్ని దీనితో పంపుతున్నాను. నాగలి నడపబోయే ఈ ఆడంబరాన్ని చూచి 'ఆర్యా ! మీ బిచ్చంతో విసుగెత్తి పోయాను. మీ కుక్కను పిలుచుకోండి. నా మిగిలిన వ్రాత ప్రతి తిరిగి యివ్వండి' అని నువ్వు సమాధానం వ్రాస్తావేమో. నా వైపునుంచి కూడా దీనికేమీ వాదన సమాధానం లేదు అనుకోకు.

నీలాగానే నేనుకూడా ఆ కొన్ని నినాదాలను ఒప్పు కోను. కళ కళకొరకే, మతం మతంకొరకే, సత్యం సత్యం కొరకే మొదలైనవి. కళనుండి ఫలితం అందరికీ ఒకలాగేఉండదు, అది లోపలివస్తువు. ఒక సౌంజ్ఞని నిర్దేశించడం దానితర్వాత దానినే ఒక్క ఊపు ఊపడం మంచిదికాదు. ధర్మం, సత్యం మొదలైనవి శబ్దాలుమాత్రమేకాదు. అంతకంటే ప్రత్యేకవిశిష్టత ఉందని గుర్తుంచుకోవాలి. కథయొక్క ఉద్దేశ్యంకూడా మనో రంజకం అంటే అందులో మనస్సు - రంజింపబడుట అనే రెండు శబ్దాలు ఇమిడిఉన్నాయని ఒప్పుకోవాలి. డాక్టర్ జితేంద్ర మజుందార్ యం. డి., మంటూరామ్ ఇద్దరి మనస్సులూ ఒకటికాదు. ఒకరిమనస్సు ఒక విషయంవల్ల ఆనందంతో ఓల లాడితే అదేవిషయం మరొకరి మనస్సును కదల్చలేకపోవచ్చు కూడాను. బాగా చదువుకున్న ఒకాయన 'దోధారా'ను 10 - 15 పేజీలకంటె ఎక్కువ చదవలేకపోయారు. మరి నేను ఆ పుస్తకాన్ని ఎలా పూర్తిచేయగలిగానో అర్థంకాలేదు. కథారచనా నిబంధనలు అందులో ఎంతవరకూ ఉల్లంఘించ బడ్డాయో నాకు తెలియదు, తెలుసుకోవాలనే కోరికాలేదు. సంతోషించాను, సంతృప్తి కలిగింది, యిది ఒక తథ్యము, అయినా కళ అంటే ఏమిటి అని వాదిస్తే నా కదేమీ తెలీదు. అందుచేత ఊరుకుంటాను. అంతేకాని ఈ 56 సంవత్సరాల వయస్సుగల మనస్సు రాజీపడలేదు. అందుచేత ఎలాగో ఓలాగ నాగలి త్రిప్పడానికి కాదు నా మాటలు. నువ్వు చాలా ఆలో చించివ్రాసిన విషయాలు నవలారచనలో అక్కర్లేదని నేననను.

కాని, నా మనస్సులో నవల వ్రాయడమంటేగల అభిప్రాయాలప్రకారం 'స్వపన్' పాత్రపోషణగురించి ఆలోచిస్తే చివరి భాగాలతో మొదటిభాగాలంత సమంజసాన్ని కలిగిలేవని పిస్తోంది. ఇంతేకాక ప్రారంభంలో పుస్తకాన్ని కుదించాలి. ప్రారంభం చదవటంలో రుచిపోకుండా చూడడం ఒక నిపుణత్వం. మరొకవిషయంవుంది మంటూ. వ్రాయడానికి కూర్చుని వ్రాయడంకంటే అవసరమైనప్పుడు ఆపివేయడం చాలాకష్టం... వంద్యోపాధ్యాయ నిజంగా గొప్పరచయితే కాని ఎక్కడ ఏది వ్రాయకూడదో ఆయనకి తెలియదు. ఈవిషయం నువ్వు వారి పుస్తకాలలో చూడలేదా? నాకు వారి పుస్తకాలు చదువుతూ వుంటే యిదేఅనిపిస్తుంది. దీన్నే వ్రాతలో సంయమం అంటారు. ఆవేశం తొందరపాటులో చెప్పవలసినవిషయం ఒకఅడుగు వెనక వున్నా పరవాలేదుగాని, ఎప్పుడూ ముందువుండకూడదు. నీకు యింతగా తగ్గించడం యిష్టం లేకపోతే నీకుదగ్గరగావున్న సాహిత్యమిత్రులను అడిగిచూడు. అయితే యిప్పుడు తీసివేసిన అంశాలే పుస్తకం చివరికి వచ్చేసరికి మరొకచోట నేనే చేర్చ వచ్చునేమో. ఏమైనా నీ అభిప్రాయం తెలుసుకోవడం అవసరం. అప్పుడు దీన్ని సవరించడం ఎంతోసేపుపట్టదు.

నీ సీ ... వుత్తరాలు చాలా శ్రద్ధగా చదివాను. నే నంటే నీకు ఎంతో గౌరవం, ప్రేమాను. అందుచేతనే అవి నీకు చాలా బాధ కలిగించాయి. కాని దానివల్ల ఫలితం ఏమీ వుండదుగదా. వారికున్న కొండంతగర్వంలో పిసమెత్తైనా తగ్గు తుందని నాకునమ్మకంలేదు. ఇంక అలీ ... విషయమంటావా?

అతనెంతనీచుడో ఊహించలేముకూడాను. వాదవివాదాల్లో కూడా నాపేరు ప్రక్కన అతనిపేరు శోభిస్తుందా అని ఆలోచిస్తే నామనస్సుసిగ్గుతో కుంగిపోతోంది. దేశంపై పెద్దదెబ్బతీసి విదేశీ పాలకులకు తోడ్పడిన దేశీయుల లెక్కలోకివస్తాడు. ఇది కొంత కాలం ఆగితే నీకే తెలుస్తుంది.

త ... ని ఒకసారి త్వరగానే కలుసుకుంటాను. నువ్వు అతన్ని గురించి నాకు వ్రాశావని చెప్పను. కాని నువ్వు వ్రాసిన విషయాలను ఆధారంచేసుకుని మాట్లాడి నిజం తెలుసుకొనుటకు ప్రయత్నిస్తాను. త... ఏమిచెబుతాడో చూస్తాను. శ్రీ అరవిందులనుగురించి నేనెక్కడా ఏమీ అనలేదు. దేశంలో అందరూ ఆయన్ని గౌరవిస్తూవుంటే, నేనొక్కడినేనా గౌరవించకుండా వుండేది! కాని ఆశ్రమవాసులయెడ నాకు సదభిప్రాయం లేదు. త... చెప్పినవిషయాలు, ఇతర ఆశ్రమవాసులగురించి నాకు తెలిసిన విషయాలే ఇందుకు కారణాలు. తరాత నువ్వు వెళ్ళిపోవడం నాకు చాలా కష్టంగావుంది. నువ్వు ఐ. సి. యస్. చదువకుండా తిరిగివచ్చినపుడు చాలా కష్టమనిపించింది. కాని సంగీతాన్ని, సాహిత్యాన్ని అనుసరించినపుడు ఆ కష్టం కొంత తగ్గింది. అందరూ వుద్యోగాలు చేసి, బారిష్టర్లయి దేశభక్తులను జైలుకు ఎందుకు పంపాలి? అని అనుకున్నాను. మంటూాకు తిండితిప్పలకు లోటులేదు. అలాంటప్పుడు విదేశీయులదృష్టిలో దేశీయకళాసంపదకు గౌరవం తేగలిగితే, తన బుద్ధిద్వారా క్రొత్తమార్గాన్ని సృష్టిస్తే దానివల్ల దేశానికి లాభం వుండదా, గౌరవం రాదా? అనిపించింది. విదేశీయులవద్ద 'సింఫోనీ' అనేది

వుంటుందనీ అది చాలా గొప్పదనీ, దాన్ని దేశీయసంగీతంలో ప్రవేశపెట్టాలనీ నువ్వే ఒకసారి అన్నావు. ఆ తర్వాత అకస్మాత్తుగా నువ్వు అన్నీవదలి విరాగివై వెళ్ళిపోయావని విన్నాను. అప్పుడు నాకు ఏదో పెద్ద నష్టం వాటిల్లినట్లనిపించింది. ఈజీవితంలో నిన్ను మళ్ళీచూడలేనేమోననేది కాస్త దుఃఖమంటావా? మరెవరు నమ్మినా నమ్మకపోయినా నాకీ దుఃఖం కలకాలం వుంటుందని నీకు తెలుసుననుకుంటాను.

ఒక చిత్రమైనసంగతి విను మంటూ. ఒకరోజున పని మీద బ్యాంకుకు వెళ్లాను. అక్కడ క్యాషియరు బెంగాలీఆయన. ఆయన పెద్దజ్యోతిష్కుడని విన్నాను. చాలా శ్రద్ధగాను, త్వరగాను ఆయన నా పని పూర్తిచేసి నా జాతకచక్రం అడిగారు. జాతకం లేదుగాని, నా నోటుబుక్కులో రాసివుంది అన్నాను. దాన్ని ఆయన వెంటనే వ్రాసుకుని, నా చేతిలోని రేఖలు చూచి ఏదోలెక్కలు వేశారు. ఏం చెప్పారో తెలుసా? ఒక సంవత్సరంలో 'మీరు మరొకదారి తొక్కుతారు' అన్నారు. మరోదారి అంటే అని అడిగాను. ఆధ్యాత్మికమార్గం అన్నారు. జాతకంలో అలావుందని కాశీలోని పండితులూ అన్నారు. కాని నాకు దానిమీద ఆవగింజంతైనా నమ్మకం లేదు. నాకు ఆధ్యాత్మికంలోని 'అ, ఆ' లు కూడా రావు అన్నాను. ఒక సంవత్సరం తర్వాత మళ్లీకలిస్తే అప్పుడు సమాధానమిస్తానన్నారు. సంవత్సరం తర్వాతకూడా నానోట మీరు ఇదే వింటారు అన్నాను. ఆయన తలూపారు. జాతకచక్రం లెక్కలు వేస్తే ఇక అది తప్పుకారాదని ఆయన విశ్వాసం.

మరొకటి ఒక సంగతి: నువ్వు ఇంతకు ముందే విని ఉంటావు. నా వంశానికి ఒక చరిత్రఉంది. మా ఈ వంశంలో నా రెండో అన్నగారు (ప్రభాస్) స్వర్గీయ స్వామీ వేదానంద నుండి వరుసగా 8 తరాలవరకు సాధువులవుతూ వస్తున్నారు. నేనే ఘోరనాస్తికుడనుగా తయారయ్యాను. వంశానుగత ఆనువాయితీ నా రక్తంలో ఎదురు తిరిగింది. అందుచేత జీవితంలో 55 సంవత్సరాలు దాటినతర్వాత క్రొత్తశిష్యులను సంపాదించగలమనే ఆశ కూడదు. కాని ఆ క్యాపిటయరుకి నేను బైరాగి నవుతాననే గట్టి నమ్మకం!

నీ అనిలవరన్ మట్టిని పంచదార చేస్తాడని విన్నాను. ఆశ్రమానికి కావలసిన పంచదార అంతా అతనే సప్లయి చేస్తాడట. నిజమేనా? నాకు నమ్మకంలేదు. ఎందుకంటే అంత శక్తిఉన్నవాడు ఆశ్రమంలో ఎందుకుంటాడు? కలకత్తావచ్చి తేలికగా ఒకపంచదార దుకాణం పెట్టేసేవాడు.

బారీన్‌ని తరచు కలుసుకోవడం జరుగుతోంది. అతనింక ఆశ్రమానికి ఎప్పుడూ వెళ్ళనంటున్నాడు. అక్కడుండే కఠిన నియమాలమధ్య అతనిఆత్మ పంజరాన్ని వదలిపోనందుకు సంతోషించాలి. మీ 'మదర్' అంటేమాత్రం అతనికి చాలా భక్తి. అలాంటి అద్భుతవ్యక్తిని ఎక్కడా చూడలేమని అంటాడు. ఆమె సూక్ష్మదృష్టి అద్భుతమైన దంటాడు. విపరీతమైన కార్యశక్తి, క్రమశిక్షణతోపాటు ఆమెకు అంత సూక్ష్మబుద్ధికూడా ఉంది అంటాడు. ప్రతివ్యక్తికి సంబంధించిన ప్రతి

విషయం ఆమె దృష్టిలోపడితీరుతుందనీ, వారి ఆదేశాలు ఉప దేశాలుకాక మరేమీ అమలు జరగడానికి వీలులేదనీ, అందు చేత బయటనుంచి ఒక్కసారిగా అక్కడికి వెళ్ళినవారు రక రకాల అభిప్రాయాలతో తిరిగిరావడం జరుగుతూఉంటుం దనీ...అన్నాడు.

'దోలా'లోని కొట్టివేతలు అర్థంచేసుకుంటూ చదువు. ఒక్కసారిగా కోపం తెచ్చుకోకు. నే నిప్పుడు కొట్టివేసినవన్నీ అవసరమైతే చివర నేనే కలుపుతాను. ఏమైనా ఈ విష యంలో నువ్వు ఏమైనా చెప్పదలచుకుంటే నాకు కాదు రవీంద్రనాథ్ కే. మరొకసారి నా విజయదశమి స్నేహాశీస్సు లందుకో.

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

తాజాకలం:—

• అనిలవరన్ పంచదార తయారుచేసే విషయంగురించి తప్పకుండా వ్రాయి. పంచదార నిజంగా తయారు చేయగలిగితే మనం జావా పంచదారను ఆపివేసుకోవచ్చు. ఇది పెద్ద దేశ సేవ కాగలుగుతుంది.

సామతాబేడ్; పానిత్రాస్, పి. ఓ.
10 చైత్రము, 1339.

చిరంజీవి మంటూ,

నేను సోమరిని కాదు. ఈ మారు నిజంగా తప్పీలు ఇచ్చుకుంటున్నాను. రెండు సంవత్సరాల క్రిందట రైలులో తలుపుకి నా మోకాలు తగిలి పుండు అయింది. దానితో ఏదో అలాగే యింతకాలం యీడ్చుకొస్తున్నాను. కాని నెలా పదిహేను రోజులనుంచీ మంచం పట్టాను. నిజంగా మంచం మీదనుంచి లేవడం లేదు. ఎక్సు-రే తీయించుకోడానికి రేపు కలకత్తా వెళుతున్నాను. రవీంద్రజయంతి అనంతరం నెలా పదిహేను రోజులు అసలు రాత్రిళ్లు నిద్రేపట్టలేదు. రాత్రిం బవళ్ళు ఒకటే మేకులు గ్రుచ్చుకున్నట్లు బాధగా ఉంటోంది. బాగుపడతానో లేదో నమ్మకం లేదు. పోనీ అవన్నీ, తిరిగి లేవ లేకపోయినా ఒక విధంగా బాగానే ఉంటుంది. నా అంతిమ యాత్ర సమీపంలోనే ఉన్నట్లనిపిస్తోంది. నీకు ఉత్తరం వ్రాయ డం లేదన్న మాటేగాని నువ్వు పంపుతున్నవన్నీ చాలా శ్రద్ధగా చదువుతున్నాను. ఒక్కొక్కప్పుడు ప్రేరణ ఉంటుంది, మరొక ప్పుడు ఉండదు. కాని నీలోపల ఆశ, విశ్వాసం, నిష్ఠ, గంభీర త్వం ఇవన్నీ నాకెంతో బాగా కనిపిస్తున్నాయి. ఇంత బాగా కనిపించడానికి కారణం కూడా తెలీదు.

నీ "జలాంత్ - కే - ప్రేమబీజ్" ప్రహసనం చదివాను. కలకత్తానుంచి తిరిగిరాగానే త్రిప్పి పంపుతాను. బాగా సాగింది. కాని దాని జీవితం తక్కువ. అందుచేత రచననికూడా చిన్నదిచేస్తే మంచిది. చిన్నదైతేనే రసం బిగిగా ఉంటుంది. ఇది నువ్వు ఒప్పుకోవాలి.

'శిశిర్' 'భాదుడీ'ని అభినయిస్తారనే దానిపై నమ్మకం పెట్టుకోకు. తిరిగివచ్చి అన్నిసంగతులూ వ్రాస్తాను. పడుకుని ఉంటే కలం సాగడంలేదు.

శ్రేయోభిలాషి,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

ది 5 జ్యేష్ఠము 1340.

చిరంజీవి మంటూ,

చాలా రోజులనుంచీ నీకు ఉత్తరం వ్రాయాలనుకుంటున్నాను గాని వ్రాయలేకపోయాను. ఇవాళ కలం చేతబట్టాను. ఏదో కొంత వ్రాస్తాను.

...'అఃరయా' వాటి సంబంధంలో 'శ్రీకాంత్' ఐదవ అధ్యాయాన్ని పూర్తిచేస్తాను. నాలుగవ అధ్యాయం బాగుండలేదని మీారందరూ అంటే రథం యింతటితో ఆగిపోతుంది.

కాని ఈ సందర్భంలో నా తరఫువాదనకూండాఉంది. సాధారణమైన, సమాజసంఘటనతో ఈ అధ్యాయాన్ని ముగిస్తాను. దానివల్ల సాహిత్య సంయమంతో కొద్దిమాటలతో అన్నిదిశలనుండీ ఎంత రససృష్టి చేయగలనో పరీక్షిస్తాను. లక్ష్యము, సాధనముల ఆధిక్యతతో కాక, అసాధారణ సంఘటనలవల్లనూ కాక, అతి సాధారణ గ్రామీణ సంఘటనలతో ఈ పుస్తకం పూర్తిఅవుతుంది. విస్తృతంకాక గంభీరంగా ఉంటుంది. పుంఖానుపుంఖ వివరణకాక, సూచనప్రాయంగా ఉంటుంది. రసికుల ఆనందంకొరకే ఇది. ఎక్కడనుంచి ఎంతవరకూ జరిగిందో తెలీదు. కాని నవలాసాహిత్యాన్ని గురించి నాకు తెలిసినంతవరకూ ఏమిబాగున్నా బాగుండకపోయినా, కనీసం సంయమంగాఉండి, విశృంఖలత్వం కనపడనీయను. నీ అభిప్రాయంకూడా తెలుపు.

మరొక విషయం. ఆ ఆశ్రమంలోనికి వెళ్ళినతర్వాత నీ అధ్యయనం విశాలంగా, దూరదర్శికంగాను మారినట్లే అంతర్ముఖంగాను గంభీరంగాను సాగుతున్నదని నేను గుర్తించాను. ఎందుకంటే నీ పాండిత్యం, జ్ఞానం అంతశాంతమైనవి, వినయపూర్వకమైనవీను. నీమీద ఎన్ని దెబ్బలుపడ్డా నువ్వుమాత్రం ఇతరులమీద నీపాండిత్యపు లాఠీని ప్రయోగించలేదు. ఈ విషయంలో నువ్వు పరీక్షింపబడుతున్నకొద్దీ రాటుదేలుతున్నావు. నా జాతికి చెందు

తున్నావని చాలా ముగ్ధుడనై పోతున్నాను. సామర్థ్యం ఉండి కూడా ఊరుకోవడం, సహించడం చాలా గొప్పవిశేషం. అంతే కాని నోరు చెడగొట్టుకుని ఇతరులను అవమానించడానికి, వారి మీద దాడిచెయ్యడానికి ముందుకురాకు. నీకేమీ భయం లేదు; మిత్రులనుగురించి చింతాలేదు, మంటూ! సాహిత్య సేవకులైకూడా స్వీయమిత్రులను తిడుతూ తిరస్కరించే వారంటే నాకు చాలా భయం. ఇతరులను అవమానించినంత మాత్రాన్నే తమ గొప్పతనం స్పష్టంకాదని తెలుసుకోలేక పోతున్నారు. దానికి ఇంకా యితరత్రా జ్ఞానం కావాలి. అది అంత తేలికైన పనికాదు.

'పుష్పపాత్ర' పత్రికలో నీ రచన చదివాను. అందులో ఎన్నో యితర విషయాలతోపాటు నువ్వు బూ......యొక్క స్త్రీ విద్వేషాన్ని ఎదిరించావు; దానికి కారణాన్ని కనిపెట్టావు. అతనంటే నీకు ప్రేమ. మీ స్నేహంలో అడ్డు తగులుతా ఫేమోనని నాకు భయంగా ఉంది. నీవు చాలా ఆంతరంగిక విషయాలు తెలుసుకోవాలి. సాహిత్య సృష్టియొక్క అంతరాళంలో ఉండే స్రష్ట చిన్నవాడౌతున్నకొద్దీ సృష్టిలో సంకుచిత తత్వం వస్తుందని ఎవరో వ్రాశారు. ఈ విషయాన్ని నేనూ నమ్ముతాను. సావిత్రివంటి హోస్టలు పనిమనిషి దొరికితే నేను హోస్టలులోనే పడిఉంటాను అని బూ... వ్రాశాడు. కాని హోస్టలులో పడిఉంటేనే చాలదు— సతీష్‌గాకూడా తయారు కావాలి. లేకపోతే జీవితమంతా హోస్టలులోనే గడిపినా సావిత్రి హృదయాన్ని జయించలేడు. అంతేకాక సావిత్రి నిజంగా పని

మనిషిజాతికిచెందినది కాదని అతని నమ్మకం. లక్ష్మీదేవికూడా ఒకసారి కష్టాల్లోపడి బ్రాహ్మణుని యింట దాసీపనిచేసినదని పురాణాల్లో వ్రాసిఉంది. పంచపాండవులలో అర్జునుడు ఉత్తరకు నృత్యం, గానం నేర్పినప్పుడు వారి సంభాషణలు విని ఇలాంటి గురువుదొరికితే ఆడపిల్లలందరూ నృత్యం-గానం నేర్చుకోవడానికి పిచ్చివాళ్ళైపోతారని చెప్పలేము. అన్ని సాంప్రదాయాలలో వలెనే వేశ్యల్లోకూడా నిమ్నోన్నతాలుంటాయి. వేశ్యవద్ద పనిమనిషిగాఉండే వేశ్యయొక్క-నడత ఆమె యజమానురాలి నడత ఒక్కలాగే ఉండకపోవచ్చు. దీన్ని గురించి అనుభవం సంపాదించుటకు రూపాయి — అర్ధ ఖర్చుతోనే సరిపెట్టుకోవచ్చు. కాని లోతుగా తెలుసుకోవాలంటే చాలా ఖర్చు చేయవలసి ఉంటుంది. తేలికగా కాదు. రంగుపూసుకుని వాళ్ళందరూ వీధి అరుగులమీద కూర్చొరు. నువ్వు మధుర భాషిణి సుశీలాబాయిని (రాజ్యలక్ష్మి) గురించి వ్రాశావు. ఆమెను అందరూ చూడగలరా? దానికి అనేక ప్రయత్నాలు లేకపోతే పనికాదు. తన డబ్బుగాని లేక ఏ రైనా రాజకుమారుని ధనంగాని విరివిగా ఖర్చు కాకపోతే పైఅంతస్తులకు ప్రవేశాధికారమే లభించదు. లేకపోతే రోడ్డుమీద చెయ్యిపుచ్చుకుని ఏ కూలిపోతున్న పెంకుటింట్లోకో లాక్కుపోయేవారి పరిచయంమాత్రమే లభిస్తుంది. బీదవారి అనుభవం ఇలాంటి నిమ్నస్థాయివారితోనే పరిమితమై ఉంటుంది. అందుచేత అతను శ్రీకాంతలోని టగర్ బాడీవాలీని మాత్రమే గుర్తిస్తున్నాడు. ఈ ఉదాహరణలన్నీ అనవసరం. వ్రాయడానికి సిగ్గు

కూడా వేస్తోంది. కాని గ్రుడ్డిగా స్త్రీజాతిని ఎదిరించడమే యదార్థవాదం అనుకునేవారిలో ఆదర్శవాదం అసలేలేదు సరిగదా యదార్థవాదం కూడాలేదు. ఉన్నదల్లా నటన, పోటీ - తెలియని అహంకారం. స్త్రీలకు వ్యతిరేకంగా తగాదాలు పెంచాలనే ఆవేశంలో ఎప్పుడు సాహిత్యసృష్టి కాదు...

నా హృదయపూర్వక స్నేహాన్ని, శుభచింతనను అందుకో. సాహనా కలిస్తే నా ఆశీస్సు లందజేయి.

శరత్ బాబు.

—•••—

సామతాబేడ్, పాణిత్రాస్,

హజారాజిల్లా.

10 భాద్రపదం. 1340.

చిరంజీవి మంటూ,

నీ ఉత్తరం అందింది. శ్రీకాంత నాల్గవ అధ్యాయంపై నువ్వు వ్రాసిపంపిన వ్యాసం ఇంతకుముందే అందింది. మొదట్లో వ్యాసం పెద్దదైనదని కోతఅవసరమనీ అనుకున్నాను. కాని రెండుమూడుసార్లు చదివిన తర్వాత ఈ వ్యాసంలో తగ్గించవలసినదేమీ లేదనిపించింది. నా పుస్తకాన్ని గురించి వ్రాశావు కనుక నా కది నచ్చిందాలేదా అని నా మనస్సులో అనుకుణం ప్రశ్న ఉదయించింది. ఎంతో ఆలోచించిన తర్వాత

నువ్వు ఈ వ్యాసం మరే పుస్తకాన్ని గురించి వ్రాసినాకూడా నా కింత బాగానూ ఉంటుందని చెప్పడానికి సంకోచం లేదు. దీనికి కారణం ముఖ్యంగా శ్రీకాంత్ విషయాలే. కాని సాహిత్య భావాలను నువ్వు ఎంతో సహృదయతతోనూ, మధురంగానూ విమర్శించావు. ఈ విమర్శ నిజంగా అందంగా ఉండడమేకాక నిష్పాక్షికంగాకూడా ఉంది. అందుచేత సహృదయ పాఠకు లెవరైనా నిస్సంకోచంగా స్వీకరిస్తారు. అంతేకాక సంభాషణల శైలిలో విమర్శనడిపావు. మంటూ, నువ్వు చాలా మంచి విధానం కనిపెట్టావు. ఈ పద్ధతిలో కాకపోతే అంత పెద్ద వ్యాసాన్ని చదవడానికి అందరికీ ఓపికఉండదు. చదువుతూఉంటే ఒక మంచికథలాగా ఉంటుంది. దీన్ని ఏదైనా మాసపత్రికలో ప్రచురణకు పంపుతూ ఏ మాత్రమూ తగ్గించవద్దని కోరుతాను. కాని నీకు ప్రూఫ్‌లు పంపుటకు వీలుంటుందో ఉండదో చెప్ప లేను. వీలుంటేమాత్రం పంపుతాను.

శ్రీకాంత్ నాల్గవ అధ్యాయం నీకంత బాగుందనిపిం చిందంటే నా కెంత సంతోషంగా ఉందో చెప్పలేను. ఎందు కంటే ఈ పుస్తకాన్ని నేను నా హృదయమంతాపెట్టి సహృ దయ పాఠకులకు బాగుండడంకొరకే ప్రయత్నించి వ్రాశాను. శ్రీకాంత్ అదృష్టంవల్ల నీవంటి పాఠకుడు దొరికినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. ఇక మరొక పాఠకుడు దొరక్క పోయినా చింతలేదు. ఎన్నో భాషలలోని ఎన్నో పుస్తకాలు

నువ్వు చదువుతూంటావు. వాటిమధ్య నావంటి మూర్ఖుని పుస్త కం చదువుటకు నీకు తీరిక దొరికినదంటే ఆశ్చర్యమే. నేనెంత సామాన్య రచయితనో నాకు తెలుసు. నాకు చదువూలేదు. పాండిత్యమూ లేదు. పల్లెటూరివాడిని. ఏదితోస్తే అది వ్రాసే స్తాను. అందువల్లనే ఈ యుగంలో ప్రొఫెసర్లు నామీద దాడి చేస్తే భయంతో మాట్లాడక ఊరుకుంటాను. వాళ్ళందరిముందూ నే నెంత అల్పుడనా, సామాన్యుడనా అనుకుంటాను. కాని మధ్యమధ్య నీవంటి మిత్రుని ప్రశంస వినబడితే, గర్వంతో పాటు మంటూ వీళ్ళకేమీ తీసిపోడు అనుకుంటాను. అయినప్పటికీ వారికీ నచ్చిందిగదా. ఇది నాకు పెద్దఅండ, పెద్ద ఓదార్పు.

చాలాకాలంనుంచీ నిన్ను చూడలేదు. చూడాలని చాలా కోరికగా ఉంది. దసరాకు వుదుచ్చేరినస్తే రెండు, మూడు రోజులు ఉండడానికి ఏర్పాటు చేయగలవా? ఆశ్ర మంలో ఉండడానికి వీలులేదని నాకు తెలుసు. అక్కడేమీ హోటల్ లేదూ? ఉంటేవ్రాయి.

నీ నిత్య శ్రేయోభిలాషి,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

సామతాబేడ్, పాణిత్రాస్,
హజారాజిల్లా.
29 మాఘము 1340.

చిరంజీవి మంటూ,

చాలా రోజులైంది నీకు ఉత్తరం వ్రాసి. ఇవాళ ఉదయం నీకు వ్రాయాలనిపించింది. ఎందుకలా అనిపించిందో తెలియదు. బహుశా దీనాపూర్‌లోని పరేశ్ బాబు ఆంతరంగిక విషయాలు కారణం కావచ్చు. దీన్‌పూర్‌నుంచి వచ్చి మూడురోజులైంది. అక్కడ సాహిత్య సమ్మేళనం, మ్యునిసిపల్ సన్మానం జరిగాయి. స్టేజిమీద సారగర్భితమైన దీర్ఘవ్యాసం చదవబడుతూ ఉంటే ప్రక్కన క్రింద 'అనామీ' గురించి చర్చ సాగుతోంది. అయితే నూటికి ఎనభై వ్యతిరేకాభిప్రాయాలే. వాటి మధ్యనుంచి ఒకాయన తాను 'అనామీ' పుస్తకాన్ని నాలుగుసార్లు చదివానని మరొక నాలుగుసార్లు చదవాలని అనిపిస్తోందనీ అంగీకరించాడు.

"ఏం చెబుతున్నారు దినేశ్ బాబూ! మీరు ఫరీద్‌పూర్ బార్‌లో రత్నంవంటి వారుగదా. ప్రచండతార్కిక న్యాయవాది గదా— మీలోనే ఈ దౌర్బల్యం ఏమిటి ?"

"దినేశ్ బాబూ! మీ మనస్సు సరిగా లేదులాగుంది"

"దినేశ్ బాబూ, మీరు ప్రపంచంలోని ఎనిమిదవ వింత" మొదలైనవి.

నేను మౌనంగా ఉన్నాను - సాక్షిలాగా - ఒకసారి నన్ను ఒంటరిగాచూచి ఈ దినేశ్ బాబే ఇలాఅన్నారు. "శరత్ బాబూ! ప్రపంచంలో అన్నిపుస్తకాలూ అందరికోరకూ కాదు. నేను శాంతదాస్ బావాజీదాస్ శిష్యుణ్ణి - వైష్ణవుణ్ణి. దేవుని నమ్ముతాను. దిలీప్ బాబు ఏ భావప్రేరణతో తన కవిత్వాన్ని వ్రాశారో ఈ ప్రపంచంలో దానికి సాటిలేదు. సమయం దొరికినప్పుడల్లా ముగ్ధుడనై కవిత్వం చదువుతాను. ఎంత నచ్చాయో నేను యితరులకు చెప్పలేను."

విన్న తర్వాత ఇంతకంటే నిజమైన, నిష్పాక్షపాత విమర్శ మరేముంటుంది అనుకున్నాను. నీవు మీటిన తీగయే వారి హృదయంలోనితీగెనూ కదిపి మ్రోగించింది. తన హృదయతంత్రి కదలనివారు నాలుగైదుసార్లు చదివినవారిమాటలు విని ఆశ్చర్యం ప్రకటించకపోతే మరేం చెప్పగలరు? విస్మయ ప్రదర్శనతో ఊరుకోలేనివారు అసభ్యదూషణలకు కూడా దిగుతారు. అందు వారిస్థాయి ఎంతపెరిగితే తమను అంత పెద్ద విమర్శకులుగా భావించుకుంటారు. ఇదికూడా నేను చాలా చోట్ల చూస్తున్నాను.

ఆ తర్వాత 'అనామీ' పై ఒక విమర్శనాసభ ఏర్పాటు చేస్తున్నాననీ నన్ను అధ్యక్షునిగా ఉండమనీ కోరుతూ హీరేన్ అనే యువకుడొక ఉత్తరం వ్రాశాడు. ఉత్తరంరాగానే క్షణం లోఆలోచించుకుని 'సరే' నని జవాబు వ్రాశాను. దినేశ్ బాబు నాలుగైదుసార్లు 'అనామీ' చదివారంటే చాలా మందికి ఆశ్చ

ర్యంగా ఉంది. సభలోనే నీ విషయాన్ని గురించికూడా చెబుతాను.

కొన్నాళ్ళనుంచీ నీ కొకసంగతి చెప్పాలనుకుంటున్నాను. అది ఆ...రచనల సందర్భంలోనే. అతనికి నువ్వంటే గౌరవం. అందుచే నువ్వు చెబితే వినవచ్చు కూడాను. వ్రాయడంలో కొంచెం సంయమంగా ఉండాలని చెప్పు. సంయమం ఒక విధంగా సహజగుణం (ఇన్‌స్టింక్ట్) అనుకో. స్వయంగా లేకపోతే ఇతరులు నచ్చజెప్పలేరు. అయినప్పటికి రచనల్లో ఆకారణంగా ఇతరుల వాక్యాలు ఉదహరించడమంత అసహ్యమైనపని మరొక టుండదు. ఫలానా రచయిత చెప్పిన '.........' విషయాలతో నేను ఏకీభవిస్తాను. ఆయన '.........' పంక్తులు బాగుండలేదు. ఫలానా రచయిత '.........' వాక్యాలు అందంగాఉన్నాయి మొదలైనవి. ఇవి ఎలాగంటే పాఠకునితో చాలా అసహ్యకరమైన పద్ధతిలో చూశారా నేను ఎన్ని పుస్తకాలు చదివానో, చిన్నవయస్సులోనే ఎంత తెలుసుకున్నానో అని చెప్పడం. మంటూ, నువ్వు నీ రచనలోని యిలాంటి ఉదాహరణలు చూడమని అతనికి చెప్పు. నీ బహు విస్తృతమైన అధ్యయనంవల్ల అవసరంకొద్దీ అవి వచ్చాయనికూడా చెప్పు. అకారణంగానూకాదు, పాండిత్యంప్రదర్శించాలనే దంభంతోనూ కాదు. ఆ...ఇంకా కుర్రవాడు. కాబట్టి ఇప్పటినుంచీ చెబితే బాగుపడవచ్చు. ఇట్టి ఉదాహరణలివ్వడంలో నిన్ను అనుకరించడం తేలికైనపనికాదని అతనికి తెలియకపోవచ్చు. ఇతర

విశృంఖలత్వాన్ని గురించి ఎత్తడం లేదు. ఎందుకంటే చూ... కనక ఇతని సాహిత్య ఆదర్శపురుషుడైతే ఇక అతన్ని దారిలో పెట్టలేము. ఇదంతా బాధపడే వ్రాస్తున్నాను. వ్రాయడంలో సంయమసాధనను మించిన కఠినమైనసాధన మరొకటిలేదని నీకు ఎన్నిసార్లు వ్రాశానుకాదు. సంయమంయొక్క చిహ్నాన్ని చూస్తే రసికపాఠకుని హృదయం ఆనందంతో ఓలలాడుతుంది. సరే, ఇక దాన్ని పోనీ. 'స్వదేశ్ ఓ ప్రచారక్'లో అచ్చైన నా ఆ ఉత్తరం గురించి కవి నాకు జాబువ్రాశారు. అందులో చివర "నువ్వు మాటమాటకీ కఠినభాషలో నాపై దాడి వెడలుతున్నావు. కాని నే నెప్పుడూ బహిరంగంగాగాని, చాటునగాని నిందించి ప్రతీకారం తీర్చుకోలేదు. ఈ రచనను కూడా ఆ వరుసలోనే చేర్చాను." అని వ్రాశారు.

ఆ రోజున ఉమాప్రసాద్ (కీ. శే. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అన్న) ఆ ఉత్తరం వ్రాసి చాలా అన్యాయం చేశానని అన్నారు. అందు ప్రతిపంక్తిలోనూ విషం నిండిఉన్న దట. కాని నే నిప్పుడేం చెయ్యగలను? వ్రాసినదాన్ని తిరిగి తీసుకోలేనుగదా. కవితో నాఎడబాటు బహుశా పూర్తిఅయి పోయిందనుకుంటాను. కాని ఈ విషయమై నువ్వు 'స్వదేశ్'లో వ్రాసిన లేఖ బాగుంది. అందులో విచారమేగాని కోపం లేదు. నావల్ల తప్పే జరిగింది. కాని ఏంజరుగుతుందో చూడాలి. 'పరిచయ్'లోని ఆ రచన చదువగానే నా శరీరమంతా మండి పోతే వెంటనే కాగితం తీసుకుని ఆ లేఖ వ్రాసేశాను.

శ్రీకాంత్ నాల్గవ అధ్యాయం విమర్శ మరొకసారి 'విచిత్ర'లో వచ్చింది. ఇది శ్రీకాంత్‌ను గురించికాక మరొక దాన్నిగురించి అయితే ఏకకంఠంతో ప్రశంసించి సంతోషంగా ఊపిరి పీల్చేవాడిని. రచన చాలా బాగుంది. నిజంగా అర్థంచేసు కుని చదివి అనుభూతిపొందాడు.

మంటూ, నానుంచి జవాబు వచ్చినా, రాకపోయినా అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాస్తూఉండు. నీ ఉత్తరంవస్తే నా కొక తృప్తిఉంటుంది. మిత్రులు సురేన్ మైత్ర శ్రీ అరవిందునికి గొప్ప భక్తులు. నువ్వు నాకు నా గురించి వ్రాసిన రచనలన్నీ (నీకు ఇంకా నేను పంపకుండా ఉన్నవి) చదవడానికి కావా లన్నారు. ఇస్తానన్నాను. కోపం తెచ్చుకోకు. సురేన్ బ్రహ్మ సామాజికులైనా చాలా మంచివారు.

నీ నిత్య శ్రేయోభిలాషి,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

సామతాబేడ్; పానిత్రాస్,

హవారా. 20 మాఘము, 1340.

మంటూ,

ఇప్పుడే నీ రిజిష్టరు ఉత్తరం అందింది. అసలు విషయాలు ముందువ్రాస్తాను.

(1) 'రంగేర్ పరశ్' పంపు. రెండుమూడు పేజీల్లో చేతనైనట్లు వ్రాస్తాను. కాని నిజం చెప్పాలంటే కథలు, నవ

లలు కాక నేను మరేమీ వ్రాయలేను. భాషా దారిద్ర్యంవల్ల వ్యాసం వ్రాస్తే చదువ వీలులేకుండా ఉంది. నా ఉత్తరాలభాష చూస్తున్నావుగదా. కవి సందర్భంలో 'స్వదేశ్'లో వ్రాసిన లేఖ ఎంత అసహ్యంగా తయారైంది! అయినప్పటికీ ఇంక నా ఆ నూటి గ్రామీణ భాషలో ఆనందాన్ని ప్రకటించడం సవరించుకోలేను. అందుచేత అలాగే వ్రాస్తాను. మరి నన్నెవరూ కాదనలేరు.

(2) హీరేన్ విషయం ఆ ఉత్తరంలో వ్రాశాను. 'అనామీ' విమర్శగురించి ఏర్పాటుచేసినసభలో పాల్గొంటాను.

(3) 'విచిత్ర'లో శ్రీకాంత్ గురించి ప్రచురింపబడిన విమర్శనను ఎలాగైనా అచ్చువేయించు. ప్రజలు చదువుతారు. 'రంగేర్ పరశ్'లో ప్రకటించడంకూడా బాగానే ఉంటుంది. అయినా యితరుల అభిప్రాయాలుకూడా తీసుకో.

మరొక్కసంగతి "పథకే దావేదార్" విమర్శగురించి నూచించకపోవడం మంచిదే. ఈ రోజుల్లో ప్రభుత్వం దాని వెంటపడింది. అందుచేత దాన్నిబట్టి పుస్తకాలన్నీ జప్తు చెయ్యబడకుండా చూడాలి.

నువ్వు యిప్పుడు వ్రాస్తున్న నవల ఇంకా బాగా తయారౌతుందనుకుంటాను. సంభాషణల్లో సహజమైన భాషనే వాడు. సంభాషణలు చిన్నవిగా ఉండాలి. ఒక్కచోటే కుప్ప పోసినట్లూ ఉండరాదు. ఒక అధ్యాయంలో కొన్ని, మరొక అధ్యాయంలో ఇంకొన్ని - అలాగ పోలికలు, అలంకారాలు

రవీంద్రునిరచనల్లోలాగా అసంబద్ధంగానూ నిరర్థకంగానూ ఉండకుండా చూడు. మనిషిని అలంకారాలతో చక్కదిద్దడం బంగారు కొట్లులో షోకేసులు చక్కదిద్దడం ఒకటికాదు. దీన్ని ఎప్పుడూ గుర్తుంచుకో. అలంకారాలతో నిండినవాక్యం ఎంత బాధాజనకంగా ఉంటుందో పాఠకులకే తెలుస్తుంది. ఇంక చాలు. ఇప్పటికే ఎన్నో ఉపదేశాలు కుప్పలుగా చెప్పేశాను. సంయమం పాఠం చెబుతూ స్వయంగా నేనే దాన్ని అతిక్రమించుతున్నట్లున్నాను. ప్రేమాశీర్వాదాలు.

—శ. చ.

పి. 566 మనోహర్ పుకుర్, కాలీఘాట్,
కలకత్తా, 7 జ్యేష్ఠం 1342.

చిరంజీవీ,

మొదట స్వవిషయం వ్రాయనీ. మొన్న ఇంటినుంచి తిరిగివచ్చినదగ్గరనుంచీ తలనొప్పిగా ఉంది. దగ్గర బుద్ధదేవ భట్టాచార్య, డా॥ కానాయీ గంగూలీ ఉన్నారు. ఒక డాక్టరుహోంకి ఫోనుచేస్తున్నారు. డ్రైవరును కారు బయటికి తియ్యమంటున్నారు. బ్లడ్ ప్రషర్ చూస్తారట. ఎక్కువగా లేకపోతే చిక్కేలేదు. ఉంటేమాత్రం కదలకుండా పక్కమీంద పడుకుని ఆనందంగా సమయం గడిపేస్తాను. నాకు ఇంతకంటే విశ్రాంతికీ, సంతోషానికీ సమయంలేదు. దేవుడదే చేయుగాక!

బుద్ధదేవ్ చే నీ ఉత్తరం సగం చదివించుకున్నాను: క్రొంచి తెలిసిన యితర మిత్రునిచే మిగిలిన సగం చదివించుకోవాలి.

మంటూ, ఇంత చిన్న 'నిష్కృతి'ని తీసుకుని సమరాంగణంలోకి దిగడం, తగరపుఖడ్గం తీసుకుని గేదెని వధించబూనడం ఒకటే. నిజంగా నాలో ప్రత్యేకశక్తి ఏమీ లేదు. కేవలం నీ గురుదేవుని ఆశీర్వాదం, నీ స్వచ్ఛమైన స్నేహం, గౌరవం ఇవే నాకు బలం. కాని తమ్ముడూ నావైపునుంచి ఏమీ లేవని పిస్తుంది.

నువ్వు 'శ్రీకాంత్'ని అనువదించడానికి ఎందుకు సంకోచిస్తున్నావు? అనువదించడం జరిగితే నీ వల్లనేకావాలి. భవానీని పిలిచి శ్రీకాంత చతుర్థ అధ్యాయమిచ్చి అనువాదం చేసుకు రమ్మన్నాను. ఒక వారం గడిచాక, స్వయంగా రాలేక, తనకు అనువాదంచేసే సాహసంలేదని ఉత్తరంద్వారా తెలిపాడు. ఇంగ్లీషులో అతను వ్రాసినది చూస్తే నిజమేననిపించింది. ఇంక అతనివల్ల కాదు. ఒకవేళ చేస్తే అది పత్రికా వార్తలభాష అవుతుంది. సోమనాథ మైత్రా రెండవభాగాన్ని అనువదించ పూనుకున్నారట. అయితే నాకా విషయం తెలియదు. 'విచిత్ర' ఉపేక్ష కనుక దీనికి ఏర్పాటుచేస్తే మంచిదే. కనుక్కుంటాను. లేకపోతేమాత్రం నువ్వుతప్ప మరెవరూ అనువాదానికి యోగ్యులుగా కనపడడంలేదు. 'నిష్కృతి'ని నువ్వుచేసిన దానికంటే బాగా మరెవరూ అనువాదం చేయలేరు. అయితే

శ్రీకాంత్ అనువాదభారం నీకు అప్పగించలేకున్నాను. ఇంత పెద్దపనిపెడితే నీ యితరపనులు కుంటుపడతాయి.

'సమృతి'ని గురించి నీ యిష్టంవచ్చిన ఏర్పాట్లుచెయ్యి. చిన్నకథల అనువాదానికి ఇక్కడ ఏర్పాటుచేస్తాను. కాని మనుషులు దొరకడంలేదు. 'పండిత మహాశయుని' అనువాదం నావద్దే ఉంది. కాని దాన్ని చూస్తే నీకు కష్టం కలుగుతుందేమో. మాయను నేనింతవరకూ కలుసుకోలేదు. రెండుమూడు రోజుల్లో కలుసుకోగలననుకుంటాను. నా స్నేహాశీస్సులందుకో.

శరత్ అన్న.

తాజాకలం:—

మిగిలిన సమాచారాలు బుద్ధదేవ్ చెబుతాడు.

—శ. చ.

పి. 566 మనోహర పుకుర్,
కలకత్తా. 3 మాఘం, 1341.

చిరంజీవి మంటూ,

నిన్నరాత్రి పల్లెటూరునుండి వచ్చాను. నీ ఉత్తరాలు అందాయి. విషయాలు వరుసగా వ్రాస్తాను.

(1) నిశికాంతుడు చిత్రించిన నీ చిత్రం చాలాబాగుంది. చాలా రోజుల తర్వాత నీ ముఖం చూడగలిగాను. చాలా ఆనందం కల్గింది. ఇప్పుడు నిజంగా నిన్ను చూడాలని ఉంది.

కాని, ఇంక ఆ ఆశ వదులుకున్నాను. ఈ జీవితంలో ఇంక, చూడలేననే నిశ్చయించుకున్నాను.

(2) టైప్‌రైటర్ సక్రమంగా చేరినందుకు సంతోషం. ముక్కచెక్కలై చేరుతుందేమోనని భయపడ్డాను. ఆరోజున హేంరేన్ వచ్చి 'మంటూదాదా టైపురైటరు పాతదై పోయింది, క్రొత్తది కావాలి' అన్నాడు. కాస్త నువ్వే ఆ పనిచెయ్యి అని నేను చెక్కుమాత్రం వ్రాసియిచ్చాను. నీకు నచ్చినందుకు సంతోషం. అంతకంటే నాకు కావలసిందేముంది? తన సర్వస్వాన్ని ఇచ్చిన వ్యక్తికి ఇవ్వడం - ఇవ్వడంకాదు పొందడమే అవుతుంది. నీకు నావల్ల లభించినదానికంటే నాకు నీవల్ల లభించినదే అధికం.

(3) శ్రీ అరవిందుని స్వదస్తూరీతోవున్న వుత్తరం జాగ్రత్తగా దాచాను. అది ఒక రత్నం.

(4) 'నిష్కృతి' ని చక్కగా అనువదించటానికి నువ్వు శక్తివంచనలేక కృషిచేస్తావని నాకు తెలుసు. నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావనే కాదు; సాధువులయ్యేవారందరి స్వభావమూ అంతే. ఇలా చెయ్యకుండా వారు వుండలేరు. అసలు చెయ్యనే చెయ్యరు. చేస్తే బాగానే చేస్తారు.

(5) శ్రీ అరవిందులు స్వయంగా అజమాయిషీ చేసేటప్పుడు అనువాదం చాలా బాగుంటుంది. కాని మంటూ, పుస్తకంలో నా ప్రతిభ యేముంది కనుక? శ్రీ అరవిందులకు ఎందుకు నచ్చిందో నాకు తెలియదు. కనీసం నచ్చకపోయినా

నాకు ఆశ్చర్యంవేసేదికాదు; నేను విచారించే వాడినీకాదు. నువ్వు (శ్రీ) కాంత్‌ని ప్రచారం చేసినప్పుడు పశ్చిమదేశస్థులు ఈ బెంగాలీ కథారచయితని గౌరవదృష్టితో చూడగలరని నమ్ముతాను. నీ కృషి, (శ్రీ) అరవిందుల ఆశీర్వాదంవుంటే ఇది తప్పకుండా ఒకరోజున సంభవమౌతుందని నా ఆశ.

(6) అనువాదం విషయంలో నీకు పూర్తిస్వాతంత్ర్యాన్ని యిస్తున్నాను. నువ్వు అనువాదకుడివిమాత్రమే కాదు. స్వయంగా గొప్పరచయితవికూడాను. నిన్ను మామూలువ్యక్తి క్రింద జమకట్టేవారూ తక్కువలేరు. వారి ప్రయత్నాలు అలా సాగనీ. వారి ప్రయత్నాలకంటే నీ ఏకాగ్రసాధన, ప్రతిభ చాలా గొప్పవి. నీ గురువుల ఆశీస్సులు నీ వెనుక వుండనే వుంటాయి. నీ అంతరాళంలోని చైతన్యశక్తి ఒడిపోవడం, వారి చెడుప్రయత్నాలకు విజయం లభించడం అసంభవం, మంటూ.

(7) రవీంద్రనాథ్ నన్ను పరిచయం చేస్తారని నేను నమ్మను. నా యెడల వారు సుముఖంగాలేరు. ఇంతేకాక వారికి తీరికకూడాలేదు. సాహిత్యసేవ విషయంలో రవీంద్రులను నేను గురుతుల్యులుగా భావిస్తాను. వారి ఋణాన్ని నే నెప్పుడు తీర్చుకోలేను. మనస్సులో వారియెడల నే నింత గౌరవం పూజ్యభావం ఉంచుకుంటాను. కాని నా వ్రాత అందుకు సాక్ష్యం చెప్పలేదు. నేనంటే రవీంద్రులకుండే వైముఖ్యానికి అంతులేదు. అందుచేతదానికి ప్రయత్నించడం అనవసరం.

(8) హీరేన్ ఇవాళో, రేపో వస్తాడు. రాగానే నీ కాగితాలన్నీ పంపివేయమని చెబుతాను.

(9) ఇంక నీ విషయం మిగిలింది. నేను నీకు చాలా కృతజ్ఞుణ్ణి. మంటూ, ఇంతకంటే ఏం చెప్పను? ఉత్తరాలు వ్రాయడం నాకు మొదటినుంచీ కష్టంగానే ఉంది. ఎంత ప్రయత్నించినా సరిగా వ్రాయలేకపోతాను. అందుచేత చెప్పదలచుకున్నవి సరిగా చెప్పలేకపోతాను. అది నా అసమర్థత. అంతే గాని అయిష్టతమాత్రం కాదు. ఇది నమ్ము.

నా స్నేహాశీస్సు లందుకో. సౌరీన్‌ని అడిగానని చెప్పు. కుర్రవాడి సంగతి గుర్తు రావడంలేదు. కీ. శే. దాదామహాశయుని ఇంటివద్దగాని లేక 'తకూ' ఇంటివద్దగాని చూచి ఉంటాను.

(10) శ్రీ అరవిందుని నవవర్ష ప్రార్థన నిజంగా చాలా బాగుంది. వాస్తవంలో వారు చాలా గొప్పకవి.

శ్రేయోభిలాషి,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

చిరంజీవి మంటూ,

చాలా రోజులనుంచీ నీకు ఉత్తరం వ్రాయలేదు. అన్యాయమేజరిగింది. దీనికి శిక్షఉన్నదని నాకు తెలుసు. కాని క్షమార్హులు కానివారిని క్షమించకపోవడం కృత్రిమం

కాదు. అప్పుడు దాన్ని పూర్తిచేయుటకు భగవంతుడే స్వయంగా మనుష్యులను పంపుతారు. కాని ఒక్కసారిగా పాతాళానికి పంపరు. బుద్ధదేవ్ భట్టాచార్యుని రూపంలో నాకా మనుష్యులు లభించారు అందుచేత నీకు చెప్పవలసినదంతా వారిద్వారా చెబుతాను. వారే నీకు విషయాలన్నీ చెబుతారు. నీలాగే వారుకూడా నన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నారు. నామేలుని, నా కీర్తి తగ్గరాదని వారెప్పుడూ కోరుతూఉంటారు. ఒకరోజున ఆయన నన్ను బలవంతంగా హాఫ్‌మెన్ కెమేరా ముందు కూర్చోబెట్టి ఫోటోతీయించిగాని వదల్లేదు. 'దిలీప్‌కుమార్ అడిగారు, కాదనలేను' అన్నారు. వారి శ్రమకు సహకరించాలి. అంటే శ్రమలో భాగం పంచుకోవాలి. అంతా ఒంటరిగానే చెయ్యాలా? నేను పెద్ద రచయితనని, కాబట్టి నాకు అట్టి సన్మానం లభించాలని ఆయన అనుకుంటారు. నేను చాలా చిన్న రచయితనని నేను చెబుతూఉంటాను. యూరపు నన్నేమీ గౌరవించదు; అందుచేత నాలో ఏదోఉన్నదని అనుకోను. అయితే దిలీప్‌బాబు అనవసరంగా ఇంత కష్టపడుతున్నాడా, ఆ శ్రమ వృథాపోదు, శ్రీ అరవిందులు ఆయనకి అభయమిచ్చారు అనిచెప్పాడు బుద్ధదేవ్. అప్పుడు నేను 'అయితే అరవిందులకే తెలియాలి' అన్నాను.

ఒకరోజున వశిష్టసేన్ అమెరికన్ భార్య 'సమ్మృతి' అనువాదం చూడాలని మరీమరీ అడిగింది. అందులో శ్రీ అరవిందుని చెయ్యిపడిందని ఆమెకు తెలిసిందట. అందుకే ఇంతగా కోరింది. ఏప్రిల్‌లో ఒక కాపీ అమెరికా తీసుకువెళ్ళి ప్రచురిస్తా

నని చెప్పింది. ఇంతకుముందు ఆమె 'ఏషియా' పత్రిక సంపాదకు రాలుగా ఉండేది. అక్కడ చాలమంది ప్రకాశకు లామెకు తెలుసు. 'నిష్కృతి' కాక 'శ్రీకాంత్' ఇస్తే బాగుంటుందని నా అభిప్రాయం. ఆ దేశంలో 'నిష్కృతి'కి ఏవిషయంపై గౌర వం లభిస్తుంది కనుక ? ప్రస్తుతానికి నాకు ఒక కాపీ పంపు. అనువాదం ఎలా జరిగిందో చూస్తాను. బుద్ధదేవ్ కూడా నీ కీ పాటికి వ్రాసే ఉంటాడు. నువ్వు అడిగిన వస్తువులన్నీ పంపమని చెప్పాను. ఈపాటికి నీకు అందే ఉండవచ్చు. 'నిష్కృతి' ఫ్రెంచి అనువాదం చెయ్యాలని నువ్వు అనుకుంటున్నావనీ ప్రయత్నిస్తు న్నావని విన్నాను. నేను ఎంతకాలం ఉంటానో నమ్మకంలేదు. కాని శ్రీ అరవిందుని ఆశీర్వాదంతో అసంభవాలు కూడా సంభవంకాగలవు.

నువ్వు బైరాగివి అయినా నాకోసం చాలా ఖర్చుపెడు తున్నావు. బుద్ధదేవ్ రావడంతోనే కొంత పంపుతాను. బుద్ధదేవ్ కుర్రవాడైనా బాగా చదివినవాడు. సంస్కృతం, వృక్షశాస్త్రంలో చాలాపరిచయం ఉన్నవాడు. కాలేజీలో ఈ రెండు విషయాలు బోధించుతూ ఉంటాడు.

మంటూ, ఇంక 'శ్రీకాంత్'లో చెయ్యి వెయ్యి; బ్రతికి ఉండగా ఒక్కసారి ఈ కళ్ళతో అనువాదాన్ని చూచిపోవా లని ఉంది.

సాహానా, నువ్వు పాడే పాటలపుస్తకం కనిపించింది. జాగ్రత్తగా బీరువాలో దాచాను. సాహానాకు నా ఆశీస్సు లందించు.

నేను సమాధానాలు వ్రాయడంలో ఎంత ఆలస్యమైనా నువ్వు మాత్రం ప్రతీకారం ఈ రూపంలో తీర్చుకోకు. ఒక వారంలో అందరం పల్లెకు వెళుతున్నాము. వెళ్ళేముందు నీకు పునహా వ్రాస్తాను. ఈ లోగా 'నిష్కృతి' అనువాదం ప్రతిఒకటి కలకత్తాఅడ్రసుకు పంపు. మీ రందరూ క్షేమంగా ఉన్నారనుకుంటాను. నా స్నేహాశీస్సులందుకో.

శరత్ అన్న.

పి 56౨ మనోహర్ పుకుర్,
3 మాఘం 1342,
కలకత్తా,

చిరంజీవి మంటూ,

నీ పోస్టుకార్డు, 'బహువల్లభ్' ఫారాలు అందాయి. గత తొమ్మిది, పది మాసాలుగా నేను అస్వస్థతగా ఉన్నానని బహుశా నీకు తెలియకపోవచ్చు. శయ్యాగతుడనై ఉన్నానన్నా అతిశయోక్తికాదు. గత జ్యేష్ఠమాసంలో పల్లె నుంచి ఇక్కడకు వచ్చేటప్పుడు త్రోవలో వడగాలి తగిలింది. అప్పటినుంచీ చెప్పలేనంత కళ్ళుమంట, తలనొప్పీను. ఇంకా తగ్గలేదు. ముందైనా బాగుపడతానని నమ్మకంలేదు. అంతే కాక పాతరోగం. ఒట్టిరక్తం పడుతూఉంటుంది. నెల్లాళ్ళబట్టీ మధ్యమధ్య జ్వరం వస్తోంది. జ్వరంతోనే నీకు ఉత్తరం వ్రాస్తు

న్నాను. పల్లెలోనే ఉంటూ మధ్యలో కొంచెం బాగున్నప్పుడు, కలకత్తా వస్తున్నాను. వ్రాయడం - చదవడం పూర్తిగా మానేశాను. పత్రికకూడా చదవడంలేదు. ఇంక ఆజీవనం వ్రాయను. చదువను వీలులేకపోయినా బాధలేదు. శక్తి సామర్థ్యాలున్నంత వరకూ పనిచేశాము. లేనప్పుడు విచారించి ప్రయోజనం? హృదయంలో ఎప్పుడూ వైరాగినే. ముందుకూడా అలాగే ఉండాలి.

మంటూ బాబు 'దోలా' చాలా బాగుందని ఒకనాడు బుద్ధదేవ్ అంటున్నాడు. విని ఆశ్చర్యంవెయ్యలేదు. రోజు రోజుకూ మంటూ నవలలు అభివృద్ధి పొందుతాయని నాకు తెలుసు. స్వచ్ఛమైన సాధనకు ఫలితం రాక ఎలాపోతుంది? అంతేకాక వారసత్వంగా కళాకారుని హృదయం లభించింది. ఎంత విశాలమైనదో అంత సుసంస్కారయుక్తమైనది. పరదుఃఖ పీడితమైనదికూడాను. నీ రసపూరిత హృదయపరిచయం చిన్నతనంనుండే సంగీతంలో, సద్గుణాల యెడగల ప్రేమలో, నీకార్య కలాపాలన్నిట్లోను కనిపించింది. అందుచేతనే నీపట్ల నా ప్రేమ కూడా స్వచ్ఛమైనది. బయటనుంచి వచ్చేదేనివల్లా అది మలినం కాదు. నీ రచనయెడ చాలా రోజులనుంచి నే నాశించుతున్నది నేడు సఫలమౌతోంది. ఇది నాకు అత్యంత ఆనందదాయకం. నువ్వు జీవితంలో సుఖం పొందాలనీ, సార్థకత పొందాలనీ ఆశీర్వదిస్తున్నాను.

బుద్ధదేవబోసుయొక్క 'బాసరఘర్' ను గురించి రవీందు)లేమన్నారో నేను చదువలేదు. రవీందు)లు నాకంటే

గొప్ప నవలారచయిత అని బుద్ధదేవ్ అనటంలో అసత్యమేముంది? ఇది నిజమని నా హృదయానికి తెలుసు.

ఇంతేకాక నాకంటే ఎవరు గొప్ప, ఎవరు చిన్న అని నేను ఎప్పుడూ బాధపడలేదు... ఒకవేళ నా ఏ పుస్తకమూ కూడా నవల అనిపించుకోదు అని అన్నా తాత్కాలిక బాధకంటే మరేమీ ఉండదు. నేను ఎంతో దైన్యాన్ని ప్రకటిస్తున్నానని నమ్మరేమో. కాని నేను ఇన్నాళ్ళబట్టీ ప్రయత్నిస్తున్నది దీనికే కాబట్టి ఏవిధంగా దాడిచేసినా ఎదిరించను. యౌవనంలో ఒకటి రెండుసార్లు రవీంద్రులను ఎదిరించాను. కాని అది నా ప్రకృతికాదు, అది నా వికృతి. అప్పుడు ఎన్నో కారణాల వల్ల ఆ తప్పుచేశాను.

ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. ఇంక ఎన్నాళ్లో వుండను. ఈ కొద్దికాలం ఇప్పటి మనస్సుతో వుండాలనుకుంటున్నాను. జీవితంలోని కొన్ని పొరపాటులకు పశ్చాత్తాపపడుతున్నాను. నేను చెప్పే ఒక్క విషయాన్ని గుర్తుంచుకో. మంటూ ఎప్పుడూ ఏ కారణంవల్లగాని ఎవరికీ బాధ కలిగించకు. నీ కృషే నీకు విజయాన్ని చేకూరుస్తుంది......

నీ ఇల్లు అమ్మేస్తున్నావా? ఇంక వాటి అవసరంలేదా? పూర్తిగా ఈ దేశంతో సంబంధాలు తెంచుకుంటున్నావా? ఆలోచిస్తూవుంటే చాలా బాధగావుంది.

నేను వ్రాసే ఉత్తరాలు ఎప్పుడూ చిందరవందరగా వుంటాయి. అందులోనూ అనారోగ్యసమయంలో ఎక్కడైనా

అసందర్భ విషయాలు వ్రాస్తే పట్టించుకోకు. నాకు ఏమాత్రం ఒంట్లో బాగున్నా మీ యిద్దరి పుస్తకాలూ శ్రద్ధగా చదువుతాను. శలవు.

శ్రేయోభిలాషి,

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

ఫణీంద్రనాధ్ పాల్‌కు వ్రాసినవి.

రంగూన్ మాఘం, 1913.

ప్రియ ఫణీంద్రబాబూ!

'రాముని బుద్ధిమంతతనం' ఆఖరి అధ్యాయాన్ని పంపుతున్నాను. దాన్ని గురించి కొద్దిగా మీతో మాట్లాడడం అవసరమనికూడ భావిస్తున్నాను. కథ కొంచెం పెద్దదయింది. బహుశ ఒకేపర్యాయం మొత్తం ముద్రించడం కష్టం కావచ్చు. కాని మొత్తం ఒకేసారి వేయగలిగితే మట్టుకు బాగుంటుంది. కొంచెం చిన్న టైపులో ముద్రించడంవల్ల, నాలుగైదు పేజీలు పెంచితేనే పూర్తి అవుతుందనుకుంటాను. చిన్నకథను సీరియల్‌గా ప్రచురిస్తే బాగుండదేమోననుకుంటాను. ముఖ్యంగా ఇప్పుడు మీపత్రిక కొంచెం ప్రచారం కావాలి. చిన్నకథలు వ్రాసే అలవాటు ప్రస్తుతం నాకు తప్పిపోయినప్పటికీ ఒకటిరెండు మాసాల అభ్యాసంతో బాగుపడుతుంది. నేను ప్రతినెల పది, పన్నెండు పేజీల చిన్నకథ ఒకటీ, వ్యాసమొకటీ పంపుతాను.

ప్రస్తుతం కథకే ఎక్కువవిలువ యివ్వబడుతూంది కనుక కథ తప్పకుండా పంపుతాను.

వచ్చేసారికి కథ చిన్నదిగావుండటానికి ప్రయత్నిస్తాను. ఇంకో విషయం. తమరు సమాజపతితో స్నేహంగావుండండి. వారపత్రికలో మీా పత్రికనుగురించి ఏ కొద్ది విమర్శపడినా మేలే. ఈ పర్యాయం 'సాహిత్యం' లో నాపేరుతో చెత్తా - చెదారమంతా అచ్చయింది. ఇదంతా నేను వ్రాసినదేనా? నా కేమాత్రం గుర్తులేదు. ఒకవేళ నేనే వ్రాసినా దాన్ని ప్రకటించ వలసిన అవసరమేమున్నది? బాల్యంలో ఎంతో వ్రాస్తాం టాము. అదంతా అచ్చెయ్యాల్సిందేనా? తమరు 'భారం'ను ముద్రించి నేను సిగ్గుపడేటట్లుచేశారు. ఆవిధంగానే 'సమాజ పతి' కూడ దాన్ని ప్రకటించి నేను సిగ్గుపడేటట్లుచేశారు. మీారు ఉపేన్‌కు ఒక వేళ ఉత్తరం వ్రాసేటట్లయితే నాసమ్మతి లేకుండా ఏమీా ముద్రించవద్దని గట్టిగా చెప్పండి. అవసరమైతే నేను కావలసినన్ని కథలు వ్రాయగలను. మీా పత్రికెంత? చాలా చిన్నది. అలాంటి రెండు మూడింతల పత్రికనుకూడ నేనొక్కడనే నింపగలను. ఇదేకాక నాకింకొక వీలుకూడా ఉన్నది.కథలేకాకుండా అన్నివిషయాలమీాద వ్యాసాలువ్రాయ గలను. తమకు అవసరముండేటట్లయితే వ్రాయండి. ఏవిషయ మైనాసరే నేను సిద్ధంగా ఉన్నాను. 'రాముని బుద్ధిమంతతనం' ఒకేసారి పబ్లిష్‌చేస్తారా లేక దఫాలవారీగానా? నాకు తెలియజెయ్యండి. అలాగైతే చైత్రానికి ఇంకేమీా వ్రాయా ల్సిన అవసరముండదు.

'చరిత్రహీనులు' ఇంచుమించు పూర్తిఅయినట్లే. ఉదయం పూటతప్ప రాత్రి పూట నేను వ్రాయలేకపోతున్నాను. రాత్రుళ్ళు నేను పడుకొని చదువుకుంటున్నాను.

ఇంకొక విషయం. తమరు 'యమున'లో నవలకాని, కథకాని లేక వ్యాసాలు గాని ప్రచురించే ముందు నాకొక్కసారి చూపిస్తే బాగుంటుంది. చైత్రానికి మీరు ప్రత్యేకించిన విషయాలను ఒక నెల వున్నదనగానే ముందుగా – నాకు పంపినట్లయితే నేను వాటిని సరిచూస్తాను. పుష్యపు 'యమున' ఏమీ బాగుండలేదు. ఆఖరి కథ బాగా కుదరలేదు. దీనివల్ల తమకు పోస్టు ఖర్చులు తగులవచ్చు. కాని పత్రిక బాగుపడుతుంది. త్రిప్పిపంపే ఖర్చులు నేను పెట్టుకొంటాను. కాని వ్యాసాలు పంపినప్పుడు ముందుగా నేను చూడాలనిపిస్తుంది. నేను కేవలం కథలేకాకుండా అన్ని రకాలైనవి వ్రాయగల్గుదునని ముందే తెలియచేశాను. కాని పద్యాలు మట్టుకు వ్రాయలేను. తమరు సౌరీన్ బాబుద్వారా గాని, లేక ఉపేన్, సురేశ్, గిరీన్ లతో చెప్పిగాని నిరుపమాదేవి పద్యాలు తెప్పించుకోవటానికి ఎందుకు ప్రయత్నించరు? ఆమె అన్న విభూతిని మీరు కూడ ఎరుగుదురనుకొంటాను. వారికి వ్రాసినట్లయితే నిరుపమాదేవినుండి వ్యాసంగాని, పద్యం గాని తప్పకుండా లభిస్తుంది. చాలామందికంటె ఆమె వ్యాసాలు, కవిత్వమూ బాగుంటాయి.

నేను చేయగలిగినంత ఉపకారం తప్పకుండా చేస్తాను. నేను మాట యిచ్చినప్రకారం పనికూడాచేస్తాను. సాహి

పేర అనేక నీచరచనలు చెలామణీ అవుతున్నా, ఈ వైపుకు వాటి గాలిసోకలేదు. ఇదేకాక ఇది నావృత్తికూడాకాదు. నేను ఎప్పటికీ దీనినే వృత్తిగా స్వీకరించ దలచుకోలేదు.

నేను దగ్గర్లో వున్నట్లయితే తమకు కొంచెం వీలుగా ఉండేదనుకొంటాను. కాని నేను ఈదేశాన్ని ఏవిధంగానూ విడిచిపెట్టలేను. నేను చాల ఆనందంగా ఉన్నాను. వ్యర్థంగా కష్టాల్లో ఇరుక్కో దలచలేదు. ఇరుక్కోనుకూడాను. నావిషయం ఇంత వరకే.

వచ్చే సంవత్సరానికి తమరు పత్రికను వెలపెంచి పెద్దది చేయగలిగితేచేయండి. ప్రతి సంచికలోనూ చదువదగ్గ రచనలుండాలి. ఈ విషయం స్పష్టంచేయండి. ఇందువల్లే కథ లను ఒకే సంచికలో ప్రచురించడం బాగుంటుందని చెబు తున్నాను. కొంచెం నష్టపడ్డప్పటికీ ప్రకటించినట్లుంటుంది.

ఉపేన్ చాల పర్యాయాలు 'చంద్రనాథ్' పంపుతున్నా నని వ్రాశాడే కాని ఇంతవరకూ రాలేదు. బహుశా అతనికే లభ్యపడకపోవొచ్చు. ఒక వేళ తమరు 'చంద్రనాథ్'ని ముద్రించ దలచుకొన్నట్లయితే దాన్ని మరల నూతన ఫక్కీలో వ్రాస్తాను. అదెలాంటిదో భవానీపురపు సౌరీన్‌వల్ల విన్నాను. నాకు కొంచెం జ్ఞాపకంకూడాఉన్నది. కనుక మరల క్రొత్తపోకడలతో వ్రాయడం కష్టమేమీకాదు. ఒకవేళ తమకు ఇలాంటి క్రొత్త రచనలు కావలసివున్నట్టయితే నాకు తెలియజెయ్యండి.

—శరచ్చంద్ర చటోపాధ్యాయ.

రంగూను
12—2—1913

ప్రియ ఫణిబాబూ !

ఇప్పుడే తమ ఉత్తరం అందింది. మొదటి విషయం, 'వంగవాసి'లో అనుబంధ రచనలు ప్రారంభించి వ్యర్థ ఖర్చులు చేయకండి. తమరేమీ గాబరాపడవద్దు. తమ పత్రికలో మంచి విషయాలుండేటట్లయితే వెంటనే కాక పోయినా కొంతకాలానికైనా దానంతట అదే తెలుస్తుంది. ఎవ్వరూ ఆపలేరు. తమరేమీ భయపడనక్కరలేదు. అనుబంధ రచనలద్వారా డబ్బు నష్టంచేసేకంటే ప్రచారంద్వారా చందాదారుల్ని చేర్పించుకోవడంమంచిది.

రెండవ విషయం 'రాముని బుద్ధిమంతతనం' చిన్న సైవులో ఒకేపర్యాయం ముద్రించడం బాగుంటుంది. ఈ రకమైన చిన్న కథల్ని సీరియల్‌గా ప్రచురించడం బాగుండదు. ఏమైనా పని జరగకపోయిన దానిని గురించి చర్చించడం వృథా. నేను రెండు రోజులలోపలనే ఒక కథ పంపుతున్నాను. తమ జవాబువచ్చిన తర్వాతే పంపుతాను. 'రాముని బుద్ధిమంత తనం' కంటె ఇదే బాగున్నదని నా అభిప్రాయం. కాని దాని లాగే అదీ కొంచెం పెద్దదయింది. ఎంత ప్రయత్నించినా చిన్నదికాలేదు. మున్ముందు-ప్రయత్నించిచూస్తాను.

మూడవ విషయం. 'చంద్రనాథ్'ని గురించి కొంత గందరగోళంలో ఉన్నది. కాబట్టేదానివల్ల లాభమేమీలేదని చెబుతున్నాను. 'చరిత్రహీనులు' ప్రకటించవచ్చు. కాని దానికి పత్రికను కొంచెం పెంచవలసివుంటుంది. కాని ధర ఎంత

ఉంటుందో, ఎప్పటినుండి పెంచుతారో వ్రాయండి. వెలపెంచకుండా పత్రికను పెద్దదిచేసి నష్టపడటం మంచిదికాదు.

నాలుగవ విషయం. సమాజపతితో మనస్పర్ధలు పనికి రావనిచెప్పాను. వారిని పొగడమనీ చెప్పలేదు. ఫణిబాబూ! మీ దుకాణంలోని సరుకు సరియైనదైతే నేడు గాకపోయినా నాల్గురోజుల తర్వాతనైనా గ్రాహకులు రానేవస్తారు. చెడ్డవస్తువులను పెట్టుకొని లక్ష ప్రయత్నాలుచేసినా దుకాణం నడవదు. రెండు మూడు రోజుల్లోనో లేక నెలలోకాని దివాలా తీయనే తీస్తుంది.

నా బాల్యంలో వ్రాసిన చెత్తా - చెదారం అంతా ముద్రించి నన్నెంత సిగ్గుపడేట్లుచేస్తున్నారో, నాకెంత అన్యాయం జరుగుతున్నదో వ్యక్తం చేయలేకుండా వున్నాను. సమాజపతి ఉచితానుచితాలను తెలిసికోగలినవాడైయుండి కూడా ఈ రకమైనది ఎలా పబ్లిష్‌చేశాడో ఆశ్చర్యంగా వున్నది.

ఐదవ విషయం. సౌరీణ్‌బాబుతో మీ స్నేహం ఎలా ఉన్నది? ఆయన 'దీదీ'ని గూర్చి నా విమర్శచూశారా! బహుశా కోపించి యుండవచ్చు. కాని నా దోషమేమున్నది? వ్రాసినవారే దానికి బాధ్యులు. ఇదేకాక వారు ఈ రచనల్ని చిన్నటైపులో ముద్రించారుకదా!

ఆరవ విషయం. నా క్రొత్తకథ (దానిని రెండుమూడు రోజులలోనే పంపుతాను) ఏ నెలలో పబ్లిష్‌చేస్తారు? చైత్ర మాసంలో 'రాముని బుద్ధిమంతతనం' పూర్తి అవుతుంది.

ఇందువల్ల దానిని ఆ నెలలో కాక వైశాఖంలో ప్రచురించండి. ఏ నెలలో వేసినా సరే చిన్న టైపులో అయితే స్థలం తక్కువ పడుతుంది. అయినప్పటికీ కొనేవాళ్ళకు చదవడానికి ఎక్కువ. లభ్యమవుతుంది.

ఏడవ విషయం. వైశాఖాన్నుండి పత్రిక సర్వాంగ సుందరంగా వుండాలి. బొమ్మలకు వ్యర్థంగా డబ్బు ఖర్చు చెయ్యకుండా, ఇంకేదైనా విధంగా ఆ డబ్బునే పత్రికకు వినియోగించితే బాగుంటుంది. కొనేవాళ్లు బొమ్మలుండాలంటారో లేదో నాకు తెలియదు. ఒకవేళ ఇదే ఫేషనైతే తప్పకుండా బొమ్మలు ముద్రించాల్సిందే.

తమరు వ్యాసాలుగాని, కథలుగాని ఎంచుటలో నాకు కూడ అవకాశం ఇచ్చేటట్లయితే బాగుంటుంది. నేనుకూడ చూస్తాను. ఏమనుకుంటారో అనిగాని, పేరునుబట్టిగాని పాడూ-పీడూ వేయడం మంచిదికాదు.

ఎనిమిదవ విషయం. శ్రీమతి నిరుపమాదేవి దయతో తన రచనల్ని తమకి పంపేటట్లయితే చాలా మంచిది. ఆమె కవితాశక్తి అపూర్వం. శ్రీమతి అనురూపాదేవి రచనలు పొందడం దుస్సాధ్యం. ఆమె 'భారతి'లో వ్రాస్తారు. తమ పత్రికలో కూడ వ్రాస్తారో లేదో చెప్పజాలము. వ్రాసినా అంత సుముఖంగా వ్రాస్తారని తోచదు. వీరంతా గొప్ప రచయితలు. వీరికి బహుశాయమునవంటి చిన్న పత్రికలో వ్రాయడమే మనస్కరించకపోవచ్చు. కొంచెం ప్రయత్నించి చూడండి. వారి రచ

నలు లభించినా మంచిదే, లేకపోయినా మంచిదే. నాకు మూడు పేర్లున్నవి.

విమర్శ, వ్యాసాలువగైరా — అనిలాదేవి.
కథానికలు — శరచ్చంద్ర చట్టోపాధ్యాయ.
పెద్దకథలు — అనుపమ.

అన్ని విషయాలూ ఒకే పేరుతో వేసేటట్లయితే వీళ్లకు ఇతనొక్కడు తప్ప ఇంకెవ్వరూ లేరని ప్రజ లనుకొంటారు.

ఇచ్చట నాకొక మిత్రులున్నారు. వారిపేరు ప్రఫుల్ల లాహిడీ బి. ఏ. మంచి తత్వవేత్త. వ్యాసాలు చాలా బాగా వ్రాస్తారు. కాని పేరేమీలేదు. కారణ మేమంటే ఏ మాస పత్రికకూ రచయిత కాదు. తమ 'యమున'లో వ్రాయమని వీరిని బలవంతపెట్టాను. వ్యాసంరాగానే పంపుతాను.

యమున సైజు చిన్నదవడం చాలా ఇబ్బందిగావున్నది. దీనికి ఎక్కువ శ్రమ అక్కర్లేదు. వెలకూడ తక్కువే. అకస్మాత్తుగా వెల పెంచడంవల్ల ఫలితమెలావుంటుందో చెప్పలేను. ఇది సంభవం కాకపోయినట్లయితే ఎక్కువ ఖర్చుతో నష్టపడడం కంటె సైజు, ధర పెంచవలసిన అవసరం ఋజువుచేసుకొనుటకు కొద్దిరోజుల తర్వాత ఆశ్వయుజమాసంనుండి కొనేవాళ్ల అభిప్రాయాలు సేకరించండి. తమరు స్వయంగా చాల అశ్రద్ధ మనుష్యులు. ఈ విధంగావుంటే పని జరుగదు. మీరు ఇంకొక పనేదీ చెయ్యకూడదని నిర్ణయించుకొన్నప్పుడు దీన్నే మరికొంచెం శ్రద్ధగా చూడాలి. లౌకికం అనేదాన్నికూడ అవహేళన

చెయ్యవద్దు, 'ప్రవాసి' లాంటి ఒకప్పటి చిన్న పత్రికలు ఇప్పు డెంతో అభివృద్ధి చెందాయి. తమరు నన్ను పురుషరచయితల్ని గురించి విమర్శ వ్రాయమని వ్రాశారు. కాని నావద్ద బెంగాలీ పుస్తకాలేమీ లేవు. మాసపత్రికలు ఒక్కటికూడ కొనడం లేదు. విమర్శ వ్రాయడానికి నాకు ఎక్కడ ఏం దొరుకుతుంది? వ్రాసినందువల్ల ప్రజలదృష్టి తప్పకుండా ఇటు మళ్ళుతుంది. ఒక చర్చ ప్రారంభం కావడానికి అవకాశంఉన్నదన్న విషయం నాకు తెలుసు. ఇలా జరిగినా విచారించవలసిన అగత్యమేమీ లేదు. ఒకవేళ నా విమర్శలో ఏదైనా తప్పువున్నదని ఎవరైనా ఋజువు చేయగల్గినట్లయితే (ఋజువుచేయ గల్గడం కష్టం) అదీ మంచిదే.

ఈ సందర్భంలోనే ఇంకొక్కవిషయం చెప్పాలి. ఇప్పుడు నేను చదవడం. వ్రాయడం మందగించింది. ఉదయంపూట అంతా ఒక్కొక్కరోజు మీ కొరకు, ఇంకొకరోజు 'చరిత్రహీనుల' కోసం పాడవుతున్నది. రాత్రిపూటమాత్రం చదువుకోవచ్చనుకోండి. కాని నోటుచెయ్యడంవల్ల రాలు కుదరడం లేదు. చాలారోజులుగా మరోవిషయం ఆలోచిస్తున్నాను. హెర్బర్ట్ స్పెన్సర్ యొక్క సమన్వయాత్మక వేదాంతానికి (Synthotic Philosophy) బెంగాలీలో ఒక పరిశీలన (గుణదోషాల్ని గురించికాదు) వ్యాసం, ఇంకా ఐరోపాలోని హెర్బర్టు మిత్రులు, శత్రువులైన వేదాంతుల రచనలమీద ఒక సీరియల్ వ్యాసావళి - వ్రాద్దామా అనిపిస్తూంటుంది. మన దేశపు పత్రికల్లో కేవలం ఇక్కడి సాంఖ్య, వేదాంత,

ద్వైతాద్వైతాలను గురించికాక ఇంకేవిధమైన విమర్శలూ ఉండవు. ఇందువల్లే మధ్యమధ్యలో నాకిలా అనిపిస్తుంటుంది. ఏంచెయ్యను చెప్పండి? ఒకవేళ తమ పత్రికలో ఇట్టివాటికి స్థానం లేకపోతే (స్థానం ఉండటం అసంభవం) ఈ రకమైన విమర్శలు ప్రచురించే పత్రిక ఇంకేదైనా వున్నదేమో తెలుపగలరా?

తమరు నాకు ఆపకుండా ఉత్తరాలు వ్రాస్తూ వుండండి. వ్రాయకపోతే నాకేమీ బాగావుండదు. ఇది కూడ ఒకపనే అనుకోండి. రచనలు రిజిస్టర్ పోస్టులోనే పంపుతాను. ఖర్చు తమ రెందుకు భరించాలి? తమ వద్దనుండి ఖర్చులు తీసుకోవాల్సిన దుస్థితిలో లేను. ఇంకెప్పుడూ ఇలా వ్రాయకండి.

తమరు సిరి సంపదలతో తులతూగాలని నేను ఆశీర్వదిస్తున్నాను. అదే నాకు పారితోషికం.

'చంద్రనాథ్'ఇప్పుడికఅడగకండి. ఒకవేళ అవసరమయ్యేటట్లయితే నేనే మళ్ళీ వ్రాస్తాను. అది మొదటిదే మెరుగనిపించేటట్లుగా మాత్రం వుండదు.

నా మూడురకాల పేర్లనుగురించి తమ అభిప్రాయమేమిటి? దీనివల్ల వీలుగా వుంటుందని నా ఉద్దేశ్యం. ఒకే పేరుతో ఎన్నో వ్రాయడం బాగుండదు. ఏమంటారు?

ఉపేంద్రు డేమంటాడు? అతడు ఉత్తరంవగైరా వ్రాసేటట్లు లేడు. అత డుండటంవల్ల చాల వీలుగా వుండేది. లేకపోయినందువల్ల ఎంతో ఇబ్బంది కలుగుతున్నది. అతనికి మీరంటే

అమిత ఇష్టం. అతనితో పనిచేయించేటట్లయితే ఏమాత్రం విసుగుచెందడు.

ఏది ఎలాజరిగినాసరే గాబరా పడవద్దు. చింతించవద్దు. నేను తమను విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్తాననిగాని ఏ ప్రలోభంవల్లనైనా పోతాననిగాని ఎప్పుడూ భావించవద్దు... నాదంతా దోషాలతోనే నిండిలేదు.

ఇతర పత్రికలవాళ్ళు నన్ను బలవంత పెడుతారని నన్ను హెచ్చరిస్తూ ఇదివరకు తమరు నాకు ఉత్తరాలు వ్రాసేవారు. అలానే జరుగనివ్వండి. దానధర్మాలు ఇంటినుంచే ప్రారంభమౌతాయన్నది నిజమేగదా! త్వరగా జవాబివ్వండి. నా ఆశీర్వాదాలు స్వీకరించండి.

శరచ్చంద్ర చటోపాధ్యాయ.

ప్రమథనాథ భట్టాచార్యునకు వ్రాసినది.

డి. ఏ. జి. ఆఫీసు,
రంగూను, 26-3-12.

ప్రమథ్,

నీ ఉత్తరం అందినది. ఇవాళే జవాబుగూడా వ్రాస్తున్నాను. సాధారణంగా ఇలా జరగదు. నా స్వభావం తెలిసిన వారి ఎదుట స్వీయవివరణ ఎక్కువ చెప్పుకోవడం అనవసరం...

...నాగురించి తెలుసుకోవా లనుకుంటున్నావు! సరే. సంక్షిప్తంగా కొన్ని విషయాలు ఇవి——

1. పట్టణం వెలుపల నదిఒడ్డున ఒకచిన్న యింట్లో ఉన్నాను.

2. ఉద్యోగం చేస్తున్నాను. 90 రూపాయల జీతం. 10 రూపాయల అలవెన్సు. ఒక చిన్న దుకాణంకూడా ఉంది. తినడానికి వుండడానికి సరిపోతుంది. మూలధనం సున్న.

3. మానసిక రోగాలున్నాయి. ఏకుణమైనా...

4. చదవడమైతే చాలా జరిగింది. కాని వ్రాసినది మాత్రం పూజ్యం. గత పది సంవత్సరాల్లో శరీరశాస్త్రం మానసికశాస్త్రం, కొంతచరిత్ర, శాస్త్రాలుకూడా చదివాను.

5. అగ్నిప్రమాదంవల్ల అంతా తగలడిపోయింది. పుస్తకాలయంమతానూ. 'చరిత్రహీను'ల పాండులిపికూడాపోయింది. నాలుగైదువందల పేజీల స్త్రీ చరిత్ర వ్రాశాను, అదికూడా కాలిపోయింది.

ఈ సంవత్సరం అచ్చు వేయిద్దామని అనుకున్నాను, కాని నా ద్వారా జరిగేయోగం ఉన్నట్లులేదు. అందుచేతనే అంతా 'స్వాహా' అయిపోయింది. మళ్ళా మొదలు పెడదామన్నా ఉత్సాహం పోయింది. 'చరిత్రహీనులు' 500 పేజీలు వ్రాశాను. పూర్తి కావచ్చింది. అంతా తగలడిపోయింది...

...నీకు మరొకవిషయం చెప్పవలసిఉంది. మూడు సంవత్సరాలక్రిందట తొలిసారిగా హృద్రోగ లక్షణాలు కనపడినప్పుడు చదవడం మానివేసి తైలచిత్రములు రచించడం ప్రారంభించాను. ఈ మూడు సంవత్సరాలలో ఎన్నోచిత్రాలు పూర్తిచేశాను. అవన్నీకూడా భస్మీభూత మైపోయాయి. చిత్రరచనాసామగ్రిమాత్రం మిగిలింది.

ఇప్పుడు నేనేమిచెయ్యాలో కాస్త చెబితే కొంతకాలం నీ సలహా ప్రకారమైనా నడుచుకుంటాను. నవలారచనా? చరిత్ర రచనా? లేక చిత్రకళా? దేన్ని పునఃప్రారంభించను? కాస్త చెప్పు.

నీ స్నేహితుడు,

శరత్

శరత్ బాబుచే లేఖలు వ్రాయబడిన మిత్రులు రచయితలు
పత్రికా సంపాదకుల

పరిచయము

లీలారాణి గంగోపాధ్యాయ్:—శరత్ బాబుశిష్యురాలు, కథారచయిత్రి.

భూపేంద్రకిశోర్ రక్షితరాయి:—విప్లవవాది, 'వేణు' పత్రికా సంపాదకుడు. శరత్ బాబు మిత్రుడు.

కృష్ణేంద్రు నారాయణ భౌమిక్:—'భోట్ రంగ్' అనే హాస్యరస పత్రికా సంపాదకుడు. శరత్ బాబు భక్తుడు.

అవినాశచంద్ర ఘోషాల్:— శరత్ బాబు మిత్రుడు. 'వాతాయన్' పత్రికా సంపాదకుడు.

మతిలాల్ రాయి:-అరవిందభక్తుడు. అనుచరుడు. 'ప్రవర్తక సంఘం', బ్యాంకు, భీమాకంపెనీ, పారిశ్రామిక సంస్థల సంచాలకుడు. 'ప్రవర్తక' పత్రికా సంపాదకుడు. తత్వశాస్త్రవేత్త.

పశుపతి చటోపాధ్యాయ:- నాటకరచయిత, జర్నలిష్టు, శరత్ బాబు భక్తుడు.

జహానారాచౌధరీ:—'వర్షవాణి' 'బేగం'పత్రికల సంపాదకురాలు.

కాజీ అబ్దుల్ వదూద్:—నిఘంటుకర్త, వ్యాసరచయిత, నవలాకారుడు.

ఉమాప్రసాద్ ముఖోపాధ్యాయ:— సాహిత్య రసికుడు. 'వంగవాణి' సంపాదకుడు. శరత్ బాబు 'పథేర్ దాబీ' తొలిసారిగా ఈ పత్రికలోనే సీరియల్ గా ప్రకటింపబడింది.

రవీంద్రనాథ్ టాగూర్:—విశ్వకవికి పరిచయమేమిటి?

చారుచంద్ర వంధ్యోపాధ్యాయ:— విదేశీసాహిత్య ఛాయలో డజన్లకొద్దీ నవలలు రచించారు. 'రవిరశ్మి' అని రవీంద్రనాథ్ నుగురించి ఒక పుస్తకం వ్రాశారు.

హేమేంద్ర కుమార రాయి:—అనేక నవలలు, కథలే గాక, పరిశోధక నవలలుకూడ రచించారు.

దిలీప్ కుమార రాయ్:—సుప్రసిద్ధ నాటకకర్త ద్విజేంద్రలాల్ రాయ్ కుమారుడు. నవలాకారుడు, వ్యాసకర్త, సంగీత పాటకుడు, అరవింద భక్తుడు. ఈయన నవలలు, వ్యాసాలు చాలా ప్రసిద్ధిచెందినవి. శరత్ బాబు నిష్కృతిని ఇంగ్లీషులోకి అనువదించారు.

ఫణీంద్రనాథ్ పాల్:—'యమున' పత్రికా సంపాదకుడు. మొదట్లో ఈ పత్రికయందే శరత్ బాబు రచనలు ప్రకటింపబడి సాహిత్యరంగంలో ప్రసిద్ధిచెందాడు.

ప్రమథనాథ్ భట్టాచార్య:—శరత్ మిత్రుడు. సాహిత్య రసికుడు.